# లోకానికి నేనే వెలుగు



## చిన్ని మార్గము - దైన్య మార్గము
## సామాన్యులకు సుగమ మార్గము

సంపుటి-44 ఏప్రిల్- జూన్ సంచిక-2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 44 ఏప్రిల్-జూన్ 2021 సంచిక: 2

# చిన్ని మార్గము - దైన్య మార్గము
# సామాన్యులకు సుగమ మార్గము

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**

ప్రధాన సంపాదకులు
మరియు
సంచిక సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం,
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
E-mail: stjohnshyd2@gmail.com
Website: stjohnseminary.org

# విషయసూచిక

సంపాదకీయం........................................................ 4

1. పునీత చిన్న తెరేసగారి చిన్ని మార్గము
*- బ్రదర్ మెట్టు శ్రావణ్*.................................................. 7

2. సువార్తా గురు పరిచర్య దృష్టి కోణంలో
పునీత జాన్ మరియ వియాన్నిగారి జీవితం
*- బ్రదర్ శీలం విమల రాజు*........................................... 52

3. ద్వితీయ వాటికన్ మహాసభల ఆసక్తికర బహుమానం -
సామన్య క్రైస్తవుల పాత్ర
*- ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్ (తెలుగు సేత)*........................ 99



# సంపాదకీయం



దేవుని సానిధ్యంలో గడిపి, దైవవరాలను రాబట్టుటలో అనేక మార్గాలు ఉండవచ్చు. ఒకరు అనునిత్యం త్యాగాలు చేసుకుంటూ ధార్మిక సేవలు అందిస్తు, ముక్తిమార్గంలో పయనించవచ్చు. మరొకరు ఎల్లవేళలా ప్రకృతిని, ఇతరులను ప్రేమిస్తు, ఆనందపథంలో జీవించవచ్చు. ఇంకొకరు తెలివితేటలు ఉన్నా చిన్నచిన్న పనులతో దేవుని సంతృప్తి పరచవచ్చు. వేరొకరు శాస్త్రజ్ఞానం అంతగా లేకున్నా తాను చేయవలసిన పనిని త్రికరణ శుద్ధితో చేస్తు, పరమ పితను ఆకట్టుకొనవచ్చు. ఇలా ఎవరికి నప్పిన సాధనను వారు మంచి మనసుతో చేస్తున్నప్పుడు అది దేవాదిదేవునికి ప్రీతికరంగా ఉంటుంది. దేహమే దేవాలయంగా, మనసే మందిరంగా, ఆత్మే తధాత్మ్యంగా మార్పుచెంది, జీవితాన్నే పునీతం చేస్తుంది. తాత్విక చింతనలోకి వెళ్లి, జీవం పరమానందాన్ని పొందుతుంది. అదే దృగ్విషయ పరమార్థం. ఎవరు ఏ సాధన చేసినా అందరూ చేరేది ఒకే చోటికి – అదే మోక్షం – అదే పరమాత్ముని పరమోప స్థానం. నిత్య చైతన్య స్రవంతికి చోటు, నిత్య నూతనాకారునికి నెలవు.

ఎవరు యేవిధానం అవలంభించినా, వారి స్మృతిపథంలో క్రీస్తు విరాజిల్లాలి. అపుడే క్రైస్తవుని దశ క్రీస్తుదిశగా ఉంటుంది. శ్రీసభ చరిత్రలో అనేక మంది పునీతులు కానవస్తారు. వారి జీవితాశయం క్రీస్తే అయినందున వారి దశకూడ ఉన్నతమయ్యింది. అందుకే క్రీస్తునే ధ్యేయంగా పెట్టుకున్నారు. కనుకనే, తెలివితేటలు ఉన్నా లేకున్నా వివేచన , వివేకం కలిగి, సత్ప్రవర్తనతో కైవల్యమందారు. సత్యదేవుని అమృతవాణి సందేశాన్ని సర్వత్రా పాటించి, ప్రజ్ఞను ప్రదర్శించారు. సువిశేష విలువల స్ఫూర్తితో భావితరాలకు మార్గదర్శకులయ్యారు. బాహేంద్రియాల నిగ్రహంతో అంతరేంద్రియాలకు జాగృతిని కల్పించి, దివ్యానుభూతిని పొందారు. అట్టివారిలో పునీతులు బాలయేసు తెరేసా, జాన్ మరియ వియాన్ని. వారి గురించిన

విషయాలను ఈ సంచికలో మీకు అందివ్వడానికి ఇద్దరు బ్రదర్లు ముందుకొచ్చారు.

దైవశాస్త్ర అధ్యయనంలో భాగంగా కాంక్షితాల పాక్షిక పరిపూర్తి నిమిత్తం (Papers submitted in partial fulfillment of the requirement for the Theological Studies) పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నా దర్శకత్వంలో శాస్త్రీయ పత్రాలను (Scientific Papers) వ్రాసారు. వాటినే ఈ సంచికలో మీకు అందజేస్తున్నాము.

**మొదటి పత్రం:** "పునీత చిన్న తెరేసమ్మగారి చిన్నిమార్గము" గురించి బ్రదర్ మెట్టు శ్రావణ్ అందించారు. "అంతా ఇంతింతేనని, స్వంతానుభవముతొ పలికి, ప్రణుతిడ తేజో వంతాత్మకు చిరుపనులే దంతావళమంత . . ." అని కంద పద్యంలో పునీత తెరేసాగారి మనోభావాని తెలిపాను. మనం పెద్ద అద్భుతాలు, బృహత్తర కార్యాలు చేసి, దేవుని మెప్పించనక్కర లేదని, చిట్టి చిట్టి పనులతోనే: అనగా మన దైనందిన జీవితంలో చేయవలసిన పనులను మనసుపెట్టి, దేవుని మహిమకొరకు చేస్తే చాలని – అదే దైవరాజ్య విస్తరనకు, మోక్షరాజ్యమందుటకు సరిపోతుందన్న జీవితపాఠాలు పునీతురాలు నేర్పారని పత్రం మనకు తెలుపుతుంది. "ధనము వలదు, గొప్ప వలదు. ధనగొప్పల మంచిప్రేమ దయతో నిడుమా మనమున, క్రీస్తు నిను నిలిపిన చాలది మోక్షమంటి చిన్న తెరేసా!" ఈ పద్యంలో ఆమె క్రీస్తు ప్రేమను కోరుకుంటుంది. అలా ప్రతీ క్రైస్తవబిడ్డ దేవునిప్రేమను కోరుకోవలసి ఉంది. ఆవిషయాన్నే పత్రం మనకు తెలుపుతుంది. ఈ విధంగా అందించుటలో కృతికర్త కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు.

**రెండవ పత్రం:** "సువార్తా గురుపరిచర్య దృష్టికోణంలో పునీత జాన్ మరియ వియాన్నిగారి జీవితము" గురించి బ్రదర్ సీలం విమల రాజు అందించారు. గురువు కావలసిన వారికి మొట్టమొదటగా కావలసినది దైవపిలుపు. ఇది లేకుండా ఎవరూ గురువు కాలేరు. ఇక పిలుపును అందుకున్న వారికి కావలసిన లక్షణాలు: భక్తిప్రపత్తులు, జ్ఞానం, ఆరోగ్యం. భక్తిప్రపత్తులతో విశ్వాసులను ప్రభు అనుచరులుగా చేయాలి. జ్ఞానంతో వారిని క్రీస్తు వెలుగులో నడిపించాలి. ఆరోగ్యంతో వారిని పరామర్శించి, సాయం అందించాలి. ఏదున్న లేకున్నా మొదటి లక్షణం మాత్రం అత్యవసరం. ఆ లక్షణాన్నే పుణికిపుచ్చుకొని, అత్యంత ఉన్నతమైన గురుజీవితం గడిపి, గురువు లందరికి పాలక పునీతుడైన గొప్ప జీవి జాన్ మరియ వియాన్నీ. అతని సువార్తా పరిచర్య గురుజీవితాన్ని అక్షరబద్ధమైన ఈ పత్రాన్ని పఠించండి.

మా పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఆలోచనమేరకు “సామాన్య క్రైస్తవుల పాత్ర” ను మీకు ఈ సంచికలో అందజేస్తున్నాం. ద్వితీయ వాటికన్ మహాసభలో సామాన్య క్రైస్తవుల గురించి తయారుచేసిన “లోకానికి వెలుగు శ్రీసభ,” “ఆధునిక ప్రపంచంలో శ్రీసభ,” “సర్వక్రైస్తవ సమైక్యత,” “లోకరక్షా ఉద్యమము - శ్రీసభ ధర్మం” అనే నాలుగు పత్రాల ఆధారంగా శ్రీసభకు చెందిన సామాన్య క్రైస్తవ కార్యనిర్వాహక సంఘంవారు ఒక పత్రాన్ని తయారుచేసారు. గత సంవత్సరం ఆంగ్లంలో ఉన్న ఆపత్రాన్ని తెనుగించమని నాకు అప్పగించిన దరిమిళా కాలశ్రమల వ్యయాన్ని అధిగమించి, వారికి తెలుగులో పత్రాన్ని అందించాను. గత నవంబరులో శ్రీకాకులంలో ఉపదేశుల సదస్సులో ప్రధానవక్తగా ఈ పత్రంనుండి కొన్ని అంశాలను వారికి ప్రసంగించాను. అప్పుడు ఉపదేశకులు ఎంతగానో ఉత్సాహపడ్డారు. కావున, శ్రీసభలో సామాన్య క్రైస్తవుల పాత్రను గుర్తుచేయుటకు ఈ పత్రం ఉపయోగపడు తుందని తెలుగు శ్రీసభకు చెందిన సంఘ సభ్యులు - బ్రదర్ వర్గీస్ ఇతేరా, సిస్టర్ మేరి ప్రకాశిల సౌజన్యంతో దీనిని మీకోసం అందజేస్తున్నాం.

ఈ విధంగా ఈ సంచిక “చిన్ని మార్గము - దైన్య మార్గము, సామాన్యులకు సుగమ మార్గము” ను వెలువరించుటకు సహకరించిన రచయిత గురువిద్యార్థులకు శుభాశీస్సులు. సహకరించిన తోటి సంపాదకులకు వందనాలు. ప్రతులను పంపిణీచేయుటలో ఉపయుక్తంగా సాయమందించిన జోసఫ్ బృందానికి, మా హృదయపూర్వక సన్నుతులు. ఆర్థిక సహాయమందించిన కోసాధికారి, ఫాదర్ అంబటి అర్లాగారికి నమస్సుమాంజలులు. జీవన్ ఇన్సిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ వారికి, సహకరించిన వారందరికి, ముఖ్యంగా మా ప్రియ పాఠకులకు ప్రశంసలను అందిస్తున్నాము. ప్రధాన సంపాదకునిగా ఇది నా చివరి సంచిక. గత ఆరు సంవత్సరాలుగా చందాధారులు నన్ను ఆదరించారు. అందుకు వారికి నా కృతజ్ఞతలు. ఇలానే నా తదుపరి వచ్చే ప్రధాన సంపాదకులు ఫాదర్ పిల్లి అంతోనిదాసుగారిని ఆదరించగలరని ఆశిస్తూ . . .

ఇట్లు ప్రభు సేవలో ...
**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**సంచిక సంపాదకులు**

# 1. పునీత చిన్న తెరేసగారి చిన్ని మార్గము

– బ్రదర్ మెట్టు శ్రావణ్



## ఉపోద్ఘాతం

చిన్న తెరేసగారి గురించి ఎంతో వ్రాయబడింది. ఆమె బోధనల యొక్క విలువలను నొక్కి చెప్పడంలో జగద్గురువులు ఎంతో ఆనందం పొందారు. 11వ భక్తినాధ పాపుగారు ఆమెను "దేవుని వాక్యము" అని, "ఆధ్యాత్మిక జీవితానికి ఒక గొప్ప గురువు" అని సంబోధించారు. ఆమెను దేవుడు మన రక్షణకు ఖచ్చితమైన మార్గం చూపించడానికి ఒక మార్గచూపరిగా పంపించాడని, "మనలను పరిపూర్ణతకు తీసుకరావడానికి సులభమైక మార్గం" అని సంబోధించారు.

పునీత చిన్న తెరేస పేరు వినగానే సున్నితత్వం, వినయం, ఓర్పు, నిరాడంబరత, దీనత్వం అనే సుగుణాలు మదిలో మెదలుతాయి. మఠకన్యల మఠంలో ఉంటూ రోజువారి పనులను చక్కగా చేస్తూ, మరీ ముఖ్యంగా చిన్న పనులను సహితం ఒక తపస్సులాగా చేసే మౌనముని పునీత చిన్న తెరేస. తను తప్పు చేయకపోయిన వాదించక క్షమాపణలు అర్థించే వారు. "క్షమాపణ అడిగినంత మాత్రాన తప్పు చేసినట్లు కాదని, క్షమాపణ అర్థించుటలోనే మనశ్శాంతి ఉందని" తెలియజేశారు. తన మఠంలో చిన్న చిన్న పనులనే పెద్ద ప్రేమతో, ఓర్పుతో, చిరునవ్వుతో చేసేవారు. ఆమె చిన్న పనులను చేస్తూ తిరుసభలో చిరస్మరణీయమైంది. ఎంత పెద్ద ఘనకార్యాలు చేశాము అన్నది ముఖ్యం కాదు, ఎంత ప్రేమతో చేశాం అన్నది ముఖ్యమని తెలియజేశారు.

క్రీస్తు ప్రభువు కూడా “స్వల్ప విషయములలో నమ్మదగిన వాడు గొప్ప విషయములలోనూ నమ్మదగినవాడుగా ఉండును” (లూకా 16:10) అని తెలియజేస్తున్నారు. ఎవరి గుర్తింపుకు నోచని లెక్కలేనన్ని చిన్న చిన్న పనులు చేసి, సాక్షాత్తు దేవుని గుర్తింపు పొందిన పునీత చిన్న తెరేసమ్మ మనకు నిలువెత్తు నిదర్శనం.

చాలామంది తాము పెద్ద పెద్ద ఘనమైన పనులను మాత్రమే చేస్తాం. చిన్న పనులెవరు చేస్తారు? చిన్న పనులు చేస్తే మా పరువు ప్రతిష్టలు ఏం కావాలి? అని ఎన్నో కారణాలతో పెద్ద పెద్ద పనుల కోసం వేచి చూస్తుంటారు. నిజానికి ఇతరులు చేసే పనులను మనం చిన్నవి గానూ, పెద్దవిగానూ పరిగణిస్తుంటాము. కాని పనులలో చిన్నవి, పెద్దవి అంటూ ఏమి ఉండవు. చూసే దానిని బట్టి పెద్దవిగానూ, చిన్నవిగానూ కనిపిస్తాయి. ప్రతి ఘనమైన పని కూడా చిన్న ప్రారంభంతోనే మొదలవుతుంది.

తెరేసగారి యొక్క రోజువారీ జీవితంలో ఈ చిన్న విషయాలు ఎందుకు అంత ముఖ్య మైనవి అని మీరు ఆలోచిస్తూ ఉండవచ్చు. తెరేస ఒక పునీతురాలు అయ్యింది గొప్ప విజయాలు, త్యాగాల వల్ల కాదు, కానీ ఆమె రోజువారీ జీవితంలో చిన్న విషయాలను ఎంతో ప్రేమతో కాపాడుకున్నందున, యేసు ప్రేమ కోసం ప్రతి క్షణం పూర్తిగా జీవించడానికి ప్రయత్నించింది. ఇది పవిత్రతకు ఆమె మార్గం. ఆమె దీనినే “చిన్ని మార్గము” అని పిలిచింది.

ఆమె చిన్నవయస్సులో ఉన్నప్పటికీ, అధికారం లేదని అనిపించినప్పటికీ, ఆమె “ఒక చిన్న మార్గం చాలా సరళంగా “ నేర్పింది. ఇది ప్రజలను పరిపూర్ణతకు దారి తీస్తుంది. కొందరు పవిత్రతను సాధించడం కష్టమని ప్రకటించారు, కాని అది చాలా సులభం అని ఆమె అన్నారు. పవిత్రంగా మారడానికి, అనేక పద్ధతులలో నిమగ్నమవ్వడం, కఠినమైన తపస్సులను రూపొందించడం లేదా అసాధారణమైన కృపలను పొందడం అవసరం లేదని తెరేస పేర్కొన్నది. మనకు అవసరమేమిటంటే, మన “శూన్యతను” గుర్తించి, ప్రేమతో, విశ్వాసంతో దేవున్ని సంప్రదించడం. పవిత్రత, అంతర్గత స్వభావం మనలను వినయపూర్వకంగా

దేవుని చెంతకు చేరుస్తాయి. తెరేస కొత్త సత్యాలను వెల్లడించలేదు, లేదా పరిపూర్ణతను సాధించడానికి ఆమె కొత్త మార్గాలను నేర్పించలేదు. ఆమె సిద్ధాంతం క్రొత్త రకమైన పవిత్రతను బహిర్గతం చేయలేదు, కానీ మనకు పవిత్రతను వెల్లడించే కొత్త మార్గం. ఆమె బోధించేది సువార్తలో వెల్లడైనట్లుగా దేవుని జ్ఞానం నుండి ప్రవహిస్తుంది.

తెరేస యొక్క లక్ష్యం మనకు “విశ్వాసం మరియు ప్రేమ యొక్క మార్గం” నేర్పడం. ఆమె చిన్న మార్గం చాలా చిన్నది, ఈ మార్గం దేవున్ని ప్రేమించడానికి నేరుగా దారితీస్తుంది. ఆమె దీనిని “ఆధ్యాత్మిక బాల్యం యొక్క మార్గం” అని పిలిచింది.

నేను ఈ పాఠ్యాంశమును నాలుగు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయాంలో పునీత చిన్న తేరేసగారి జీవిత చరిత్ర గురించి, రెండవ అధ్యాయంలో ఆమె యొక్క “చిన్ని మార్గం” గురించి, మూడవ అధ్యాయంలో అమె అనుసరించిన చిన్ని మార్గములను గురించి, చివరిగా నాలుగవ అధ్యాయంలో మన జీవితంలో తెరేసగారి ఆదర్శంగా తీసుకోని ఎలా జీవించాలో వివరించాను.

# 1. పునీత చిన్న తెరేసగారి జీవిత చరిత్ర

## 1.0. ఉపోద్ఘాతం

పునీత చిన్న తెరేస ఈ లోకంలో కేవలం 24 సంవత్సరాలు మాత్రమే జీవించారు. చిన్న పనులు గొప్ప ప్రేమతో చేసి మనందరికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. మరి ఆ పునీతురాలు ఎలా జీవించారు. వారి జీవిత చరిత్ర ఎంటో, వారి కుటుంబం గురించి, వారి మఠకన్య జీవితం గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

## 1.1. పునీత చిన్న తెరేసగారి కుటుంబం

పునీత చిన్న తెరేసగారు ఫ్రాన్స్ దేశంలోని అలెన్సో నగరంలో 1873 జనవరి 2వ తేదీన మార్టిన్, సెలీల తొమ్మిదవ బిడ్డగా జన్మించినది. తెరేస

తండ్రి పేరు లూయిస్ మార్టిన్. ఆయన తండ్రి ఫ్రాన్స్ దేశ సైన్యంలో ఒక ఉన్నతాధికారి. మిలిటరీ కుటుంబంలో జన్మించడం అంటే, క్రమ పద్ధతి, వృత్తికి ప్రాధాన్యత మొదలైన విలువలు జీవితంలో భాగంగా మారుతాయి. ఈ సత్యం మార్టిన్ జీవితంలో కూడా నిజమైంది. కాని అతనికి చిన్ననాటి నుండి చదువు అంతగా వంటపట్టలేదు. స్వభావరీత్యా ఒంటరితనం నిశ్శబ్దత అంటే మార్టినుకు ఎంతో మక్కువ. అందుకే 20 సంవత్సరాల వయస్సులో తన జీవితాన్ని ప్రార్థనలోను, తపో క్రియలలోనూ గడపదలచి ఒక సన్యాస మఠంలో చేరాలని ప్రయత్నించాడు. కాని ఆయన కోరిక ఫలించలేదు.

దానితో తన భావి జీవితపు వృత్తి అయిన గడియారాలు బాగు చేయడం పై దృష్టిని నిలిపాడు. అలెన్సో నగరంలో ఒక ఇల్లు కొనుక్కుని తన వృత్తిని ప్రారంభించాడు. ఎంతో నిజాయితీగా కష్టపడి పనిచేసి, అనతి కాలంలోనే ధనంతో పాటు మంచి పేరును కూడా సంపాదించుకున్నాడు.

## 1.1.2. మార్టిన్, సెలీల వివాహం

మార్టిన్ ఎంతో విశాలమైన హృదయంగల వ్యక్తి. చాలా నిజాయితీపరుడు. జీవితాంతం బ్రహ్మచారిగానే జీవించాలని నిర్ణయించుకున్నాడు. కానీ అనుకోకుండా 35 సంవత్సరాల వయస్సులో ఒకరోజున ఓ యువతిని చూశాడు. అంతే వారి నాలుగు కళ్ళు క్షణాల్లో కలిసిపోయాయి. తొలి చూపులోనే ప్రేమలో పడ్డారు. ఆ అమ్మాయి పేరు సెలీ. సెలీ కూడా మార్టిన్ వలె మిలిటరీ పరిసరాలలో పుట్టి పెరిగింది. ఆమె తండ్రి సైన్యంలో సిపాయిగా పనిచేసేవాడు. సెలీ బాల్యంలో తల్లి ప్రేమకు నోచుకోలేక పోయింది.

యవ్వనారంభంలో సన్యాసిని మఠంలో చేరాలని సెలీ కూడా ఆశించింది. కాని అనారోగ్య కారణం వలన ఆమె ఆశ ఫలించలేదు. అందువలన లేసులు తయారు చేసే వృత్తిని చేపట్టింది. సెలీ ఎంతో తెలివి తేటలు కలిగిన వివేకవంతురాలైన పనిమంతురాలు. పైగా దేవునిపట్ల భయభక్తులు గల మహిళ, కనుకనే అనతికాలంలోనే ఈ వృత్తిలో ఎంతో విజయాన్ని సాధించింది.

జూలై 13, 1858లో మార్టిన్, సెలీల వివాహం అలెన్సో నగరంలో జరిగింది. అప్పటికి మార్టిన్ వయస్సు 35, సెలీ వయస్సు 27 సం.లు. ఒకరు లేసుల తయారీలో ఆరితేరిన వారు కాగా, మరొకరు గడియారాల వృత్తిలో సిద్ధహస్తులు.

### 1.1.3. మార్టిన్, సెలీల దంపతులకు సంతాన భాగ్యం

సెలీకు పిల్లలంటే అపారమైన ప్రేమ. ఎక్కువ మంది బిడ్డలు కావాలని ఎంతో ఆశించిందామె. ఆమె ఆశించిన విధంగానే దేవుడు వారికి తొమ్మిది మంది బిడ్డలనిచ్చి దీవించాడు. వారిలో ఏడుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కాని విషాదకరమైన విషయమేమిటంటే బాల్య కాలపు అస్వస్థత వల్ల ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు మరణించారు. ఈవిధంగా వివాహం అయిన 15 సం.ల వరకు జననం, మరణం నాణెం పై గల బొమ్మ బొరుసుల వలె ఆ పుణ్యదంపతుల ముందు తారాడాయి. సంతోషం, దుఃఖం వారి జీవితంలో భాగంగా మారిపోయాయి. కాని వారి దృఢమైన విశ్వాసం వారిని నిరాశకు లోను కాకుండా కాపాడింది. సంతోష సమయంలో చిందులు వేయడం, కష్ట సమయంలో కృంగి పోవడం సెలీ వ్యక్తిత్వం కాదు. రెంటిని సమతుల్యంగా స్వీకరించి, అంతా దైవ చిత్తంగా భావించేది ఆమె. (యోబు. 2:10). సెలీ ఎంతో భక్తురాలు. ప్రార్థన, క్రైస్తవ సాంప్రదాయాలను తు.చ తప్పకుండా ఆచరించేది. ఆమె దైవభీతి వలననే వారి తక్కిన అయిదుగురు బిడ్డలు మరియ, పౌలిన్, లియోన, సెలీన, తెరేస ప్రభువు కొరకు ప్రకాశించారు.

### 1.1.4 కుటుంబ ప్రార్థన, దయాగుణం

దైవభీతి గల అనురాగమయ కుటుంబం వారిది (లూకా 1:6). ఆ కుటుంబంలో ప్రథమ స్థానం దైవానిదే. వారి విశ్వాసం అమోఘం. తత్ఫలితంగా జీవితంలో ఎదురయ్యే ప్రతి నంఘటనలోనూ దేవుని హస్తాన్ని చవిచూచేవారు. ప్రార్థన, దివ్యబలిపూజ వారి కుటుంబ జీవితంలో ముఖ్యమైన ఘట్టాలు. కుటుంబంలో అందరు తీర్థ యాత్రలన్నా, ఉపవాసాలన్నా ఎంతో కుతూహలాన్ని చూపేవారు. పేదవారికి ఆప్యాయాన్ని చూపించే కుటుంబమది. భార్యకు తెలియకుండా భర్త, భర్తకు తెలియకుండా భార్య పేదలకు పలు విధాలుగా

సహాయం చేస్తు ఉండేవారు. సెలీ పనిలో ఎంత నిమగ్నమై ఉన్నప్పటికిని చుట్టుప్రక్కల ఉన్న అనారోగ్యులను, వృద్ధులను సందర్శించడం, సాధ్యమైతే వారి యొక్క ఆలనా పాలనలు చూడటానికి ఎంతో ముందంజ వేసేది. ఇటువంటి సద్గుణవంతులైన తల్లిదండ్రులకు జన్మించిన ఆ బిడ్డలెంత ధన్యులు! చిన్ననాటి నుంచి వారు తమ బిడ్డలకు నేర్పించిన పాఠాలు ఇవే. వారికి వృత్తిని నేర్పించలేదు. కాని వారికి జీవిత శైలిని, విలువలను, మత సాంప్రదాయలను మాత్రమే నేర్పించారు.

## 1.2. తెరేసగారి బాల్యం

స్వర్గాన్ని మరపించే దైవభీతి గల కుటుంబంలో తొమ్మిదవ బిడ్డగా జన్మించింది చిన్నారి తెరేస. తల్లిదండ్రులకు గారాలు పట్టి. నలుగురు అక్కలకు ముద్దుల చెల్లి. జన్మించిన రెండవ రోజే తెరేసకు జ్ఞానస్నానాన్ని యిప్పించారు. ఆమె పూర్తి పేరు మరియ ఫ్రాన్సిస్ తెరేస మార్టిన్. అమ్మ అనురాగం, నాన్న ఆప్యాయత, అక్కల ముద్దులు ఇవే తెరేస లోకం. తల్లికి ప్రాణంగా మారింది తెరేస. బంగారంలాంటి హృదయం, దేవదూత యొక్క ముఖఛాయ ఆమెలో ఉంది." ఇంతటి ఆప్యాయానురాగాలతో పెంచినా, సెలీ దేవుని పై భయభక్తులను కూతురుకు ఎంతో శ్రద్ధగా నేర్పించేది.

తన బాల్య జ్ఞాపకాలను గూర్చి తన స్వీయ చరిత్రలో ఈ విధంగా వ్రాస్తుంది తెరేస. "నేను ప్రేమానురాగములతో పెంచబడుటను ప్రభువు కోరుకున్నారు. నా బాల్య జ్ఞాపకాలన్నీ ముద్దులు, చిరునవ్వులమయమే. దేవుడు నా చుట్టూ ప్రేమను సృష్టించటమేగాక నా చిన్న హృదయంలో కూడా ఆప్యాయానురాగాలను నాటారు. నేను అమ్మను. నాన్నను ఎంతో ప్రేమించాను. నాకు గల ప్రేమను వెల్లడి చేయడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నించేదాన్ని."

## 1.3. చిన్న తెరేసగారి తల్లి మరణించుట

చిరునవ్వులు, మమతానురాగాల మధ్య సాగుతున్న ఈ ఆనంద నిలయంలో అకస్మాతుగా తుఫాను చెలరేగింది. తెరేస తల్లి సెలీకి క్యాన్సరు వచ్చింది. కలవరం మార్టినును దహించి వేసింది. ఇప్పటి వరకు కుటుంబాన్ని, వ్యాపారాన్ని

కూడా సెలీయే ఎంతో సమర్థవంతంగా నడిపిస్తూ వచ్చింది. మార్టిన్ మాత్రం పలు తీర్థయాత్రలకు వెళ్తుండేవాడు. అకస్మాత్తుగా కుటుంబ బాధ్యత, వ్యాపారం బాధ్యత ఒక్కసారే తనపై బడడం మార్టినుకు భారమైపోయింది. అంతకుమించి ప్రేమించి పెళ్ళి చేసుకున్న ప్రియమైన సెలీ అనారోగ్యం ఆయన్ను క్రుంగదీసింది. కాని సెలీ మాత్రం తన మరణం కళ్ళముందే తారాడుతున్నా ఏ విధంగాను తొణకలేదు. దేవునిపట్ల అత్యంత విశ్వాసం కలిగిన వ్యక్తి కనుక, ప్రతిసంఘటనలోను దేవుని హస్తమును చూడగలిగింది. దైవ చిత్రానికి తలవంచి నిగ్రహంగా నిలబడగలిగింది.

తాను మరణించిన తరువాత రాబోయే పరిస్థితి అర్థం చేసుకొని సెలీ తన చిన్న కుమార్తెలను పెంచడానికి తన పెద్ద కుమార్తెలైన పౌలిన్, మరియలను సిద్ధం చేయనారంభించింది. ఈ విషయంలో పౌలీన్ కు సెలీ ఈ విధంగా వ్రాసింది. “మన చిన్నారులు సెలీన, తెరేసలు నన్ను అసలు కష్ట పెట్టడం లేదు. చాలా బుద్ధిమంతులుగా తయారయ్యారు. తప్పకుండా మంచివారవుతారు. నీవు వారిని చక్కగా పెంచగలుగుతావు. సెలీన చిన్న తప్పు కూడా చేయదు. తెరేస కూడా అంతే. ప్రపంచంలో ఉన్న బంగారం అంతా యిచ్చినా కూడా ఒక్క చిన్న అబద్ధం కూడా చెప్పదు. ఆమెలో ఉన్న ఆత్మను మరెవ్వరిలోనూ చూడలేదు. అంత ప్రత్యేకమైన ఆత్మ దేవుడు తెరేసకు ప్రసాదించారు.”

నయంకాని అనారోగ్యానికి, దైవ చిత్తానికి తలవంచింది సెలీ. ముత్యాల్లాంటి అయిదుగురు ముద్దు బిడ్డలను కని పెంచినందుకు, పుణ్యశీలుడైన భర్తకు ఇన్ని సంవత్సరములు సేవ చేయు కృపనిచ్చినందుకు ఆ దేవదేవునికి కృతజ్ఞతలర్పించినది. 1877 ఆగష్టు 28న భర్త ఒడలో సంతృప్తిగా కన్నుమూసింది సెలీ. అప్పటికి తెరేస వయస్సు నాలుగు సంవత్సరాలు. సెలీనా వయస్సు ఎనిమిది సంవత్సరాలు. తెరేస తల్లి మరణాన్ని మౌనంగా భరించింది. కన్నీళ్ళు కూడా రాలేనంత ఆవేదన ఆ చిన్నారికి.

### 1.4. చదువు

1886వ సంవత్సరమున తండ్రి తెరేసను పాఠశాలకు పంపుట ఆపి

వేసి ఇంటిదగ్గరే శ్రీమతి పపీను అనే ఉపాధ్యాయిని ద్వారా చదువు చెప్పించారు. ఆ సంవత్సరమున సెలీన ఆ బడిలో చదువు పూర్తిచేసింది. తెరేసకు ఆ పాఠశాలకు వెళ్ళడం అసలు ఇష్టము లేదు. ఇక తెరేస సోదరి తోడుగూడ లేకుండ బడికి వెళ్ళాలి. అదేగాకుండ తరచుగా ఆమెకు తలనొప్పి వలన చాలా అలసిపోయినట్లు అనిపించేది. అందుచే తండ్రి ఓ నిర్ణయాన్ని తీసుకున్నడు. ఆ నిర్ణయం చాలా ఉత్తమమైనదని తరువాత రుజువైంది. ఆ ఉపాధ్యాయిని దగ్గర సుమారు 11 సంవత్సరాలో లేక ఇంకా కొంచెం ఎక్కువ కాలమో చదువుకుంది. తరువాత ఆమెకు 15 సంవత్సరాల ప్రాయం వచ్చినప్పుడు పాఠశాల పద్దతి చదువును మాని వేసింది. అందుచేత ఆ కాలంలో నార్మండి రాష్ట్రంలో సాధారణంగా బాలికలు చదివే చదువు పూర్తి చేసింది.

## 1.5. ప్రథమ దివ్యసత్రసాదం స్వీకరించుట

1884 మే 8న మొదటిసారిగా దివ్యసత్రసాదం స్వీకరించవలసి ఉంది తెరేస. పాఠశాలలో మఠకన్యలు, ఇంటిదగ్గర అక్కలు తెరేసను ఈ గొప్ప దినమునకు సిద్ధం చేయ మొదలు పెట్టారు. తెరేసకు వేదసత్యాలపైగల జ్ఞానానికి అశ్చర్యపడిన విచారణ గురువు ఆమెను "చిన్న పండితురాలు' అని ముద్దుగా పిలిచేవారు. అప్పటికి తెరేస వయస్సు 11 సంవత్సరాలు. నాలుగు సంవత్సరాల వయసునుండే అప్పరూపంలో ఉన్న యేసును స్వీకరించాలని ఆరాటం. ఎన్నో పుణ్యకార్యాలు చిన్న చిన్నవి అయినా ఎంతో శ్రద్ధాసక్తులతో చేస్తుండేది.

దివ్య సత్రసాదానికి ముందు 3 రోజుల వడకం. మొదటిసారిగా ఇల్లు విడచి బయట ఉండవలసివచ్చింది. ఆ మూడు రోజులు కాన్వెంటులోనే పడుకోవాలి. తెరేస ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆమెను జాగ్రత్తగా చూడుమని నాన్న, అక్కలు మఠకన్యలను బతిమిలాడారు. తెరేసను రోజూ వచ్చి చూసే అనుమతిని కూడా పొందారు. యేసును ఎంత త్వరగా స్వంతం చేసుకుందామా అని ఆత్రుతతో చూస్తూ ఉంది తెరేస. మే 7 తానెంతో ప్రేమిస్తున్న తన ప్రియునితో మొదటి సంగమం. ద్రాక్షారసంలో నీటి చుక్కలా దివ్య సత్రసాదమును స్వీకరించిన ఆ పవిత్ర అనుభవం గూర్చి తెరేస ఇలా అంటుంది. "యేసుప్రభువు యొక్క ఆ మొదటి ముద్దు ఎంత మధురమైనది! ఎంత ప్రేమతో

యిచ్చిన ముద్దు అది! ఆ క్షణంలో ఆయన నన్ను ఎంతో ప్రేమిస్తున్న అనుభూతిని పొందాను. ఆ అనుభూతికి ప్రతిగా "యేసూ! నీవంటే నాకెంతో యిష్టం. నీ కోసమే నన్ను నేను పూర్తిగా సమర్పించుకుంటాను" అని వాగ్దానం చేశాను. ఆ రోజు తెరేస ద్రాక్షవల్లిలో రెమ్మలా, ద్రాక్షారసంలో నీటి చుక్కలా యేసులో ఐక్యం అయ్యింది. ప్రభువును తన హృదయరాజుగా స్వీకరిస్తున్నానని తెరేస విశ్వాసం. ఇది చిన్ననాటి నుండి అమ్మా, నాన్న, అక్కలు ఆమెకు నేర్పించిన పాఠం. జపమాల, సొంత ప్రార్థన, ధ్యానం మొదలైన భక్తి కృత్యాలు చిన్ననాడే తెరేసను పవిత్రతలో సగం మెట్లు ఎక్కించాయి. పవిత్రులైన తల్లిదండ్రులు, భయభక్తులతో పెరుగుతున్న నలుగురు అక్కల మధ్య దేవాలయంలాంటి ఆ యిల్లు తెరేసను చిన్ననాడే పునీతురాలిని చేసింది. చిన్న పొరపాటు చేయడానికి కూడా భయపడేది తెరేస. నిర్మలమైన హృదయంతో, స్వచ్ఛమైన మనసుతో పునీతుల యెడల భక్తితో క్రీస్తువలే జీవించడానికి ప్రతిరోజూ కృషిచేస్తుండేది.

### 1.6. భద్రమైన అభ్యంగనము పొందుట

1884, జూన్ 14న భద్రమైన అభ్యంగనంను పొందింది తెరేస. దివ్య సత్రసాదం స్వీకరించిన రోజున యేసు అప్పరూపంలో మన లోనికి వచ్చినట్లే, భద్రమైన అభ్యంగనం ద్వారా పరిశుద్ధాత్మ మన బలపడతారు. వివేకమును, తెలివిని, బుద్ధిని, ధైర్యమును, సైతానును ఎదుర్కొను శక్తిని ప్రసాదిస్తారు. ఆ రోజు తెరేస తన జీవితాంతం వరకు ఎదురయ్యే శ్రమలను సహింపగల పవిత్రాత్మ శక్తిని పొందింది.

"పరిశుద్ధాత్మను పొందిన నాటినుండి దైవ ప్రేమలో నూతనంగ జన్మించిన తెరేస జీవితాంతంవరకు ఎన్ని కష్టములు, కడగండ్లు, కన్నీరు వచ్చినా నా అంతరంగంలోని ప్రశాంతతను, అనందమును నేను ఎన్నడూ కోల్పోలేదు" అని తన ఆత్మకథలో సాక్ష్యమిస్తుంది తెరేస. ఆ రోజు నుండి 'దైవప్రేమ' ఆమె హృదయాన్ని ఆవరించింది. తనను తాను మర్చిపోయి, యితరులను ప్రేమించాలన్న వాంఛ ఆమెలో నానాటికి బలపడసాగింది. పరిశుద్ధాత్మను పొందిన వారిలో వచ్చు మార్పు యిదియే.

## 1.7. మఠకన్యల మఠంలో చేరడానికి ఆటంకాలు

తన తల్లి మరణించిన తరువాత తన రెండవ అమ్మ అయిన పౌలీన్ అక్క కార్మెల్ మఠంలో చేరిన దగ్గర నుండి, తన జీవితాన్ని కూడా ప్రార్థనకై సమర్పించుకోవాలని కోరుకునేది తెరేస. కార్మెల్ మఠంలో చేరాలన్నదే ఆమె జీవిత లక్ష్యం. 1887 మే 29, పెంతెకోస్తు పండుగ రోజున ఈ విషయాన్ని నాన్నగారికి తెలియజేయాలని నిశ్చయించుకుంది. నాన్నగారిని ఒప్పించడానికి కావలసిన ధైర్యమును, శక్తిని దయచేయుమని అపోస్తులులందరకు మొర పెట్టుకుంది. ఆ రోజు సాయంత్రం, నాన్న యింటి ప్రక్కన ఉన్న తోటలో కూర్చుని చేతులు జోడించి ప్రార్థిస్తున్నాడు. తెరేస మెల్లమెల్లగా ఆయనను సమీపించింది. నిశ్శబ్దంగ నాన్న ప్రక్కన కూర్చుంది. కొన్ని క్షణాలలో ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. అది చూసిన తండ్రి చలించి పోయాడు. తెరేసను హృదయానికి హత్తుకుంటు "ఏమ్మా! ఏం కావాలి?" అని ఆప్యాయంగా అడిగాడు. "కార్మెల్ మఠంలో చేరాలనుకుంటున్నాను నాన్నా! అందుకు మీ అనుమతి కావాలి" అని కన్నీళ్లతోనే అడిగింది తెరేస. అది విన్న మార్టిన్ కూడా కన్నీరు ఆపుకోలేక పోయాడు. కానీ వెంటనే ఆ పిలుపు దేవుని నుండి అని గ్రహించాడు. తన బిడ్డలందరినీ, ఆయన సేవకు పిలుచుట ద్వారా ప్రభువు తనను గౌరవిస్తున్నారని మర్టిన్ భావించాడు. నెమ్మదిగా తెరేసను తీసుకుని తోటలో నడుస్తూ ఒకచోట ఆగాడు. మార్టిన్ ఒక చిన్న పూల మొక్కను వేర్లతో సహా పెరికి , తెరేస చేతికందించాడు. తన తోటలో భద్రంగా పెంచిన ఆ మొక్కను యిప్పుడు కార్మెల్ తోటలో నాటబోతున్నానని చెప్పాడు. అక్కడ అది బహుగా ఫలించాలని చెప్పాడు. తెరేస హృదయం తండ్రిపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ఆ తరువాత మేనమామగారైన ఇసిడోర్ నుండి అనుమతి పొందింది. తల్లి మరణించిన దగ్గర నుంచి కుటుంబం మొత్తానికి కొండంత బలంగా నిలిచి కంటికి రెప్పలా కాపాడుతు వస్తున్నాడు మామయ్య. ఇక మూడో అనునుతి కార్మెల్ మఠానికి అధిపతి అయిన ఆ మేత్రాసనపు పీఠాధిపతి నుండి పొందాలి. ఆయన ప్రతినిధి అయిన గురువు గారిని కలవడానికి తండ్రితో కలిసి వెళ్ళింది 14 సం.రాల తెరేస. 21 సం.రాలు వచ్చే వరకు ఆశ్రమంలో చేరవద్దని కఠినంగా కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పారు ఫాదర్‌గారు. కార్మెల్

మత నియమం ప్రకారం 16సం.లే. కాని ఆయన మరింత కఠినంగా మరో ఐదు కలిపారు. దాంతో బిషప్ గారిని కలిసింది తెరేస. ఆయన కూడా తండ్రికి సహాయంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో కొంతకాలం యింటిదగ్గరే ఉండమన్నారు.

## 1.8. మఠంలో చేరుటకు పాపుగారి అనుమతి కోసం 1887లో రోము నగర యాత్రకు వెళ్లుట

పాపుగారి అనుమతి పొందాలని తండ్రితో, అక్క సెలీన్తో కలసి రోము నగరానికి యాత్ర చేశారు. పాపుగారి భవనంలో వరుసగా అందరూ పరిశుద్ధ తండ్రిగారిని కలుస్తున్నారు. చివరకు తెరేస వంతు రానే వచ్చింది. తెరేస వినయంగా మోకరించి పరిశుద్ధ తండ్రిగారి పాదములను ముద్దు పెట్టుకుంది. ఆ తర్వాత ఆయన తన చేతులను అందించారు. తెరేస పాపుగారి చేతులను పట్టుకొని "తండ్రిగారా! మిమ్ము అభ్యర్థించుటకు నాకొక కోరిక ఉంది" అంది. వెంటనే పాపుగారు తలవంచి, ఆమె ముఖం దగ్గరకు వంగి "ఏమిటి?" అన్నట్లుగా చూశారు. "తండ్రిగారా! మీ జూబిలీ సందర్భముగా ఈ 15 సంవత్సరాల వయస్సు గల నన్ను కార్మెలు మఠంలో చేరుటకు అనుమతిని ప్రసాదించండి" అంటు ఏడ్చింది. (అది 1887. 13వ సింహరాయలు పాపుగారి గురుత్వపు స్వర్ణజూబిలి సంవత్సరం) పాపుగారు తెరేస వైపు ఆప్యాయంగా చూస్తూ. "సరే పాప! అధికారులు ఏమి చెప్తే అది చేయి." అన్నారు. తన చేతులను ఆయన మోకాళ్ళపై ఉంచుతూ చివరి ప్రయత్నంగా "కాదు తండ్రిగారా! తమరు సరే అంటే అందరూ సమ్మతిస్తారు" అంటూ మరోసారి ఏడ్చింది. ఆయన తెరేసను ప్రేమగా చూస్తూ, "సరే, దైవ చిత్తమైతే తప్పక ప్రవేశిస్తావు" అంటూ తెరేస తలపై చేయి ఉంచి ఆశీర్వదించారు. తెరేస కన్నీటితో పాపుగారికి రెండు చేతులు జోడించి బయటకు వచ్చింది.

ఆ తరువాత 1888, జనవరిలో మఠంలో చేరమని శ్రీసభ అధికారుల నుండి ఉత్తరం వచ్చింది. కాని ఏప్రిల్ 9న రమ్మని కార్మెల్ మఠంవారు ఆదేశించారు. ఆ మిగిలి ఉన్న 3 నెలలూ ఇంటి దగ్గర ఉంటూ ప్రాయశ్చిత్త ప్రార్థన చేయాలని నిశ్చయించుకున్నది తెరేస. ఆమె దృష్టిలో తపోః క్రియలు అంటే, తన శరీరాన్ని తనకు తాను బాధ పెట్టుకోవడం కాదు, కాని ఇతరులకు

సాధ్యమైనంత సహాయమును, వివిధ సేవలను అందించడమే. తన యిష్టానికి అనుగుణంగా ప్రవర్తించకుండా ఉండడం, మాటల ద్వారా, చేతల ద్వారా యితరులను ఏవిధంగానూ కష్ట పెట్టకుండా ఉండడం. ఇవే ఆమె తపోః క్రియలు. ఆ సమయంలో తాను యిష్టపడే ఎన్నో చిన్న వస్తువులను తెరేస క్రమంగా వదిలివేసింది.

## 1.9. కార్మెల్ మఠంలోకి అడుగు పెట్టుట

ఏప్రిల్ 8న 1888లో కార్మెల్ మఠంలో కుటుంబమంతా ఉమ్మడిగా దివ్యపూజలో పాల్గొన్నారు. రాత్రి బంధుమిత్రులతో కలసి చిన్న విందు ఏర్పాటు చేశాడు మార్టిన్. అది తెరేసకు కుటుంబ సభ్యులతో కలసి చేసిన కడరా భోజనం. అందరూ ఆనందంగా విందును ముగించారు. ఆ రాత్రి అక్కలు సెలీన్, లెయోనీలు, తెరేసను ముద్దులతో ముంచివేశారు. ఎంతో సంతోషంగా ప్రేమానురాగాల మధ్య ఆ రాత్రి గడిచింది. ఏప్రిల్ 9న కుటుంబ సభ్యులంతా మరోసారి పూజలో పాల్గొన్నారు. వరుసగా అందరిని కౌగిలించుకుని వీడ్కోలు చెప్పింది. ఇక చివరగా, తనకు అత్యంత ప్రియమైన నాన్నగారు. అతని దగ్గరకు వెళ్ళి మోకరించి, ఆశీర్వాదానికై వేడుకొన్నది. ఆయన కూడా మోకరించి, తన ప్రియ చిన్నారిని ముద్దాడి దీవించాడు. ఆయన కన్నులలోని కన్నీరు ముఖాన్నంత తడిపి వేసింది. ఇది తన మూడవ బలి. ఈ బలిని అర్పించడానికి ఎన్ని కష్టాలో, ఎన్ని ఆటంకాలో! అన్నింటినీ జయించి, ఈసాకుతో మోరియా పర్వతమును ఎక్కిన అబ్రహాము వలె ఈ రోజు మార్టిన్ తెరేసతో కార్మెల్ పర్వతాన్ని మూడవమారు అధిరోహించాడు. చివరిసారిగా కూతురుకు హితబోధ చేశాడు. మేనమామకు, సెలిన్, లెయోనీలకు వీడ్కోలు చెప్పి కార్మెల్ మఠంలోనికి పాదం మోపింది తెరేస. యిక నాన్న, అక్కలు, మావయ్య అందరూ బయటే. ఎప్పుడైనా మాట్లాడాలన్నా వారి కడ్డంగ ఇనుప చువ్వలుంటాయి. తమ చిన్నారి చెల్లి కాన్వెంటులో అడుగు పెట్టడం చూసిన అక్కలు మరియ, పౌలీన్లు ఎంతో సంబరపడిపోయారు. ఆ మఠంలో 26 మంది సిస్టర్స్ ఉన్నారు. తెరేస లోపల అడుగు పెట్టిన వెంటనే అలవాటు చొప్పున ఆమెను ప్రార్థనాలయములోనికి నడిపించారు. దివ్య సత్రసాదం మందసాన్ని తెరచి ఉంచారు. తెరేస అక్కడ

కొన్ని క్షణాలు గడిపింది. ప్రభువు తనకు ప్రసాదించిన ఈ గొప్ప వరానికి హృదయాంతరాళం నుండి కృతజ్ఞత తెలుపుకుంది. ఆ తర్వాత మదర్ గోన్సాగా స్వయంగా తెరేసను వెంట పెట్టుకుని ఆశ్రమమంతా చూపించారు. తెరేసకు అన్నీ నచ్చాయి. చివరకు తెరేస గదిని చూపించారు. ఒక మంచం, చిన్న బెంచి, ఒక దీపం, కనీస అవసరాలను తీర్చే వస్తువులు. తెరేస మనస్సు ఆనందంతో నిండిపోయింది. చివరకు తన కల ఫలించింది. తాను కార్మెలులో చేరుటలో గల లక్ష్యాన్ని కళ్ళముందే నిల్పుకుంది. అది తన జీవితానికి చుక్కానిలా పనిచేసింది.

### 1.9.1. తెరేస జీవిత ధ్యేయం

పాపాత్ముల ఆత్మలు నరకాగ్నికి వెళ్ళకుండా వారిని తన ప్రార్థన ద్వారా సంరక్షించడం, గురువుల పవిత్రత కొరకు ప్రార్థించడం. యిదే ఆమె జీవిత ధ్యేయం.

### 1.10. మరణం

అతి చిన్న ప్రాయంలోనే చిన్న తెరేసగార్కి క్షయరోగం సంప్రాప్తించింది. వారి ముఖంలో చిరునవ్వులు మాత్రం చెరిగిపోలేదు. తనకు మరణం ఆసన్నమైందని తెలుసుకున్నారు కాబోలు. “నా పరలోక జీవితాన్ని భూలోక వాసుల మేలుకోసమే ఉపయోగిస్తాను. నా మరణానంతరం రోజాపూల వర్షం కురిపిస్తాను. ప్రపంచమంతా నన్ను అభిమానిస్తారు’ అని ప్రవచనం చెప్పారు. 1897 జూలై 30న వారికి కడపటి సంస్కారం ఐన అవస్తభ్యంగం ఇవ్వబడింది. 1897 ఆగష్టు 16న రక్తం కక్కుకొనుటవల్ల జ్ఞాన విధంగానే సత్ప్రసాదం లోకొన్నారు. 1897 సెప్టెంబరు 30వ తేదీన సాయంత్రం 7.00 గంటలకు స్వర్గస్తులయ్యారు.

### 1.10.1. పునీత పట్టం

మరణానంతరం చిన్న తెరేసగారు ఒక మఠకన్యకు దర్శనమై ‘నా సమాధి తెరువబడుతుంది. నా అస్థికల ద్వారా అనేక అద్భుతాలు జరుగుతాయి.’ అని చెప్పి అంతర్ధానమయ్యారు. వారు చెప్పినట్లుగానే 1910 సెప్టెంబరు 5న వారి

సమాధి తెరవబడింది. వారిని ప్రార్థించిన వారు ఎందరికో అద్భుత మేలులు జరిగాయి. 11వ భక్తినాథ పోపుగారి ద్వారా 1923లో ధన్యత పట్టాను 1925లోను పునీత పట్టానిచ్చి శ్రీసభ వారిని గౌరవించింది. 1927లో చిన్న తెరేసగారు తమ ప్రార్ధన, ఆదర్శం, తర్పీదు ద్వారా వేద వ్యాపకంలో పునీత ఫ్రాన్సిసు శారి వారంతటి గొప్పవారని అదే పరిశుద్ధ పోపుగారు బిరుదునిచ్చి కొనియాడారు.

### 1.10.2. తేరేసగారి తల్లిదండ్రులు పునీత పట్టం

అక్టోబర్ 19, 2008న ధన్య పట్టం పొందారు. అక్టోబర్ 18, 2015 ఆదివారం, సెయింట్ పీటర్స్ స్క్వేర్లో పునీత పట్టము కొరకు జరిపిన పూజలో పోప్ ఫ్రాన్సిస్ అధ్యక్షత వహించి జెలీ మరియు లూయిస్ మార్టిన్ దంపతులకు పునీత పట్టం కట్టారు.

పాపుగారు తన ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు, “పవిత్ర జీవిత భాగస్వాములు లూయిస్ మార్టిన్, మేరీ-అజెలీ గురిన్ కుటుంబంలో క్రైస్తవ సేవలను అభ్యసించారు, రోజు రోజుకు వారి కుమార్తెల యందు దేవుని పిలుపును పెంపొందించే విశ్వాసం, ప్రేమ యొక్క వాతావరణాన్ని సృష్టించారు. వారిలో ఒకరు పునీత చిన్న తెరేసగారు. వివాహం జరిగి పిల్లలు కలిగి పునీత పట్టము పొందిన వారిలో మొట్ట మొదటి దంపతులు వీరే.

### 1.11. ముగింపు

తెరేసగారి కుటుంబం మనకు ఎంత ఆదర్శం. వారి యొక్క ప్రేమానురాగాలు, దేవుని పట్ల విశ్వాసం, అవసరములో ఉన్నవారిపట్ల ఆప్యాయత, కుటుంబం మొత్తం దేవుని చిత్తానికి తమను సమరించుకొని జీవించుట అనేటటువంటి మనకు ఒక నిదర్శనం, ఒక మంచి మార్గం.

## 2. పునీత చిన్న తెరేసగారి చిన్ని మార్గము

### 2.0. ఉపోద్ఘాతం

పునిత తెరేసగారి చిన్న మార్గం చూసి మనం ఆశ్చర్యపోతాం. మన

రోజువారి జీవితంలో చేసే చిన్న పనులకు ఇంత ప్రాముఖ్యత ఎందుకు? ఎందుకంటే తెరేసగారు గొప్ప గొప్ప ఘనకార్యాలు, త్యాగాలు చేయలేదు, కాని మన రోజువారి పనులను చిన్నవైనా కాని శ్రద్ధతో ప్రేమ కలిగి చేసారు. ఇదే ఆమె ప్రవిత్రతకు దారి దీనినే ఆమె చిన్ని మార్గం అని పిలిచింది. మరి ఈ చిన్ని మార్గం అంటే ఏంటి ? దాని మూలాలు ఎక్కడి నుండి వచ్చాయి. ఈ మార్గం యొక్క అర్థము ఏమిటి, ఈ మార్గం మనకు ఎలా ఆదర్శం అనే అంశాలను ఈ ఆధ్యాయంలో తెలుసుకుందాం.

## 2.1. చిన్నిమార్గం అనగా నేమి?

పునీత చిన్న తెరేసగారి జీవిత విధానాన్ని, ఆమె వైఖరిని పరిశీలించి, అవగాహన చేసికొన్నట్లయితే ఆమెనుండి మనకు అనేక విషయములు తేటతెల్లమగును. క్రీస్తు ప్రభువు మనకు చూపినది ఇరుకైన మార్గం. ఆ మార్గముగుండా పయనించిననే తప్ప ఎవ్వరును పరలోకరాజ్యములో ప్రవేశింప జాలరని ప్రభువు స్పష్టీకరించారు. ఆ ఇరుకైన మార్గం గుండానే పయనించుచు క్రీస్తు ప్రభువు అడుగుజాడల్లో తు.చ. తప్పకుండ నడచిన వ్యక్తి పునీత చిన్న తెరేస, ఆమె చిన్ని మార్గం మరేమియు కాదు. ప్రభువు చూపించిన ఇరుకైన మార్గం. అదే ముక్తి మార్గం, రక్షణమార్గం, ఈ క్షణమార్గాన్నే పునీత చిన్న తెరేస తన ఆధ్యాత్మిక జీవితంద్వారా క్రీస్తు ప్రేమను చవి చూచుచు, అందరికిని ఆ ప్రేమ బాటనే తన చిన్నిమార్గంద్వారా చూపించింది. తాను చూపించుట మాత్రమే కాదు. దానిని తు.చ. తప్పకుండ త్రికరణ శుద్ధిగా ఆచరించింది. తాను ఆచరించింది ప్రజలకు సుమాతృకగా ఆదర్శప్రాయంగా నిలిచిపోయింది. ఈ విధంగా తెరేస దేవునికి తనను తాను సంపూర్తిగా సమర్పించుకొని అందరికి మార్గచూపరి అయింది.

## 2.2. చిన్నిమార్గం యొక్క మూలాలు

పునీత చిన్న తెరేసగారు, ఆమె సిద్ధాంతాన్ని ఎక్కడ కనుగొన్నారు అనే ప్రశ్న చాలా మంది అడిగారు, మరి దానికి సమాధానం సాధారణంగా ఆమె

సువార్తలో కనుగొంది. పునీత పాలు, పునీత సిలువ యోహాను, ఇతర ఆధ్యాత్మిక గురువుల చేత ప్రేరణ పొందింది.

తెరేస పవిత్ర గ్రంథం ద్వారా, ముఖ్యంగా సువార్త గ్రంథాల ద్వారా ప్రేరణ పొందిందని ఖచ్చితంగా చెప్పవచ్చు. పవిత్ర గ్రంథంలో ఆమె తన చిన్న మార్గాన్ని కనుగొంది. దేవుని వాక్యమే ఆమెకు తండ్రి దేవుని పట్ల యేసుక్రీస్తు పట్ల అనంతమైన దయగల ప్రేమను వెల్లడించింది. ఆమె బోధన అంతా సువార్త ఆత్మ ద్వారా విస్తరించి ఉంది.

ఆమె సిద్ధాంతంలో ఇతర పునీతుల బోధనను పోలి ఉండే కొన్ని అంశాలు కూడా ఉన్నాయి. ఇది సహజమైనది, ఎందుకంటే వారు తమ ఆలోచనలను దేవుని వాక్యం నుండి తీసుకున్నారు, ఒకే ఆత్మ ద్వారా బోధన పొందారు. అందువల్ల, పునీతులు ఒకేలాంటి పద్ధతిలో తమను వ్యక్తపరుచుకుంటారు. మనం తెరేసను కార్మెలు పునీతులతో పోల్చినప్పుడు ఈ పోలిక ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆమె ఆవిలాపురి తెరేసగారి మాటలను కొంత వరకు చదివినా తనకు అభిమాన రచయిత అయిన పునీత సిలువ యోహానుగారి ఆధ్యాత్మిక సిద్ధాంతాలను చాలా లోతుగా అర్థం చేసుకుంది. కాబట్టి ఆమె తన ఆధ్యాత్మిక సిద్ధాంతంలో ఈ పునీతుల యొక్క ప్రతిధ్వనులు వినిపిస్తాయి.

పునీత సిలువ యోహాను పరిచయం ద్వారా, ఆమె చిన్ని మార్గం యొక్క పునాదులను పటిష్టం చేసుకుంది. అవి ఏమనగా వినయం, ఆత్మ యొక్క పేదరికం, స్వచ్ఛమైన ప్రేమ, విశ్వాసం, నమ్మకం కలిగి దేవుని సన్నిధికి చేరుకోవడం.

ఆమె సొంత సాక్ష్యం ప్రకారం ఆమె మార్గం నజరేతులో నివసించిన పవిత్ర కుటుంబ జీవితం యొక్క పునరుత్పత్తి. యేసు, మరియ యోసేపుల జీవితం చాలా సాధారణమైనది. ఇది కేవలం రోజువారీ పనులను చక్కగా చేయడంలో, సాధారణ ధర్మాల సాధనలో, దేవుని చిత్తానికి, ఇష్టానికి సమర్పించుకునే సంపూర్ణ పరిత్యాగం కలిగి ఉంటుంది. ఇది అన్నింటికంటే

గొప్ప ప్రేమతో కూడుకొని ఉంటుంది. ఇదే తెరేసగారు భావించిన మార్గం. ఈ రకమైన జీవితంనే తాను జీవించాలని మరియు ఇతరులకు నేర్పించాలని కోరుకుంది.

## 2.3. ఆధ్యాత్మిక బాల్యం యొక్క చిన్ని మార్గాన్ని ఆమె ఎలా కనుగొంది?

తెరేస ఆమె బాల్యం నుండి, ఒక పునీతురాలు కావాలని కోరుకుంది. ఆ కోరిక సంవత్సరాలుగా పెరిగింది, ఆమె ఉత్సాహంతో దాని కోసం ప్రయత్నించింది. కాని ఆమెకు మంచి సంకల్పం ఉన్నప్పటికీ, ఆమె ప్రయత్నాలు సరిపోవు అని ఆమె వెంటనే గ్రహించింది. ఎందుకంటే పవిత్రత అనేది పునీతుల జీవితాలలో చిత్రీకరించినట్లుగా, మేఘాలలో కోల్పోయిన ఎత్తైన పర్వతం యొక్క శిఖరంలాంటిది, సాధారణ ప్రజలకు చేరువలో లేనందున, ఆమె తన సొంత అసమర్థత యొక్క భావన ఆమెను మరింతగా ఆకట్టుకుంది.

మరోవైపు, సాధించలేని లక్ష్యాలను దేవుడు ప్రేరేపిస్తాడని ఆమె తనను తాను ఒప్పించలేకపోయింది. అందువల్ల, ఆమె ఇలా భావించింది: "నాకు చిన్నతనం ఉన్నప్పటికీ, నేను ఇంకా పవిత్రతను కోరుకుంటాను." అయితే దీన్ని ఎలా సాధించాలి? ఒకరి స్థాయిని దేనితో జోడించడం సాధ్యం కాదు. ఆమె తనను తాను అంగీకరించుకోవాలి, ఆమె లోపాలను భరించాలి. అమె ఇలా ఆలోచించింది కొన్ని ఇల్లలో ఎలివేటర్ లేదా లిఫ్ట్ మెట్ల స్థానంలో ఉంటుంది, ఇది చాలా సమర్థవంతంగా పనిచేస్తుందని ఆమె గుర్తుచేసుకుంది. అందువల్ల, స్వర్గానికి చేరుకోవాలనే ఆమె కోరికలో, తెరేస చాలా సరళమైన, చిన్న రహదారి కోసం వెతకడం ప్రారంభించింది. ఒక కొత్త మార్గం, ఆమెను దేవుని వైపుకు కూడా ఎత్తగలిగే ఒక ఎలివేటర్ లాగా, ఎందుకంటే ఆమె పరిపూర్ణత యొక్క మెట్లని ఎక్కడానికి లేదా అందుకోవడానికి చాలా చిన్నది.

ఈ విధంగా అన్వేషణలో, ఆమె పవిత్ర గ్రంథం వైపు తిరిగింది. దేవుడు అప్పటికే పవిత్ర గ్రంథం ద్వారా ఆమెతో చాలా సేపు మాట్లాడుతునే ఉన్నాడు.

ఒక రోజు ఆమె తన సోదరి సెలిను తయారు చేసిన పాత నిబంధన

యొక్క గ్రంథాల సమాహారాన్ని తెరిచి, ఈ భాగాన్ని కనుగొంది: "జ్ఞానములేని వారు ఇచటకు రండు" (సామెతలు 9:4). అంటే చిన్నతనం కలిగిన వారిని ప్రభువు రమ్మనుచున్నారు. ఈ సమాధానం సంబంధితంగా ఉంది. పవిత్రతను పొందాలంటే మనల్ని మనం తగ్గించుకోవాలి. చిన్నతనంతో పెరగడం కూడా అవసరం. కాని మన చిన్నతనం కారణంగా మన సొంత శక్తుల ద్వారా మనం దానిని సాధించలేకపోతున్నాం కాబట్టి, భగవంతుని ఆశ్రయించడం అవసరం.

అయినప్పటికీ, పరిష్కారం అసంపూర్ణంగా ఉంది అని ఆమె భావించింది. తన వద్దకు వచ్చిన చిన్నారి కోసం మన దేవుడు ఏమి చేస్తాడు? అని ఆమె మరోసారి పవిత్ర గ్రంథం తెరిచింది, దేవుడు యెషయా నోటి ద్వారా సమాధానమిచ్చాడు (66:12): ప్రభువు "మిమ్ము తన చేతులలోనికెత్తుకొనును తన వడిలో కూరుండబెట్టుకొని లాలించును." ఈసారి సమాధానం నిశ్చయంగా ఉంది. దేవుడు క్రీస్తు ద్వారా చిన్నవారిని తన వైపుకు తిప్పుకొని పునీతులను కూడా చేస్తాడు. అందువల్ల, పునీతులుగా ఉండాలంటే, మనం వినయం, విశ్వాసం, పరిత్యాగం యొక్క తరంగాల ద్వారా, ఆధ్యాత్మిక బాల్యం ద్వారా దేవుని వద్దకు వెళ్ళాలి. ఆ దారిలోకి ప్రవేశించి తనను తాను క్రీస్తుకు అప్పగించుకునేవారు మనలను పవిత్రం చేసే దేవుని హృదయానికి తీసుకువెళ్ళబడతారు.

ఆధ్యాత్మిక బాల్యం యొక్క ఈ మార్గం, "చాలా సరళమైన మార్గం, చాలా చిన్నది - పూర్తిగా క్రొత్తది" అని తెరేస పిలిచింది.

ఈ మార్గం సరళమైంది, ఎందుకంటే ఇది దేవుని వైపు మనం వెళ్లే మార్గంలో మనలను ప్రక్కతోవ పట్టించే ఆధ్యాత్మిక సంక్లిష్టతలను తొలగిస్తుంది. ఈ మార్గం చిన్నది, ఎందుకంటే ఇది సూటిగా ఉండటం ఆధ్యాత్మిక జీవితాన్ని సులభతరం చేస్తుంది, ముఖ్యంగా వినయం, నమ్మకమైన ప్రేమలో మనల్ని నడిపిస్తుంది.

అప్పటి వాడుకలో ఉన్న వ్యవస్థలతో పోల్చితే ఈ మార్గం క్రొత్తది, కాని దయగల ప్రేమపై ఇంతకు ముందు ఎవరైనా చేసినదానికన్నా ఎక్కువగా ఆమె తపనపడింది.

"మీరు పరివర్తన చెంది చిన్న బిడ్డలవలె రూపొందిననే తప్ప పరలోక రాజ్యమున ప్రవేశింపరని మీతో వక్కాణించుచున్నాను" (మత్తయి 18:3) అని యేసు చెప్పిన మాట ప్రకారం, తెరేస యొక్క మార్గం ఆధారపడలేదని గమనించవచ్చు. కాని అమె మార్గం సామెతలు, యెషయా గ్రంథాలపై స్థాపించబడింది. అవి మనకు తెరేసగారి సిద్ధాంతం యొక్క నిజమైన అర్థాన్ని ఇస్తాయి, అదే సమయంలో దాని లోతైన వేదాంత పునాదిని తెలియజేస్తాయి.

జూలై 18, 1893న తెరేస తన అక్క సెలిన్‌కు రాసిన ఒక లేఖలో ఆధ్యాత్మిక బాల్యానికి మొదటి సూచనను మనం కనుగొనవచ్చు. ఆమె "చిన్ని మార్గము" 1895 సంవత్సరంలో క్రమంగా అభివృద్ధి చెందింది. జూలై 17, 1897న, తెరేస , మొదటిసారిగా ఆమె స్పష్టంగా పేర్కొంది "చిన్ని మార్గం" ఆధ్యాత్మిక బాల్యంలో ఒకటి, అని ఆమె దాని ప్రధాన అంశాలను నిర్వచించింది.

## 2.4. ఆధ్యాత్మిక బాల్యం యొక్క మార్గము, దాని యొక్క అర్థం

పునీత తెరేస దీనిని రెండు వేర్వేరు సందర్భాలలో పూర్తిగా వివరించింది. మొదటగా ఒక రోజు కార్మేలు మఠంలోని పెద్దమ్మగారు ఆగ్నెసగారు తెరేసను ఆమె మరణం తరువాత ఆత్మలకు నేర్పించాలనుకున్న మార్గం యొక్క ఖచ్చితమైన స్వభావం ఏమిటని అడిగారు. ఆమె ఇలా సమాధానం చెప్పింది: ఇది ఆధ్యాత్మిక బాల్యం యొక్క మార్గం, దేవునిపై విశ్వాసం కలిగి మనల్ని దేవునికి పుర్తిగా వదిలివేయడం. నా జీవితంలో ఖచ్చితంగా విజయవంతంగా నిరూపించబడిన చిన్న మార్గాలను ఆత్మలకొరకు బోధిస్తాను అని తెరేస తన అంతరంగంలో ఉన్న ఆలోచనలను వ్యక్తపరచింది. ఇక్కడ మనం చేయవలసినది ఒక్కటే ఉందని నేను వారికి చెప్పాలనుకుంటున్నాను: మనం యేసు ప్రభువుని గెలవడం కోసం అయన పాదాల వద్ద మన చిన్న త్యాగాల ఫలితాలను వదిలి వేయాలి. నేను ఆయనను అందుకున్న మార్గం అదే, అందుకే నాకు ఇంత మంచి స్వాగతం లభిస్తుంది" అని తన మరణం గురించి వ్యక్తపరచింది.

కొన్ని రోజుల తరువాత, ఒక చిన్న పిల్లవాడిలా ఉండడం అంటే ఏమిటని ఆమెను అర్థం అడిగినప్పుడు, ఆమె ఇలా సమాధానం చెప్పింది: "దీని అర్థం

మనం మన యొక్క ఏమి లేమి తనమును, శూన్యతను గుర్తించడం. ఒక పిల్లవాడు తన తండ్రి నుండి ప్రతిదీ ఆశించినట్లు మనం కూడా ప్రభువు నుండి ప్రతీది ఆశిస్తాం. దీని అర్థం ఏ విషయమైనా కూడా ఆందోళన చెందకుండా ఉండడం. మన త్యాగాల ఫలితాలను (పువ్వులు) సేకరించి ప్రభువుకు అతని ఆనందం కోసం వాటిని అర్పించడం.

ఇంకో అర్థం మనం పాటించే సద్గుణాలను మనవే అని అనుకోకూడదు, మనకు ఏమైన చేయడానికి సామర్థ్యం ఉంది అని అనుకోకూడదు, కాని తన చిన్న బిడ్డలకు దేవుడే అన్నిటిని దయచేస్తాడు అని విశ్వసించాలి. చివరిగా మనం తప్పులను చేసినప్పుడు కృంగిపోవద్దు. ఎందుకంటే పిల్లలు తరచూ పడిపోతునే ఉంటారు. మన తప్పుల వల్ల మనం నిరుత్సాహపడకూడదు".

పైన పేర్కొన్న రెండు పేరాలలో బాల్యంలోని అన్ని ప్రాథమిక లక్షణాలు వ్యక్తీకరించబడ్డాయి.

మొదటగా చిన్నతనం లేదా వినయం ఉంటుంది, ఇది శూన్యతను అంగీకరించి, తనకు తానుగా ఏమీ ఆపాదించకపోవడం. చిన్న పిల్లవాడు సహజంగా బలహీనంగా, శక్తిలేనివాడు. అతను తన సొంత శక్తితో ఏమీ చేయలేడు. అతను ప్రతిదానికీ తన తండ్రి, తల్లిపై ఆధారపడి ఉంటాడు. అతను అరుదుగా ఒక అడుగు మరొకదానికి ముందు ఉంచవచ్చు లేదా, అతను మెట్లు ఎక్కాలనుకుంటే, అతను తన పాదాలను పైకి లేపలేడు లేదా మొదటి అడుగు వేయలేడు. అతను దీనిని గుర్తించి ఒప్పుకుంటాడు.

తరువాత, పేదరికం ఉంది. పిల్లల దగ్గర ఏమీ ఉండదు. అతనికి ఇవ్వబడినది మాత్రమే అతని వద్ద ఉంటుంది. అతను ప్రతిదానికీ తన తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటాడు.

తరువాత, నమ్మకం ఉంటుంది. పిల్లలకి తన తండ్రి మరియు తల్లి తెలుసు. అతనికి ఏమీ లేకపోతే, అతనికి సహాయం చేయడానికి, అతనికి ఆహారం ఇవ్వడానికి, ఉనికిలో ఉండటానికి మరియు పనిచేయడానికి అతనికి

కావలసినదంతా ఇవ్వడానికి తల్లిదండ్రులు ఉన్నారని అతనికి తెలుసు అందువల్ల, అతను దేని గురించీ ఆందోళన చెందడు.

ప్రేమ కూడా ఉంటుంది. పిల్లవాడు ఎంత చిన్నవాడైన, ఏమి లేకపోయినప్పటికి, అతను ఇప్పటికే ఒక విషయాన్ని మనోహరమైన రీతిలో కలిగి ఉన్నాడు. అదే ప్రేమ. అతను తన తల్లిని ఎంతగానో ప్రేమిస్తాడు. కొన్నిసార్లు, అన్నింటికంటే మించి తన తండ్రిని ప్రేమిస్తాడు. అతను వారిని ప్రేమిస్తున్నాడు కాబట్టి వారికి తనను తాను పూర్తిగా సమర్పించుకుంటాడు.

చివరగా, పిల్లవాడు సరళమైనవాడు. అతనిలో ప్రతీదీ సులభం. అతని ఆలోచనలు అలాగే అతని మాటలు, అతని చర్యలు కూడా. చిన్నవారు చిన్న విషయాలకు మాత్రమే సామర్థ్యం కలిగి ఉంటారు.

ఇవన్ని బాల్యంలోని లక్షణాలు, వీటిని తెరేస అతీంద్రియ క్రమంలోకి మార్చారు. ఇవన్ని తెరేస బాల్య మార్గాన్ని వర్ణిస్తాయి. వీటిని మనం దేవునితో మన సంబంధాలలో పునరుత్పత్తి చేయాలి.

ఏదేమైనా, పైన పేర్కొన్న అన్ని లక్షణాలు "చిన్న మార్గం" యొక్క సమాన లక్షణం కాదు. అందువల్ల, ఈ సద్గుణాలలో చిన్ని మార్గము యొక్క ముఖ్యమైన లక్షణాన్ని ఏవి అని అడిగినప్పుడు, మనం ప్రత్యుత్తరం ఇవ్వాలి: ఒక వైపు, వినయం, ఆధ్యాత్మిక పేదరికం, విశ్వాసం దాని ప్రాథమిక వైఖరులు. మరోవైపు, ప్రేమ దాని యొక్క ఆత్మ.

ఏదేమైనా, ఆమె మార్గంలో నిజంగా ప్రధానమైనది విశ్వాసం, నిర్భయమైన, అనంతమైన విశ్వాసం. ఇదే ఆధ్యాత్మిక చరిత్రలో తెరేస మార్గమును ప్రత్యేకమైనదిగా కనబరుస్తుంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ప్రకటించింది. తన "మార్గం" ఆధ్యాత్మిక బాల్యం అని చెప్పిన తరువాత, ఇది ఒక ప్రత్యేక పద్ధతిలో "విశ్వాసం మరియు పరిత్యాగం యొక్క మార్గం" అని ఆమె చెప్పింది. ఆమె మరణం తరువాత ఆమె సోదరీమణులు ఇచ్చిన వివరణ కూడా ఇదే.

## 2.5. బాల్యపు మార్గం, దేవుని పితృత్వం

తెరేస సిద్ధాంతానికి పునాది దేవుని పితృత్వంలో ఉందని కొందరు చెప్పారు. ఆమె దేవున్ని తండ్రిగా భావించింది అనేది చాలా నిజం. ఆమె దీనిని సువార్త నుండి నేర్చుకుంది. కాని దేవునిలో ఆమె దయగల ప్రేమను "అనంతమైన దయ కలిగిన తండ్రిని," చూసింది. తన పిలుపు యొక్క రహస్యానికి, ఆమె జీవితం మొత్తానికి, యేసు తన ఆత్మకు ప్రసాదించిన అన్ని అధికారాలకు ఆ ప్రేమే కారణమని పేర్కొంది.

తరువాత, ప్రతి ఆత్మ కొంత దైవీక పరిపూర్ణతను కీర్తింప జేయాలని భావించి, దేవున్ని తన అనంతమైన దయతో గౌరవించానని ఆమె ప్రకటించింది. ఆ దయ ద్వారానే ఆమె దేవుని యొక్క ఇతర లక్షణాలన్నిటినీ ధ్యానించింది.

చివరగా, దయగల ప్రేమకు ఆమె తనను తాను పూర్తిగా అర్పించుకుంది. అందువల్ల, తెరేస ఆధ్యాత్మికతకు దయగల ప్రేమను కలిగిన పరలోక తండ్రి యందు పునాదులు కలిగి ఉన్నాయని ధృవీకరించవచ్చు, ఇది యేసు ప్రభువు యొక్క దయగల ప్రేమపై కూడా స్థాపించబడినట్లే అని ధృవీకరించవచ్చు. ఎందుకంటే యేసు నిజంగా మనల్ని పరలోకానికి తీసుకువెళ్లటానికి మార్గం.

## 2.6. పునీత చిన్నతెరేసగారు మన జీవితాలకు ఒకగొప్ప ఆదర్శం

పునీత తెరేస మనందరికి మార్గచూపరి కావటంలో ప్రత్యేకత లేకపోలేదు. ఎవరైనా ఒక వ్యక్తి మనకు సుమాతృక చూపినపుడు, మేలు చేసినప్పుడు కృతజ్ఞతా భావాన్ని వెలిబుచ్చుట పరిపాటి. అలాగే చిన్న తెరేస కూడ తాను దేవుని యొద్దనుండి పొందిన అపార అనుగ్రహములకు మేలులకు ఎల్లప్పుడు కృతజ్ఞతా భావముతో నమ్రత కలిగి జీవించింది. అంతేకాకుండా ఆమె పొందిన సకల మేలులకు దేవుని పొగడుచు, ఆయన ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని గుర్తించి, ఎల్ల వేళల దైవానుగ్రహము మీద ఆధారపడుచు దేవునికి ప్రియమైన జీవితం జీవించింది. ముఖ్యంగా ఆమెనుండి మనం అలవర్చుకో వలసిన సుగుణములు ప్రేమ, నిరాడంబరత, నమ్మకం, త్యాగం, ఆత్మలకై పట్టుదల. ఇట్టి సుగుణములను అలవర్చుకున్న వారిలో ఆధ్యాత్మిక జీవితం నానాటికి

అభివృద్ధిచెంది దేవునికి సంపూర్ణ ప్రియులుగా జీవించుటకు అవకాశం గలదు. కనుక ఎవరైతే దేవుని ప్రేమలో జీవించుచు, ఆప్రేమను ఇతరులకు చాటెదరో వారు దేవుని రాజ్యస్థాపనకై పాటు పడిన వారగుదురు.

పునీత చిన్న తెరేస తన ఆదర్శ జీవితం ద్వారా ఎన్నో విషయములను బోధిస్తూ. అనేక విషయాలను చైతన్యవంతంగా తీర్చిదిద్దుటకు ప్రేరేపణలిస్తూ ఒక ప్రత్యేక విధంగా ఆమె అందరికి జ్ఞానవిధంగా మార్గచూపరి అయింది. అంతేకాకుండా వేద ప్రచార విషయములో ఆమె ఎక్కవ శ్రద్ధాసక్తులు చూపుతూ, వేద వ్యాప్తికై పాటుపడుచున్న వారందరికి కూడ ఆమె సహాయ సానుభూతులందించి, క్రీస్తు ప్రభువు రక్షణ మార్గాన్ని తన చిన్ని మార్గం ద్వారా బోధించింది.

దీనినిబట్టి చూచినట్లయితే పునీత చిన్న తెరేస ఎలాంటి వ్యక్తియో బోధపడుతుంది. ఆమె సుగుణములన్నియు ముఖ్యముగా ఆమె త్యాగబుద్ధి, నిరాడంబరత, సమయస్ఫూర్తి, నమ్రత, అచంచల దీక్ష, ప్రగాఢ విశ్వాసం, మనకు కొండంత బలం నిచ్చి మన జీవితాలుకూడ ఆమెవలె పరిశుద్ధమైన ప్రేమతో, దైవ మానవ ప్రేమతో మిళితమై యుండునట్లు చేయును. తద్వారా ఆమెవలె మన జీవితాలను తీర్చిదిద్దుకోగలం.

### 2.7. ముగింపు

పునీత చిన్న తెరేసగారి మార్గం మనందరికి ఒక చక్కని నిదర్శనం. మన ఆధ్యాత్మిక జీవితంను బలపరచుకొనుటకు, దేవునితో సఖ్యతకలిగి ఆయనకు సంపూర్ణ ప్రియులుగా జీవించుటకు గొప్ప మార్గం. కావున ఈ మార్గం గురించి క్లుప్తముగా తరవాత ఆధ్యాయం తెలుసుకుందాం.

## 3. పునీత చిన్న తెరేసగారు అనుసరించిన చిన్ని మార్గములు

### 3.0. ఉపోద్ఘాతం

పునీత తెరేసగారి చిన్ని మార్గములు చాలా మృదువైనవి, సులువైనవి. కాని ఆ మార్గములను పాటించుటకు మనకు చాలా ఓర్పు కావాలి. ఇవి

కేవలం మన రోజువారి జీవితంలో పాటించే సూత్రాలు, కట్టడాలవంటివి కావు. వీటిని చాలా ఓపికతో నేర్పుతో పాటిస్తే మన ఆధ్యాత్మిక జీవితం సక్రమమైన మార్గములో పయనిస్తుంది. ఎందుకంటే ఈ చిన్ని మార్గములు మన రోజువారి జీవితాలను అభివృద్ధిపరచుకొనుటకు దోహద పడుతూనే మరి ఎక్కువగా మన ఆధ్యాత్మిక జీవితం అనగా దేవునితో మన సంబంధాలను సఖ్యపరుస్తూ, ఆయన యందు ప్రేమ, విశ్వాసం, నమ్మిక అనే అనేకమైన ఆధ్యాత్మిక విలువలను మనలో పెంపొందించి మనలను పునీతులవలే స్వచ్ఛమైన వారిగా తీర్చిదిద్దుతాయి.

## 3.1 దీనత మరియు తగ్గింపుతనం

### 3.1.1. పిల్లల తగ్గింపుతనం

చిన్న పిల్లల యొక్క లక్షణాలలో మొట్ట మొదట మనకు గుర్తుకు వచ్చేది వారి తత్వం. అదే విధంగా మనం కూడా మనలో వున్న చిన్నపిల్లల తత్వాన్ని గుర్తించాలి. ఈ తత్త్వం మన నిజమ్తైన స్థితిని తెలియచేసి మనలను దేవుని ముందు నిలబెట్టేటటువంటివి. ఆధ్యాత్మికంగా తగ్గి ఉండటం ఒక నిర్ధిష్టమ్తైన సరళతను, నిరాడంబరతను సూచిస్తుంది, సమర్ధవంతమైన స్వీయ ప్రభావాన్ని సూచిస్తుంది.

పునీత తెరేసగారిని ఒక సోదరి ఈ విధంగా ప్రశ్నించింది. దేవుని ముందు చిన్నపిల్ల వాడిగా ఉండటం అంటే అర్థం ఏమిటి? అందుకు తెరేసగారు ఈ విధంగా సమాధానం తెలియచేసింది. మనం మనలోని ఏమిలేని తనాన్ని గుర్తించి ఆ ప్రభువు కోసం ఎదురు చూస్తాం, కాని మనం ఆచరించే మంచి గుణాలను అభ్యంసించడానికి నిరాకరిస్తున్నాం. ఏదైన మంచి చేయడానికి అసమర్థులం అని నమ్ముతున్నాం. కాని నిజానికి వినయం అంటే మనలో ఉన్న ఏమి లేని తనాన్ని గుర్తించి ప్రతీది ప్రభువు నుండి ఆశించడం మనలో మనం కనుగొన్న మంచిని ప్రభువుకు సూచించడం.

వినయం మనలను సరైన స్థలంలో నిజమైన స్థితిలో నిలుపుతుంది. అందుచేత తెరేస వినయాన్ని తన మర్గానికి ఆధారం చేసుకున్నది. ఎప్పుడైతే

దైవ ప్రేమను వాస్తవంగా అనుభవించాలంటే ఎంతగ మనల్ని మనం తగ్గించుకుంటే అంతగా దేవుని ప్రేమను ఆకర్షిస్తాం, అనుభవిస్తాం. "దీనికి వ్యతిరేకంగా ఎప్పుడైతే మనల్ని మనం హెచ్చించుకుంటామో అప్పుడు దైవుని ప్రేమకు విరుద్ధంగా ఉంటాం. తెరేస తన ప్రేమను నిరూపించుకోవడానికి వినయాన్ని తన మార్గంగా ఎన్నుకొని దానిని పాటించింది.

### 3.1.2. ఇతరుల దృష్టిలోనుండి దాచబడడం, మరచిపోబడడం

పునీత తెరేస తన జీవితంలో ఇతరులు తనను చూడాలని, పట్టించుకోవాలని ఎప్పుడు కోరుకోలేదు. కాని తనను ఇతరులు లెక్కించకపోవడంలో, తృణీకరించడములో, ఇతరుల దృష్టిన్ని ఆకర్షించకపోవడంలో సంతృప్తి చెందింది. యేసు ప్రభువు కోసం ఈ ప్రపంచంలో అన్నిటి కంటే  చివరి దానిగా, ఉంటానని ఆమె వ్యక్తపరచింది. ఆమె ఒక చిన్న ఇసుక రేణువు వలె ఉండాలని కోరుకుంది. ఎందుకంటే ఒక ఇసుక రేణువు ఎవరి దృష్టిని ఆకర్షించదు. ఎవరు దానిని లెక్కచేయరు. అది ఉందని గుర్తించరు. అలా ఆమె కూడా ఇతరుల నుండి ఎటువంటి ప్రత్యేక దృష్టిని ఆకర్షించలేదు, మానవ అహంకారాన్ని మెప్పించడానికి కారణమయ్యే కోరికలను మినహాయించాలని ఆమె కోరుకుంది. కాని ఆమె యేసు ప్రభువు తనను చూడాలని కోరుకుంది. ఎందుకంటే యేసు ప్రభువు ఆమెను నిర్లక్ష్యం చేస్తే, ఆమె ఇంకేమి పొందదు, తనవైపు ప్రభువు ఒక్కసారి చూస్తే సంతోషిస్తాను అని పలికింది. ఈ విధంగా తన తగ్గింపుతనాన్ని వ్యక్తపరచింది.

### 3.1.3. మన తప్పుల నుండి నేర్చుకోవడం

నిజానికి మనలో మంచి సంకల్పం ఉన్నట్లయితే, మనం చేసిన పొరపాట్లు, మన ఎదుగుదలకు తోడ్పడతాయి. ఎప్పుడైతే మనం వినయ గుణం ద్వారా మనలో ఉన్న పోరపాట్లను గ్రహించి వాటిని సరిదిద్దుకోవాలని ప్రయత్నం చేయడం ద్వారా అది మన ప్రేమను అధికం చేస్తుంది. ఈ విధంగానే పునితులు స్పందిస్తారు. మనలాగే వారు బలహీనతలను కలిగి ఉంటారు. కాని వారు దేవునికి దగ్గరగా జీవించడానికి దుఃఖములను, బాధలను అంగీకరిస్తూ తమ

లోపాలను ఉపయోగించుకుంటారు. తెరేసగారు ఇలా వ్రాసారు "మనం ఏప్పుడూ పడిపోకూడదనుకుంటాం. ఇది ఎంతటి భ్రమ. మనం పడిపోయినప్పుడే మన బలహీనత మనకు తెలుస్తుంది. అది మనకి మేలు కలిగిస్తుంది. ఎందుకంటే యేసు ప్రభువు మన బలహీనతను గుర్తించి మనలను తన చేతులలో ఎత్తి పట్టుకొంటారు.

## 3.2. ఆధ్యాత్మిక పేదరికం

### 3.2.1. పిల్లల యొక్క పేదరికం

చిన్న పిల్లలు బలహీనంగా ఉండడమే కాకుండా, పేదవారిగ, ఏమి చేయలేనివారిగ, ఏమిలేనివారిగా ఉంటారు. వాళ్ళకు తమ తల్లిదండ్రులు ప్రేమతో ఇచ్చే చిరు కానులకలనే విలువైన సంపదలుగా కలిగి ఉంటారు. తెరేసగారి యొక్క గొప్ప ఆధ్యాత్మిక భావనతో ఈ పరిశీలనను ఆమె ఆధ్యాత్మిక బాల్యం యొక్క చిన్ని మార్గానికి అనుకరించింది. ఏ విధంగానైతే ఒక పిల్లవాడు ఎటువంటి చింతలేకుండా తన తండ్రి నుండి ప్రతిదాన్ని ఆశిస్తాడో, మనం కూడా ప్రతిదాన్ని ఆ మంచి ప్రభువు నుండి ఆశించాలి.

ఏదేమైన ఒక పిల్లవాడు, పెరిగి పెద్దవాడై తనంతట తాను సంపాదించి, స్వయంగా అభివృద్ధి చెందాలని ప్రతి తండ్రి కోరుకునే సమయం వస్తుంది. కాని తెరేస దానికి విరుద్ధంగ తన జీవనాన్ని సంపాదించడానికి తాను అసమర్థురాలని భావించి తనలో తాను దేవునిపై సంపూర్ణ విశ్వాసమును కనబరస్తూ ఆయన దీవెనలను కోరుకున్నది. తెరేస తన కోరికను వెల్లడిస్తూ ఇలా చెప్పింది. "దేవుని నుండి ప్రతిదాన్ని ఆశించడానికి అలాగే ఎల్లప్పుడు ఒక పేదరాలుగా ఉండటాన్ని కోరుకుంటాను." ఇలాంటి పేదరికం, వినయం మనలను దేవుని మీద ఆధారపడి జీవించేలాగున చేస్తాయని ఆమె తెలుసుకోగలిగింది. దేవుని శక్తివంతమైన సహాయాన్ని అర్థించడానికి ఇదే ఉత్తమైన మార్గమని గ్రహించింది.

### 3.2.2. దేవునిపై సంపూర్ణ నమ్మకం

తెరేస దేవుని పై సంపూర్ణమైన నమ్మకం కలిగి జీవించిన విధానాన్ని బట్టి ఆమె రహస్యం మనకు తెలుస్తుంది. యేసు ప్రభువును నిజంగా ప్రేమించడం, ఆయనలో రూపాంతరం చెందడం వంటి మార్గాలు మనకు ఉన్నాయి. ఇవి ఒకవైపు మన చిన్నతనాన్ని, మన బలహీనలను అంగీకరించి వాటిని ప్రేమించడంలో ఉంటుంది. మరోవైపు, దేవుని కృపపై పూర్తి నమ్మకం కలిగి ఆయన ప్రేమకు బాధితులు కావడం అనేది ఉండాలి. మన కష్టాలు ఎంత లోతుగా ఉన్నా, మన చిన్నతనం ఎంత విస్తృతంగా ఉన్నా అవి దేవుని కృపకు ఆయన పనులకు అడ్డంగా ఉండవు. మన బలహీనత, పేదరికం దేవుని కరుణ కోసం ఎదురు చూడాలి. మన చిన్నతనాన్ని, మన కష్టాలను అంగీకరించడానికి మనం మరింత ఆసక్తిగా ఉండాలి. దేవుని యొక్క కృప, కారుణ్యం మనం చేసే తప్పులను పూరించడంలో ఖచ్చితంగా ఉంటుంది. దేవుని ప్రేమ కేవలం మన శూన్యతను అగ్నిగా మర్చినప్పుడు తృప్తి చెందుతుంది. దురదృష్టవశాత్తు అనేక ఆత్మలు దేవుని ప్రేమకు, ఆయన ప్రణాళికకు ఆటంకం కలిగిస్తూ వారు తమ పేదరికం, బలహీనతను నిరాకరించడమేకాక, వారు తమ ఆధ్యాత్మిక జీవితంలో ఎంత బలహీనంగా ఉన్నారో గుర్తించరు. తెరేస ఇలా వ్రాసారు: ప్రతి నిత్యం పేదవారిగా, శక్తిలేనివారిగా ఉండడం చాలా కష్టం. కాని మనం మన బలహీతలను అంగీకరించి దేవునిపై పూర్తి నమ్మకం కలిగి జీవించినప్పుడు ప్రభువు మనల్ని  పైకి ఎత్తుతారు.

### 3.2.3. పునీత తెరేస దేవుని కృపను తెలుసుకొనుట

తెరేసకు దేవుని కృప గురించి అందరి కంటే ఎక్కువగానే తెలుసు, అందుకే ఆమె పేదరాలుగా ఉంటునే, దేవుని ప్రేమను ప్రకటించడానికి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన ప్రేమను దేవుని కార్యాలను నిర్లక్యం చేయకుండా కనబరిచింది. కాని ఆమె తన పురోగతిని మంచి పనులకు జత చేయడానికి ఆమె చేసిన పనులను ఎప్పుడు లెక్కించ లేదు. కాని ఆమె దేవుని నుండి ప్రతీది కోరుకున్నది, కావున తాను పోందిన అన్నింటికి దేవునికి రుణపడి

ఉండాలని కోరుకుంది. తెరేస "ఇదిగో మనల్ని మనం విడిచిపెట్టి, దేవునిపై మన నమ్మకాన్ని ఉంచినట్లయతే, ప్రతి చిన్న ప్రయత్నం చేసిన ప్రతిసారి ఆయన దయను కోరుకొని చేసిన యెడల, మనకు గొప్ప ప్రతిఫలం వలె లభిస్తుంది" అని వ్యక్తపరచింది.

నేను గొప్ప పునీతురాలుగా అవుతాను అనే ధైర్యమైన విశ్వాసాన్ని అనుభవిస్తున్నాను కాని నేను చేసిన మంచి పనులను ఎల్లప్పుడు పరిగణనకు తీసుకోలేదు ఎందుకంటే నేను దేవునిపై సంపూర్ణమైన నమ్మకాన్ని ఉంచాను. అలగే నీతి కలిగిన, పవిత్రాత్మ కలిగిన ఆ ప్రభువే నా బలహీనమైన సమయాలలో నన్ను బలపరుస్తూ తన అనుగ్రహమును ప్రసాదించి, తనకు యోగ్యమైన రీతిలో నన్ను తీర్చిదిద్దుతున్నారు.

తెరేస తన పలుకుల ద్వారా దేవుని కృపావరములను గూర్చి తెలియజేస్తు "గొప్ప పునీతుల వలె మనకు బహుమతి లభిస్తుంది" అని తెలియ చేయడంలో తెరేసగారి మాటలకు భాషాపరంగా తీసుకుంటే ఎంతో ఉన్నతమైన అర్థానిస్తుంది. ఎందుకంటే అన్ని ఆత్మలు పునీతుల వలె పవిత్రమైన స్థాయికి చేరుకుంటాయని ఆశించలేము. శ్రీ సభలో చాల ప్రత్యేకమైన కార్యాన్ని నెరవేర్చడానికి దేవుడు ప్రత్యేకంగా కొందరిని ఎన్నుకుంటాడన్ని తెరేస భావన.

ప్రతి పునితుడు కూడా దేవుని నుండి ప్రత్యేకమైన పిలుపును అందుకొని, దేవుని కార్యాలను నెరవేరుస్తు ఆయన మహిమను ప్రతిఫలంగా పోందుతారు అలాగే తమ జీవితాలను వినయం, పేదరికం పై ఆధారపడి జీవించే పునీతులు దేవునిపై నమ్మకాన్ని కలిగి జీవిస్తున్నారు. తమ వ్యక్తిగత యోగ్యతలను గణనీయంగా పెంచుకుంటు గొప్ప పునీతులవలె సమానమైన పవిత్రతను సాధిస్తారు.

### 3.2.4. అన్ని సమయాలలో దేవున్ని విశ్వసించడం

మనం విజయాల గురించి ఆలోచిస్తే అది మన ప్రయత్నాలను ప్రోత్సహిస్తుంది, మన ఔదార్యాన్ని ప్రేరేపిస్తుందని కొన్నిసార్లు అనుకుంటాం.

ఈ అభిప్రాయంలో ఎంతోకొంత నిజం ఉంది. అయినప్పటికి మన విజయ రహస్యాలను గుర్తించడంలో ఎంతోమేలు కలుగుతుంది. “మన ప్రభువు ఏమి చేస్తున్నాడో తెలుసుకోవలసిన అవసరము లేదు.” అని తెరేస అంటున్నారు. తెరేస సోదరి సెలినుకు తన జ్ఞాపకలను నెమరువేసుకుంటు యిలా వ్రాసింది.

“దేవుడు తన ప్రియమైన తెరేసకు అన్నింటిలో నుండి మంచి, చెడులను తెలుసుకోని తనను తెలుసుకునేలాగ నేర్పించును. అతడు తన ప్రేమ నిధిని ఎలా ఉపయోగించుకోవాలో నేర్పుతాడు, కాని తెరేస ఆ నిధిని ఎలా సంపాదించుకోవాలో అని ఆలోచించలేదు, కాని దేవుడు అన్ని విషయాలలో సహాయం చేస్తాడు” అనే నమ్మకంతో తెరేస ఆయనపై మాత్రమే విశ్వాసం ఉంచి ఆత్మలో మరింత సమర్థవంతంగా ఎదుగుటను కోరుకుంది.

మనం ప్రతినిత్యం ఆధ్యాత్మిక పేదరికమును పాటిస్తూ దేవునిపై నిజమైన నమ్మకాన్ని కలిగి జీవించాలి. ఏ ఆత్మలు అయితే దేవునిపై విశ్వాసం ఉంచి జీవిస్తారో వారు ఎల్లప్పుడు దేవుని అనుగ్రహాలు, కృపావరములు కలిగి జీవిస్తారు. “మన మంచితనం దేవుని మన హృదయంతో ప్రేమించడంలో, మనం ఈ లోకంలో ఉన్నప్పుడే ఆత్మలో పేదలుగా ఉండటంలో ఉంటుంది. ఆత్మలో నిజంగా పేదవాడిగా ఉండే ఆనందం ఇంకోటి ఉండదు.

## 3.3. దేవునిపై నమ్మకం

### 3.3.1. పరలోక తండ్రి మరియు ఆయన కుమారునిపై నమ్మకం

మన చిన్నతనాన్ని, అసమర్థతను గుర్తించుకోవడం సరిపోదు, మనలో ఉన్న పేదరికం, దౌర్భాగ్య స్థితిని గుర్తుంచుకొని ఈ స్థితిలో మనల్ని మనం చూడటానికి ఇష్టపడాలి. ఈ సత్యాన్ని ఒప్పుకోక తప్పదు. ఏ సందేహం లేదు. మనం మనమున్న స్థలం నుండి వేరొక స్థలమునకు వెళ్లుటకు మనకు కావలసిన అంత బలం, ధనం ఉంది కావున అది ఆధిక విశ్వాసం కలిగించే మార్గాన్ని కూడా ఎదుర్కొంటుంది అని అనుకుంటాం. కాని కేవలం మన మీద మనం విశ్వాసాన్ని ఉంచి దానిని సాధించలేం. ఎందుకంటే మనం బలహీనులలం.

మన శక్తి సరిపోదు. దేవుని సహాయాన్ని మనం అర్థించాలి. దేవుని సహాయంతోనే మనం దేవుని దరికి చేరగలం.

ఒక పిల్లవాడు తన బలహీనత వలన, పేదరికం వలన సహాయం కోసం తన తండ్రి యొద్దకు వెళ్తాడు. అదే విధంగా మన ఆధ్యాత్మిక జీవితంలో కూడా ఆ పరలోక తండ్రిపై ఆధారపడి ఉండాలి. అప్పుడు ఆ బిడ్డ విశ్వాసంతో దేవున్ని పార్థిస్తాడు. బలహీనంగా, తన సొంత శక్తి చేత తాను సాధించలేనిది దాని కోసం ఎల్లప్పుడు తన తండ్రి పై ఆధారపడి సహాయం కోసం ఆశించాలి. ఆ బిడ్డకు తెలిసిన చిన్నపాటి జ్ఞానమైనా అది తండ్రి హృదములలో నుండి వచ్చిందంటే అది అనంతమైన విశ్వాసాన్ని ఇస్తుంది. ఎందుకంటే ఇక్కడ దేవుడు తండ్రి కాబట్టి, ఆయన అన్ని లక్షణాలను కలిగి ఉంటాడు. తండ్రికి ప్రేమ, సున్నితత్వం, ఒర్పు, సహనము మొదలైన లక్షణాలు ఉండాలి. అతడు దేవుడు కాబట్టి ఈ లక్షణాలు అనంతం. అతను అత్యంత తెలివైనవాడు, అత్యంత శక్తివంతుడు. ఆయనకు అన్ని విషయాలు తెలుసు, అతను అన్ని పనులు చేయగలడు. అతని లక్షణాలు అన్ని దయగల సేవలో ప్రేమరూపంలో ఉన్నాయి. దేవుని బిడ్డ యొక్క విశ్వాసానికి అవధులు ఉండవు.

### 3.3.2. దేవునిపై తెరేసగారి పూర్తి నమ్మకం

ఆమె చిన్న తనంలోనే అన్ని వేళలలో అని పరిస్థితులలో దేవునిపై సంపూర్ణ నమ్మకం కలిగి ఉండడం తనకు తానుగా శిక్షణ పొందింది. ఇతరులు ఇది నేర్చుకోవడానికి చాలా సంవత్సరాలు పడుతుంది అని ఆమె అప్పటికే గ్రహించింది. నిరుత్సాహం ఆత్మకు లాభం కాదు. అందుకనే తాను మొదటి సారిగా దివ్య సత్ప్రసాదం స్వీకరించినప్పుడు ఆ రోజు సాయంత్రం తన డైరీలో ఇలా వ్రాసింది. "నేను ఎప్పుడు కూడా నిరుత్సాహపడను". ఆమె తీసుకున్న తీర్మానం ఆమె జీవితమంతా పాటించింది. దేవునిపై ఆమెకు ఉన్న విశ్వాసం బాహ్య సంఘటనల ద్వారాగాని, ఇతర లోపాల వల్లగాని, తన సొంత లోపాల వల్లగాని తగ్గిపోలేదు, దీనికి విరుద్ధంగా, ఆమెకు సహజంగా వచ్చిన బలహీనతలను తాను గుర్తించి, ఇతరుల లోపాలను మరింత ప్రేమతో తీర్పు ఇవ్వడానికి ఆమె ఆ సంఘటలు నుండి నేర్చుకుంది. "నా తప్పులు నాకు

వినయాన్ని నేర్పించి, నా సొంత బలముపై కాక దేవునిపై ఆధారపడి జీవించడానికి దోహదపడుతున్నాయి. నా తప్పుల ద్వారా దేవుని యొక్క దయ, ప్రేమ మరింత ఎక్కువగా రుచి చూచాను. దేవున్ని విశ్వాసంతో ప్రార్థిస్తే మన తప్పులు ఆయన యొక్క అనంత ప్రేమలో కలిసినప్పుడు అవి కనిపింపకుండా ఉండడంలో విఫలమవుతాయి?" అని తన భావాలను వ్యక్తపరచింది.

నేను ఎల్లప్పుడు విశ్వాస పాత్రురాలిని కాదు అని ఆమె ఒకానొక సమయంలో ఇలా వ్రాసింది. ఆత్మకు శాంతినిచ్చే చిన్న చిన్న త్యాగాలు కూడా నేను చేయుడంలో తరచుగా విఫలం అయ్యేదాన్ని, అయితే నేను నిరుత్సాహపడలేదు దానికి బదులుగా నన్ను నేను సంపూర్ణంగా యేసు ప్రభువు చేతులలో ఉంచేదాన్ని. ఆ క్షణంలో తక్కువ శాంతి కలిగి ఉన్నాననే బాధను భరిస్తాను. మరల అలా జరగకుండా మరింత జాగ్రత్తగా ఉండటానికి ప్రయత్నిస్తాను అని తన భావాలను వెళ్లడించింది. ఆమె సిలువ యోహాను చెప్పినట్లుగా "ప్రేమకు ప్రతిదాని నుండి ఎలా లాభం పొందాలో తెలుసు." యేసు ప్రభువునకు అంసంతృప్తి పరిచిన దానిని ప్రేమ తుడచివేస్తుంది, ఎందుకంటే మన హృదయాల దిగువన ఉన్నది ఒక వినయాత్మకమైన శాంతి దాయకమైన మనస్సు.

## 3.4. దేవుని పట్ల, మానవుని పట్ల ప్రేమ

### 3.4.1. నమ్మకం దేవుని ప్రేమ లోనికి నడిపించుట

దేవుడు దయాయుడు, ప్రేమామయుడని మనందరికి తెలుసు, అందుచేతనే ఆయన యొద్దకు విశ్వాసంతో వెళ్తాం, దానికి బదులుగా విశ్వాసం ప్రేమ లోనికి నడిపిస్తుంది. ఇప్పుడు ప్రేమ అనేది ఆత్మ యొక్క ఆధ్యాత్మిక బాల్య మార్గం. ఇది ఆధ్యాత్మిక జీవితానికి పునాది, మార్గదర్శక సూత్రం, ఆత్మ యొక్క పూర్తి పరిపూర్ణతకు ఎదుగుదలకు ఏకైక సాధనం. మనం ప్రేమలేకుండా మన ప్రయత్నాలను విజయవంతమునకు, ముగింపునకు తీసుకొనిరావడానికి అవసరమైన విశ్వసనీయత మనకు ఉండదు. కావున ప్రేమను మన జీవితాలలో బలంగా నాటుకోవాలని ఆమె తన భావాలను వ్యక్తపరచింది.

### 3.4.2. దేవుని ప్రేమ

పునీత చిన్న తేరేసమ్మగారు దైవ మానవ ప్రేమలను గూర్చి అప్పుడప్పుడు ఈవిధంగా తలస్తూ ఉండేది. "దేవుడంటేనే ప్రేమ. ఎక్కడయితే ప్రేమ ఉంటుందో అక్కడే దైవ ప్రేమ ఉంటుంది. ప్రేమలేని వాని హృదయంలో దైవానికి స్థానం లేదు. దేవుని ప్రేమ వల్లనే నాలో ఎంతో మార్పు వచ్చింది. ఈ మార్పే నన్ను ఎంతో చైతన్యవంతంగా చేసింది. నాకు సకలం ప్రసాదించింది ఆదైవమే. ఆదైవం నన్నెప్పుడు విడనాడడు. నా సృష్టికర్త ఆ దైవమే. ఆదైవ ప్రేమను చవిచూచుటకంటే ఇంకేంకావాలి? నా సమస్త బాగోగులు ఆయనకు తెలుసు. ఆయన సర్వజ్ఞుడు, ఇప్పుడు నాకున్న దంతయు నాది కాదు ఆయనదే. ఈ సమస్తము ఆయననుండియే ఆయన కొఱకే. ఆయనను సదా మహిమ పరచుటకే నన్ను సృష్టించాడు. కాబట్టి నా సమస్తాన్ని, నన్ను పూర్తిగా ఆయనకే అర్పించుకొని నా హస్తములను ఆయన అభయ హస్తములతో జోడించి, మేళవించి, ఆయన సన్నిధి చేరుటకు నిరంతరము ప్రయాసపడుదును" అని ఈవిధముగా దైవ ప్రేమను వ్యక్తం చేసిన వ్యక్తి పునీత చిన్న తేరేసగారు.

### 3.4.3. సోదర ప్రేమ

దైవప్రేమను మాత్రమే కాకుండా సోదర ప్రేమను కూడ పరిపరి విధాల వ్యక్తం చేసింది. ఇట్టి సందర్భములో క్రీస్తు ప్రభువు పల్కిన మాటలను ధ్యానించుట సముచితం. ప్రభువు కడతీర్పు సమయమున మంచివారితో "ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినపుడు అవి నాకు కూడ చేసితిరని వక్కాణించుచున్నాను" అని వారితో చెప్పెను (మత్తయి 25:40).

దైవప్రేమను మన దైనందిన జీవితంలో సోదర ప్రేమ ద్వారా వ్యక్తపరచాలి. మనం ఇతరులను ఏ చూపుతో చూచెదమో అదేవిధముగ మనమును చూడబడుదుము. దైవ ప్రేమ ఉన్నదని ఎలుగెత్తి చాటుచూ, ప్రక్కనున్న తోటి సహోదరుని చిన్న చూపు చూచినట్లయితే మనకు మనమే మోసపోయిన వార మగుదుము. సంకుచిత భావాలతో, స్వార్థబుద్ధితో గాకుండా, నిస్వార్థబుద్ధి కలిగి, త్యాగబుద్ధితో ఇతరులను ఆదరించుట, ప్రేమించుట, అలవర్చుకోవాలి.

మనం ఇతరులను దేవుని దృష్టితో ప్రేమించాలి, ఆదరించాలి, సేవించాలి. మన జీవితమంతా త్యాగ పూరితమైన బుద్ధితో ప్రేమామయుడైన క్రీస్తు జీవితంలో లీనమై పోవాలి. అలా కావాలంటే మన అహంభావాన్ని, లోభితనాన్ని చంపుకోవాలి. వినయము, నమ్రతను, త్యాగబుద్ధి పెంపొందించుకోవాలి. దీనికి చక్కని మార్గము చిన్న తేరేజమ్మగారి చిన్ని మార్గము.

### 3.4.4. ఆత్మలను రక్షించుట కొరకు ఉత్సాహం చూపుట

ప్రేమ అనేది మనం ఎవరితో నివసిస్తున్నామో, ఎవరితో సంబంధాలు కలిగి జీవిస్తున్నామో వారికి మాత్రమే పరిమితం కాదు. దేవుని ప్రేమ మనుష్యులందరికి విస్తరించబడింది. క్రీస్తు ప్రభువు తన జీవితాన్ని అందరికి ఎలా అర్పించారో మనం కూడా మన ప్రేమను కొందరికి మాత్రమే కాకుండ అందరికి విస్తరింపచేయాలి. మన ప్రేమ బలంగా ఉన్నప్పుడు అది ఉత్సాహాన్ని వ్యక్తపరచి, ఆ ఉత్సాహం దేవుని మహిమ కొరకు, ఆత్మల రక్షణ కొరకు దోహదపడుతుంది.

ఈ కారణముచేతనే పరిశుద్ధ పాపుగారు అమెను వేదవ్యాపకుల పాలక పునీతురాలుగా ప్రకటించారు. ఆత్మలను రక్షించాలనే ఉత్సాహం, ఆసక్తి ఆమె చిన్ననాటి నుండే ఆమె హృదయంలో రగిలింది.

## 3.5. అమె నిరాడంబరత

### 3.5.1. నిరాడంబరత మరియు చిన్ని మార్గం

నిరాడంబరత, ఆధ్యాత్మిక బాల్య మార్గానికి చెందినది. ఒక పిల్లవాడు తన స్వభావంలో, అలోచనలో, తన భావాలను వ్యక్తపరచడంలో, తన చర్యలలో చాలా సరళంగా, నిరాడంబరంగా ఉంటాడు. ఈ నిరాడంబరత దేవుని బిడ్డ విషయంలో కూడా నిజం.

వాస్తవానికి, నిరాడంబరత అనేది "ఆధ్యాత్మిక బాల్యం" యొక్క విశిష్టమైన లక్షణం. అయితే దీనిని సరిగ్గా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇది సాధారణమైనదిగా, సాధారణమైన చర్యలను మాత్రమే చేయడంలో కొందరు

నమ్ముతున్నట్లుగా ఇది ఉండదు. తెరేసగారి నిరాడంబరత అన్నింటికంటే ముఖ్యంగా మనస్సు యొక్క వైఖరి. తెరేసగారి నిరాడంబరత స్ఫూర్తితో ఒక వ్యక్తి అన్ని విషయాలను, అన్ని సంఘటనలను దేవునితో సంబంధం ఉన్నట్లు భావిస్తాడు. అన్ని విషయాలు దేవుని నుండి వచ్చాయని, ప్రతిదీ ఆయనకు సూచింపబడాలని అతనికి తెలుసు. అందువల్ల, అతను తన మార్గంలో వచ్చే ఆనందాలను, శ్రమలను, బాధలను సమానంగా అంగీకరిస్తాడు. అతను అన్ని విషయాలను దేవుని వైపు ఆజ్ఞాపిస్తాడు. సంక్లిష్టమైన, వంచక, అసాధారణమైన దాన్ని ఇష్టపడడు, కాని సాధారణమైన వాటితో సంతోషిస్తాడు. ఆ విధంగా అతని జీవితం పూర్తిగా సరళీకృతం చేయబడుతుంది. అతని ఆధ్యాత్మిక జీవితం చాలా నిరాడంబరంగా ఉంటుంది. ఒక పిల్లవాడు తన తండ్రి దగ్గరకు ఎలా వెళ్తాడో అతను కూడా నేరుగా దేవుని వద్దకు అలానే వెళ్తాడు. అతని ప్రార్థనలో కృత్రిమత ఉండదు, అతని పశ్చాత్తాప క్రియలు విపరీతంగా ఏమీ ఉండవు. దేవుని నుండి వచ్చిన అన్ని కష్టాలను, సుఖాలను సమానంగా స్వీకరిస్తాడు.

### 3.5.2. ఆమె ప్రార్థనలో నిరాడంబరత

తెరేసగారి ప్రార్థన చాలా నిరాడంబరమైనది, కఠినమైన సూత్రాలంటే ఆమె ఇష్టపడదు. ఆమె ప్రార్థన ప్రధానంగా యేసు ప్రభువును ప్రేమిస్తున్నానని, అన్ని విషయాలలో ఆయన చిత్తాన్ని చేయాలని కోరుకుంటున్నానని చెప్పడంలో ఉంది. “అందమైన ప్రార్థనల కోసం వేటాడేందుకు నాకు శక్తి లేదని, ప్రభువు ఎప్పుడూ నన్ను అర్థం చేసుకుంటాడు” అని అమె వెళ్ళడించింది. “నాకు ప్రార్థన అంటే నా హృదయాన్ని పైకి ఎత్తి స్వర్గం వైపు చూడడం. ప్రార్థన గొప్పది, అతీంద్రియమైనది, మన ఆత్మలను ఆ ప్రభువుతో ఏకం చేస్తుందని” వ్యక్తపరచింది.

### 3.5.3. ఆమె చర్యలలో నిరాడంబరత

తెరేసగారు తన సొంత సాక్ష్యం ప్రకారం, సాధారణమైన పనులను మాత్రమే కోరుతుంది. దేవునికి అతి తక్కువ విషయాలను మాత్రమే అందించగల వ్యక్తిలాగా ఆమె తనను తాను చాలా తక్కువగా భావించకుంది. దేవుడు,

"అందమైన పనుల కోసం, అద్భుతమైన పనుల కోసం, ఈ భూమిపై తెలివితేటలు లేదా ప్రతిభ కోసం అతను వెతకడు. అతను నిరాడంబరతను ప్రేమిస్తాడు. మనం గొప్ప పనులు చేయవలసి వస్తే మనం నిజంగా జాలికి అర్హులం. ఆత్మను పోషించే, మనల్ని దేవునికి ఏకం చేసే లోతైన ఆలోచనలను నేను తృణీకరించను, కాని అలాంటి పునాదులపై మనం నిర్మించాల్సిన అవసరం లేదని నేను చాలా కాలంగా అర్థం చేసుకున్నాను." "నిజమైన కీర్తిని పొందాలంటే మనం అద్భుతమైన పనులను సాధించనవసరం లేదని గ్రహించే శక్తిని దేవుడు నాకు ఇచ్చాడు, కాని మనం చేసే పనులు బహిరంగ పరచకుండ మనం ధర్మాన్ని పాటిస్తూ మన కుడిచేయి చేసే పనులను ఎడమ చేతీకి తెలియ కుండునట్లుగా ఉండాలని తన భావాలను తెలియజేసింది."

### 3.5.4. తప్పులను సరిదిద్దుకోవడంలో ఆమె నిరాడంబరత

తెరేస తన లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దడానికి ప్రయత్నించే విధంగా ఆమె నిరాడంబరతను అభ్యసించింది. "యేసు ప్రభువును ఆనందపరచడం ఎంత సులభం'' అని తన అక్కతో చెప్పింది. మన దృష్టిని మనపై ఉంచుకోకుండా, మన లోపాలను చాలా లోతుగా పరిశీలించకుండా మనం ఆ ప్రభువును ప్రేమించాలి. యేసు ప్రభువు వైపు ఒక్కసారి చూస్తే చాలు మన దౌర్భాగ్య స్థితి వ్యక్తపరపబడి మరల ప్రతీది మరోసారి క్రమంలో ఉంటుంది.

మన తప్పులను గుర్తించిన తరువాత, ఆమె మనకు ఇలా సలహా ఇస్తుంది, "మనం వినయముతో చింతించి, ప్రేమతో ఆ తప్పులకు నష్టపరిహారం చెల్లించాలి. మన తప్పిదాలను సరిదిద్దడానికి ప్రేమ మనకు ఉత్తమ సాధనం, ఎందుకంటే భవిష్యత్తులో విఫలమవ్వకుండా ఉండటానికి ఇది మనకొక ఉత్తమ రక్షణ."

### 3.6. దేవుని ఇష్టానికి తనను తాను పరిత్యజించుకొనుట

ఆమె జీవితం ద్వారా తెరేస తనను తాను నిరంతరం దేవునికి విశ్వసనీయంగా ఉంది. దేవుని చిత్తానికి అనుగుణంగా ఉండటం, అతని చిత్తం తప్ప వేరే సంకల్పం లేకపోవడం ఆమె నిరంతర ఆందోళన.

ఆ దేవుని సంకల్పం పట్ల ప్రేమతోనే తన మత జీవితాన్ని పరిపూర్ణతతో జీవించడానికి ఆమె తన వంతు కృషి చేసింది. మనం ఒకరినొకరు ప్రేమించుకోవాలన్నది దేవుని చిత్తమని ఆమెకు తెలుసు, అందువల్ల, యేసు మనలను ప్రేమించినట్లుగా తన పొరుగువారిని ప్రేమించటానికి ఆమె ఎప్పుడూ తన వంతు కృషి చేసింది. ఆమె బాధలను అనుభవించడం కోసం గొప్ప కోరికను కలిగి ఉంది, ఎందుకంటే ఇది ప్రేమ యొక్క అత్యున్నత రుజువుగా, దైవీక రక్షకుడితో గుర్తించబడటానికి చాలా సరైన మార్గంగా భావించింది. ఇంకా మానవుల ఆత్మలను కాపాడటానికి దేవుని చిత్తాన్ని గ్రహించే ఉత్తమ మార్గంగా ఆమె భావించింది.

అయితే, ఆ క్షణం నుండి, పరిత్యాగం ఆమె ప్రవర్తనా నియమంగా మర్చుకుంది. "యేసు నా కోసం కనుగొన్న మార్గాన్ని నేను అనుసరిస్తున్నాను" అని ఆమె రాసింది. "ఇతరులు తనతో ఏమి చేయవచ్చునే దాని గురించి చింతించని చిన్నపిల్లలాగే నేను పరిత్యాగం పాటించాలని అతను కోరుకుంటాడు." "ఇకపై నేను నా విషయాలపై దృష్టిసారించకుండా ప్రయత్నిస్తాను, ప్రభువు నా ఆత్మలో సాధించాలనుకున్నదాన్ని ఆయనకు వదిలివేస్తాను" అని తెలియజేసింది.

అటువంటి వైఖరి ఉన్నతమైనది అని ఖచ్చితంగా చెప్పవచ్చు. మన కార్యకలాపాలలో మనల్ని ప్రేరేపించే ఉద్దేశ్యం లేదా ప్రేమ ఏమైనప్పటికీ, దేవుని పట్ల మనల్ని పూర్తిగా విడిచిపెట్టడం కంటే ప్రేమకు, విశ్వాసంకు గొప్ప రుజువు మరొకటి లేదు. ఆయనను గౌరవించటానికి ఈ విశ్వంలో, మన సొంత జీవితాలలో ఆయన యొక్క అత్యున్నత పాత్రను గుర్తించడం కంటే మరొక మంచి మార్గం లేదు.

పరిత్యాగం, మరోవైపు, మన విధిని గ్రహించడానికి, మనం పిలువబడే పవిత్రతను సాధించడానికి మంచి మార్గాన్ని ఇస్తుంది. ప్రతి ఆత్మకు సంబంధించి దేవునికి ప్రత్యేకమైన నమూనాలు ఉన్నాయి, అవి ఏమిటో ఆయనకు మాత్రమే తెలుసు. మనం దేవుని చిత్తానికి మనల్ని విడిచిపెట్టినప్పుడు, మనం సురక్షితమైన

మార్గములో నడుస్తాం. ఆయన మన కోసం నిర్దేశించిన లక్ష్యానికి చాలా త్వరగా చేర్చే మార్గంలో ప్రవేశిస్తాం.

దేవుని చిత్తం లేకుండా ఏమీ జరగదని తెరేసకు నమ్మకం కలిగింది. “మన జీవితంలో చాలా ముఖ్యమైన సంఘటనలు దేవుని దర్శకత్వంలో ఉన్నాయని నేను ఇంతకు ముందు ఎప్పుడైనా చేసినదానికన్నా బాగా అర్థం చేసుకున్నాను” అని ఆమె రాసింది. “ప్రతిదానికీ మార్గనిర్దేశం చేసేది క్రీస్తు హస్తం. ప్రతి విషయంలోనూ ఆయనను కనుగొనాలని తన నమ్మకాన్ని వ్యక్తపరచింది.”

## 3.7. ఆమె బాధలు

తెరేసగారి జీవితంలో బాధలకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. ఆమె పిలుపును యేసు ప్రభువుతో కలిసి భాధలను అనుభవించే ప్రాతను స్వీకరించుటకొరకే అని అంగీకరించింది. అమె యొక్క రచనలు మనకు ఈ నిజాన్ని తెలియజేస్తాయి. ఆమె కార్మేలు మఠంలో చేరింది సిలువ మొక్క నీడను పెంపొందించుట కొరకే. ఆమె ప్రకారం జ్ఞానం అనేది మన బాధలనుండి, మనం మోసే సిలువలనుండి వస్తుంది. మరి నిజమైన జ్ఞానము దేనిలో ఉందంటే మొదటగా, మనం ఎవరికి తెలియనవారిగా, దేనిలోను లెక్కలోనికి రానివారిగా ఉండటాన్ని కోరుకోవడం. రెండవదిగా మనకి ఉన్న దానితో సంతృప్తి చెందటం. మూడవదిగా ఈ భూమిపై మనలను ఎవరు గుర్తించనవసరములేదు అని అనుకొని జీవించడం.

బాధల కొరకు ఆరాటపడం, ఇతరుల దృష్టినుండి మరచిపోబడం ఆమె కోరుకుంది. బాధలలో ఆమె ఆనందాన్ని కోరుకుంది. బాధలు నాకు ఆకర్షణగా మారాయి అని ఆమె తెలియజేసింది. ఎవరైతే బాధలను పొందుతారో వారు దేవునికి అమూల్యమైనవారు. దేవునికి ఎవరైతే ప్రీతికరముగా ఉంటారో, ఏవరి మీదయితే ఆయనకు గొప్ప నమ్మకం ఉంటుందో వారికే బాధలను ఇస్తాడు. బాధలను అనుభవించుట ద్వారా మనం యేసు ప్రభువు యొక్క ప్రేమ స్పర్శను అనుభవిస్తాం. తెరేస దేవుని చిత్తానికి తనను పూర్తిగా పరిత్యజించుకొని తన

బాధలను యేసు తిరుహృదయానికి అర్పించింది. ఆమె తన బాధలను నిశ్శబ్దముగా ఎటువంటి ఫిర్యాదులు చేయకుండా, ఇతరుల దృష్టిని ఆకర్షించకుండా అనుభవించింది. మనం అన్ని బాధలను అంగీకరించాలని ఆమె తెలియజేస్తుంది. మన జీవితాలలో బాధలను ఒక సంఘంలో లేదా ఒక మఠంలో అందరితో కలిసి జీవించినప్పుడు ఎలా అంగీకరించాలో తెలియజేస్తున్నారు.

(1) ఎటువంటి ఫిర్యాదులు లేకుండా బాధలు దేవుని నుండి వచ్చినవని సంతోషంగా అంగీకరించాలి. (2) బాధలను పేమతో అంగీకరించాలి (3) లోతైన విశ్వాసంలో బాధలను ఆలింగనం చేసుకోవాలి (4) బాధలను మనోహరమైన త్యాగంగా యేసు ప్రభువుకు అర్పించాలి.

ఇంకా మన బాధలను ఆత్మలను రక్షించే సాధనంగా మలచుకోవచ్చని, బాధల నుండి సహనం, విధేయతను, ఓర్పును, నేర్చుకోవచ్చని ఆమె తెలియజేస్తుంది. మన బాధల ద్వారా యేసు ప్రభువుపై మనకు ఉన్న ప్రేమను ఆయనకు తెలియజేయవచ్చని ఆమె వ్యక్తపరచింది.

### 3.8. ఆమె విధేయత

పునీత చిన్న తెరేసగారు తన జీవితాంతము వరకు విధేయత కలిగి ఉండాలని కోరుకున్నారు. ఏవిధంగానైతే యేసు ప్రభువు సిలువపై మరణం వరకు విధేయుడైనాడో, తాను కూడా శత్రువుల యొక్క దుష్ట శక్తిని ఎదుర్కోవడానికి విధేయతను ఒక కవచంలా మార్చుకుంది. ఈ లోకములో విధేయతను ఆచరించుట చాలా గొప్ప విషయం అని ఆమె తెలియజేసింది, ఎందుకంటే అది మనం శాశ్వత జీవితంను పొందుటకు ఎంతగానో సహాయపడుతుంది. విధేయత కలిగినవారు ప్రతి దానిలో అభివృద్ధిని పెంపొందించుకుంటారు, దేవుడు వారి జీవితాలలో ఎన్నో విజయాలను దయచేస్తాడు.

### 3.9. ముగింపు

తెరేసగారు తన జీవితం ద్వారా మనకు గొప్ప ఆదర్శంగా నిలిచారు.

ఆమె పాటించిన ఈ చిన్ని మార్గములు ఎంతో విలువైనవి ఎందుకంటే ఈ మార్గములన్నియు పెద్ద పనితో కూడుకున్నవి కావు కాని చాలా చిన్నవి, అందరు పాటించదగ్గవి. మనం చేసే పని ఎంత పెద్దదన్నది కాదు ఎంత ప్రేమతో, ఓర్పుతో చేసామన్నది ముఖ్యం. కావున ఈ చిన్ని మార్గములను అలవరచుకుంటే మానవుల దృష్టిలో చిన్నవారిగానే ఉంటారు కాని దేవుని దృష్టిలో గొప్పవారిగా జీవిస్తాం పరలోక భాగ్యం పొందుతాం.

## 4. పునీత చిన్న తెరేస: మన జీవీతాలకు ఓ చక్కని ఆదర్శం

### 4.0. ఉపోద్ఘాతం

పునీత చిన్న తెరేసగారు దేవునిచే ఎత్తబడి, శ్రీసభచేత పునీతురాలుగా ప్రకటించబడి, ఆధ్యాత్మిక బాల్య మార్గమునకు ఒక చక్కని మార్గచూపరిగా ప్రకటించబడింది. ఈ చిన్న మార్గం ఆమెకు పవిత్రాత్మ ప్రేరణ ద్వారా పవిత్ర దేవుని వాక్యము నుండే తెలుపబడింది. ఆమెను ఎక్కువ ప్రేరేపించిన వ్యాకం: యేసు ప్రభువు తన అపోస్తలులు, తమలో ఎవరు గొప్ప అని చర్చించుకున్నప్పుడు వారికి తెలియజేసిన సందేశమే. “మీరు పరివర్తన చెంది చిన్న బిడ్డల వలె రూపొందిననే తప్ప పరలోక రాజ్యములో ప్రవేశింపరని నిజముగా నేను మీతో వక్కానించుచున్నాను” (మత్తయి 18:3). మన జీవితాలలో వినయము, తగ్గింపుతనము, దేవునిపై నమ్మకము, ప్రేమను ఆచరించుట, పరిత్యజించుకొనుట, త్యాగం చేయుట, దేవుని చిత్తానికి మనల్ని అర్పించుకొనుట, బాధలను అనుభవించుట, నిరాడంబరత కలిగి జీవించుట అనేవి చిన్ని మార్గములోని ముఖ్యమైన అంశాలు, వీటిని పాటించడమే చిన్న మార్గమును ఆచరించుట.

### 4.1. వినయమును, చిన్నతనమును మన జీవితంలో ఆచరించుట

మార్కు సువార్త 10: 14-15 వచనాలలో చెప్పిన విధంగా “చిన్న బిడ్డలను నా యొద్దకు రానిండు. వారిని ఆటంక పరపకుడు ఏలన అట్టి వారిదే దేవుని రాజ్యము. ఎవరు దైవ రాజ్యమును ఈ పసిబిడ్డలవలె అంగీకరింపరో వారు అందు ప్రవేశింపరని మీతో వక్కానించుచున్నాను” అని ప్రభువు తెలియజేసారు.

మనం గొప్ప ఆస్తి కలిగి ధనవంతులుగా జీవించినా, లేదా పేదవారిగా జీవించిన పరలోకం చేరం. మనలో వినయం, దీనత, తగ్గింపుతనం, ప్రేమ, త్యాగం అనే సుగుణాలను అలవరచుకుని జీవించినప్పుడే దేవుని చెంతకు వెళ్తాం. ముఖ్యంగా ప్రభువు పలికిన విధంగా పరలోక రాజ్యం చేరాలంటే గొప్ప వారిగా ఉండనక్కరలేదు కాని చిన్నబిడ్డలవలె కల్మషములేని హృదయముతో వినయం, తగ్గింపుతనం కలిగి జీవిస్తే చాలు.

### 4.2. ఆధ్యాత్మిక పేదరికమును ఎందుకు ఆచరించాలి?

ఎందుకంటే మనం ఆధ్యాత్మిక బాల్య మార్గములోనికి ప్రవేశించాలంటే మన ఏమిలేమి వారముగా ఉండాలి. ప్రతీది దేవుని నుండి ఆశించాలి. ఉదాహరణకు ధనవంతుల కుటుంబాలలో ఉన్న చిన్న పిల్లవాడు తనకు తానుగా ఏ ఆస్థిని పొంది ఉండడు. ప్రతిదానికి తన తల్లితండ్రుల మీద ఆధారపడి ఉంటాడు. ఆ విధంగానే తన తల్లిదండ్రులు తమ బిడ్డకు కావలసిన వాటన్నింటిని సమకూరుస్తారు. అలాగే మనం కూడా ఏమిలేని వారిగా ఉంటు మన ఆధ్యాత్మిక జీవితంను పెంపొందించుటకు మన తండ్రియైన దేవుని మీద ఆధారపడి జీవించాలి. అప్పుడు ఆయన మనకి కావలసిన అనుగ్రహాలను దయచేస్తారు.

### 4.3. దేవునిలో సంపూర్ణమై నమ్మకం కలిగి జీవించాలి

మన ప్రభువు మన జీవితంలో ఎన్నో మేలులు చేస్తుంటాడు. మనం అడగకముందే అనేక కృపావరములను ఒసగుతారు. ఒక వేల ఆయన మననుండి కృతజ్ఞతగా ఏమైనా కోరుకుంటే మనం గుర్తుంచుకోవలసిన ముఖ్యమైనది ఏమనగా మనం ఆయన ప్రేమకు మన డబ్బులతో కాని, ఈ లోకములో ఉన్న ఏ వస్తువులతో కాని వెలకట్టలేం. మనం దేవునికి ఏమైనా ఈయగోరితే అది కేవలం మనం ఆయన పట్ల వినయముతో సంపూర్ణ నమ్మకం కలిగి ఉండడం.

ఒక చిన్న పిల్లవాడు బలహీనంగా , ఏమిలేనివాడిగా ఉంటాడు అతను ఏమి చేయలేడని మనకు తెలుసు. కాని తన తండ్రి యొక్క ప్రేమ పిల్లవాడికి

అన్నిటిని దయచేస్తుంది. అప్పుడు అతని బలహీనస్థితి అతనికి ఒక గొప్ప శక్తిగా మారుతుంది. ఉదాహరణకు ఒక చిన్న పిల్లవాడు అప్పుడే బుడిబుడి అడుగులు వేస్తున్నపుడు, అతనికి మొదటగా సాధ్యపడదు. ఎందుకంటే అతని కాళ్ళు చాలా బలహీనంగా ఉండి అతనికి సహకరించవు. కొన్ని సార్లు క్రింద పడే ప్రమాదం కూడా ఉంది. తనంతటతాను ఏమిచేయలేని పరిస్థితి, కాని అక్కడ సంతోషకరమైన విషయం ఏమిటంటే తన తండ్రి తనతోనే ఉన్నాడు. ఒక చూపు తన తండ్రి వైపు చూస్తేచాలు అతను పరిస్థితిని అర్ధం చేసుకొని తన బిడ్డను తన చేతులలోనికి తీసుకొని, తన హృదయానికి హత్తుకుంటాడు. అప్పుడు ఆ బిడ్డ సంతోషానికి అవధులు ఉండవు. మన దేవుడు కూడా మనం అలా ఆయన మీద ఆదారపడి జీవించినప్పుడు మన కష్టాలలో తప్పకుండా మనల్ని కాపాడడానికి వస్తాడు. మన దేవుడు గొప్ప దేవుడు, మనం పిలువకున్నా తరచుగా ఆయన మనకు సహాయం చేయుటకు వస్తాడు. యేసు ప్రభువు చెప్పిన విధంగా తండ్రినిగ నా పేరిట ఏమి అడిగినను ఆయన మీకు ప్రసాదించును. కావున మనం ప్రతినిత్యం ఆయనపై సంపూర్ణ నమ్మకం కలిగి జీవించాలి.

## 4.4. ప్రేమను మన జీవితాలలో ఆచరించాలి

తెరేసగారు తాను మరణించేముందు చివరిగా చెప్పిన మాటలు ప్రేమ గురించి, "ప్రేమ అన్నిట కన్నా లెక్కించదగినది" (it is Love alone that counts), తన చివరి మాటలను ఒక మఠకన్యకు తెలియజేసింది. అవును ప్రేమ ఒక్కటే మనం చేసే ప్రతి కార్యాన్ని, ఆలోచనలను, మాటలను లెక్కిస్తుంది. ఎందుకంటే యోహాను వ్రాసిన మొదటి లేఖలో 4:7, "ప్రేమ దేవుని నుండి పుట్టినది. కనుక మనం పరస్పరం ప్రేమింతుము. ప్రేమించువాడు దేవుని బిడ్డ, అతను దేవుని ఎరిగినవాడు. దేవుడు మనపాపాల విమోచన నిమిత్తం తన కుమారుని పంపెను." దేవుని ప్రేమ చాలా గొప్పది. అతను మన నుండి కోరుకునేది, మనల్ని పెద్ద పనులను చేయమని కాదు. కాని ప్రతీది ప్రేమతో చేయాలి. మొదటిగా తనను ప్రేమించి, మన పొరుగువారిలో సఖ్యత కలిగి ఒకరియెడల ఒకరు ప్రేమ కలిగి జీవించాలి. ప్రేమ ఉన్నచోట ఎటువంటి

ద్వేషం, అసూయ, కోపతాపాలు ఉండవు. ఎందుకంటే ప్రేమ అన్నిటి, జయిస్తుంది. “ప్రేమ సమస్తమును భరించును, సమస్తమును విశ్వసించును, సమస్తమును ఆశించును, సమస్తమును సహించును” (1 కొరింతీ 13:7) కనుక ప్రేమను మన జీవితంలో గట్టి పునాధిగా నాటుకొని సమస్తం జయించి ప్రభుదరికి చేరాలి.

## 4.5. దేవునికి మనలను సమర్పించుకోవాలి

ఒక పిల్లవాడు కల్మషములేని హృదయముతో తన సంతోషములో కాని దుఃఖములో కాని తన తండ్రి చెంతకు వెళ్తాడో మనం కూడా మంచి హృదయంతో విశ్వాసం కలిగి మన ప్రభువైన తండ్రికి మన యొక్క సుఖదుః ఖాలను సమర్పించాలి. తన తండ్రి హస్తాలలో పిల్లవాడు ఎటువంటి భయాందోళనలు లేకుండా హాయిగా నిద్రిస్తాడో మనం కూడా ఆవిధంగా హాయిగా దేవుని హస్తాలలో నిద్రించాలంటే మనం ప్రతి నిత్యం మన జీవితాలను దేవుని చిత్తానికి అర్పించాలి. అప్పుడే మనకు ప్రశాంతత అనేది ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితానికి ఇది ఒక గొప్ప మార్గము. మన జీవితాలలో సంపూర్ణత రావాలంటే మనం ప్రతి నిత్యం ప్రతిక్షణం దేవుని చిత్తాన్ని అనుసరిస్తూ జీవించాలి. మనలను దేవునికి చిత్తానికి స్వేచ్ఛగా వదిలివేసి ఆయన మన దగ్గర నుండి ఏమి కోరినా మనము ఏమి ఇచ్చినా మంచి మనస్సుతో ఇవ్వాలి అదే విధంగా స్వీకరించాలి. మనకు సుఖాలను ఇచ్చినా స్వీకరించాలి దుః ఖాలను ఇచ్చినా స్వీకరించాలి. అప్పుడే మన జీవితాలలో సంపూర్ణత అనేది వస్తుంది.

## 4.6. నిరాడంబరతను ఆచరించాలి

నిరాడంబరత అనేది మనం జీవితాలలో ఒకేసారి అనగా, మన పుట్టుకతోనో లేదా మనకు ఒక బహుమానంగానో లేదా ఒక ప్రత్యేక సమయంలో మనకు రాదు. నిరాడంబరత అనేది మన రోజువారి జీవితాలలో కొంచెం కొంచెముగా అభివృద్ధి చెందుతుంది. నిరాడంబరత అనేది మన

హృదయాలనుండి, మన మనస్సుల నుండి, మన ప్రవర్తన నుండి కపటత్వమును, ద్వంద్వ స్వభావాలను వీడి ప్రతిక్షణం మంచి ఆలోచనలతో, ప్రేమ, మృదు స్వభావాలను మనం అలవరచుకున్నప్పుడు మనలో పెంపొందుతుంది. మనం చేసే ప్రార్థనలో కాని, క్రియలలో కాని, ఇంకేదైన పనిలో మనం చిన్న పిల్లలవలె నిర్మల మనస్సు కలిగి స్వచ్ఛంగా జీవించినప్పుడు మనం నిరాడంబరతను అలవరచుకోవచ్చు.

## 4.7. బాధలను మన జీవితాలలో ఏవిధంగా అర్థం చేసుకోవాలి

మన జీవితంలో ఎదురయ్యే బాధలు అనేకమైనవిగ, అనేక విధాలుగా ఉంటాయి. మనం బాధలను అనుభవించుట అవసరమా అని ప్రశ్న వేసుకుంటే అవి అవసరమే. ఎందుకంటే మొదటగా మనకు వచ్చే బాధలు మనలను ఈ లోకం నుండి వేరుచేసి పైలోకం వైపు చూసేలాగున చేస్తాయి. సృష్టింపబడిన ప్రతిదాని నుండి మనలను వేరుచేసి, ఏదైతే యేసు ప్రభుకు చెందినదో కాదో దానిని వేరుచేసి మనలను శుద్ధి చేయడానికి, మంచివారిగ మలచడానికి బాధలు అవసరం. ఇంకా బాధలు మనల్ని దేవునికి దగ్గరగా చేస్తాయి. రెండవదిగా బాధలు మనల్ని ప్రేమించిన దేవుని కోసం అనుభవించాలి ఆ ప్రభువు కోసం మన జీవితంలో వచ్చే బాధలను ఓర్పుతో భరించాలి. మూడవదిగా ఎటువంటి బాధలను అనుభవించకుండా మనం పరలోకం చేరలేం. మత్తయి సువార్త 5:10 లో ధర్మార్థం హింసితులు ధన్యులు దైవ రాజ్యమువారిది." అని ప్రభువు తెలియజేసారు. మనం ధర్మాన్ని పాటించినప్పుడు ఎన్నో బాధలను, హింసలను అనుభవించాల్సి ఉంటుంది. కావున మనం ఓర్పుతో సహించాలి. నాల్గవదిగ ఆత్మల రక్షణ కోసం మనం బాధలను అనుభవించాలి. యేసు ప్రభువు మనలను రక్షించడానికి సిలువలో తన రక్తాన్ని కార్చి మన కోసం మరణించారు. అలాగే ఎందరో పునీతులు ప్రభువును అనుసరించి ఆత్మలను రక్షించుట కొరకు వేదసాక్షులయ్యారు. "వేద సాక్షుల యొక్క రక్తం క్రైస్తవత్వానికి పునాదులైనట్లు" మనం కూడా ఆత్మలను రక్షించుట కొరకు బాధలను సంతోషంగా స్వీకరించాలి.

### 4.8. ముగింపు

మనం పవిత్రతను పొంది జీవించడానికి ప్రతి ఒక్కరం తగ్గింపుతనం కలిగి జీవించాలి. మన జీవితాలలో గొప్ప పనులను చేస్తేనే మనం మంచివారమని దేవుని దృష్టిలో గొప్పవారిగా జీవిస్తామని అనుకుంటాం. అలా అనుకుంటే మనం భ్రమపడినట్లే. మనం చేసే పని ఏదైనా ప్రతి దానిని ప్రేమతో చేసినప్పుడు అది చిన్నదైనా పెద్దదైనా దేవుడు మనలను దీవిస్తాడు. ఈ చిన్నిమార్గము మనకు గొప్ప ఆదర్శం. మన జీవితాలలో నిజంగా ప్రేమతో జీవించినట్లైతే మనం ఈ చిన్నిమార్గమును పాటించినట్లే.

### పరిసమాప్తి

పునీత చిన్న తెరేసమ్మగారు జీవిస్తున్నప్పుడు చేసే మంచి పనులను చూచి మెచ్చుకొని, చప్పట్లు కొడుతూ ప్రశంసల వర్షమును కురిపించే వారు ఎవరూ లేరు. పునీతులు, దేవదూతలే ఆమె ప్రేక్షకులైనారు. తను ముందుగా దేవుని రాజ్యము, ఆయన నీతి కొరకే జీవితాన్ని జీవించి దేవుని కష్టాలు అనుభవించి ఆత్మల రక్షణకు అనునిత్యం ప్రార్థించాలనే గూఢార్థం తెలుసుకొన్న చిన్న పుష్పం. విజ్ఞులకు, వివేకవంతులకు ఎరుక పరచక పసిబిడ్డయైన ఆమెకు బయలుపరచినందుకు ఎంతగానో ఆమె దేవుని స్తుతించింది. (మత్తయి 11:25). క్రీస్తు ప్రభువు "తనను తాను తగ్గించుకొని బాలునివలె రూపొందినవాడే పరలోక రాజ్యమున గొప్పవాడు" (మత్తయి 18:4) అని తెలియజేస్తున్నారు. అందుకే పునీత చిన్న తెరేసమ్మ తనకు తానే దేవుని చిన్నారి బిడ్డగా భావించుకొని అతని ప్రేమలో లీనమయింది. తెరేస తన్ను తాను మర్చిపోయి ఈ లోకమంతటా క్రీస్తు సువార్తా సువాసనలను వెదజల్లాలనే తాపత్రయంలో అనునిత్యం ప్రార్థించేవారు.

పునీత తెరేసగారి ఆధ్యాత్మికతను సంక్షిప్తీకరించడానికి, ఆమె బాలా మార్గం యొక్క సిద్ధాంతాన్ని మూడు ప్రాథమిక ముద్రలుగా కుదించవచ్చు:

1) మన ఆధ్యాత్మిక పేదరికాన్ని, మన అసమర్థతను గుర్తించి, ఈ పరిస్థితిని అంగీకరించాలి.

2) మన సొంత శక్తుల ద్వారా మనం చేయలేని వాటిని దేవుడు మనలో నెరవేర్చడానికి మనం ఆయనను గట్టి విశ్వాసంతో, దృడమైన నమ్మకంతో ఆశ్రయించాలి. ఎందుకంటే దేవుడు మన తండ్రిని ఆయన ప్రేమ అనంతమైనది.

3) మనం ప్రేమను ఆశ్రయించాలి, ప్రేమ యొక్క ప్రాముఖ్యతకు మనల్ని మనం అన్వయించుకోవాలి.

మన జీవితాలలో సంపూర్ణత కలిగి జీవించడానికి, దేవునితో సఖ్యత కలిగి జీవించాడానికి పునీత తెరేసగారి ఈ చిన్ని మార్గాము ఎంతగానో ఉపయోగపడుతుంది. కావున అమె మనకు నేర్పించిన వినయము, తగ్గింపుతనము, దేవునిపై నమ్మకము, ప్రేమను ఆచరించుట, పరిత్యజించు కొనుట, త్యాగం చేయుట, దేవుని చిత్తానికి మనల్ని అర్పించుకొనుట, భాధలను అనుభవించుట, నిరాడంబరత కలిగి జీవించుట, అనే ఈ చిన్ని మార్గములను మన జీవితాలలో పాటించుదాం, దేవుని చెంతకు చేరుదాం.

# ౨. సువార్తా గురు పరిచర్య దృష్టి కోణంలో పునీత జాన్ మరియ వియాన్నిగారి జీవితం

**– బ్రదర్ శీలం విమల రాజు**

**ఉపోద్ఘాతము**



ప్రస్తుత ప్రపంచంలో అన్ని దేశాలు దాదాపు అభివృద్ధిని సాధిస్తు విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక రంగంలో పరుగులు తీస్తు పోటీతత్వాని పెంచుతూ వున్నాయి. ఈ అధునిక కాలంలో అభివృద్ధి, ప్రగతి, మార్పులను ప్రతి ఒక్క పౌరుడు ఆహ్వానిస్తున్నాడు, కాని తన ఆధ్యాత్మిక జీవితం గురించి మర్చిపోతున్నాడు. మానవుడు తన అశాంతికి, దుఃఖానికి, బాధలకు, కష్టాలకు కారణం కనుగొనలేక సతమతమవుతున్నాడు. కొన్నిసార్లు ఈ జీవితం విలువ తెలుసుకోలేక ఆత్మహత్యలు, ఇతరుల ప్రాణాలను తీస్తు జీవిస్తున్నాడు. తనకు కావలసిన భౌతిక సంతోషాన్ని, ఆనందాన్ని వెదుకుతూ పాపపు ఊబిలో పడి కొట్టిమిట్టాడుతున్నాడు.

యేసు ప్రభువు చెప్పినట్లు: “నేనే మార్గమును, సత్యమును, జీవమును. నా మూలమున తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాలేడు” (యోహాను 14:6). కావున ప్రతి ఒక్కరు ప్రభు క్రీస్తు చూపిన ఆధ్యాత్మిక మార్గంలో జీవించడానికి కృషి చేయాలి. ప్రభువు చిత్తాన్ని నెరవేర్చడానికి, ఆయన అప్పగించిన జీవన బాధ్యతలను సమర్ధవంతంగా, సంపూర్ణంగా నెరవెర్చడానికి ప్రయత్నిస్తు ఉండాలి. ప్రతి క్రైస్తవుడు ప్రభువు బాటలో నడుస్తు విశ్వాసంలోను, ప్రేమలోను దృఢంగా స్థిరపడాలి. ప్రభువు కోసం తన కోరికలను, సమస్తాన్ని త్యజించడానికి సిద్ధంగా

ఉండాలి. క్రీస్తు ప్రభువు కోసం ముందు ఉండి నడుస్తు, పదిమందిని సన్మార్గంలో నడిపించాలి. తోటి సోదరులతో ప్రేమగా మాట్లాడుతు, మనలోఉన్న ద్వేషం, స్వార్థం, దోపిడి చేసే ఆలోచనలను తీసివేసి, ఐక్యత కలిగి జీవిస్తు, క్రీస్తుకు సాక్షులుగా మారాలి. ఈ లోకం క్రీస్తు రాజ్యాన్ని స్థాపించాలి. క్రీస్తు ప్రభువును విశ్వసించి, ఆయన అడుగు జాడల్లో నడిచి చిత్త శుద్ధితో సత్య సువార్తను పాటించి, బోధించిన పునీతులలో పునీత జాన్ మరియ వియాన్నివారు ఒకరు.

వియాన్ని, తను జీవించిన జీవన పరిస్థితులలో ముఖ్యంగా ఫ్రెంచి విప్లవం చెలరేగిన కాలంలో శ్రీసభ, ప్రభుత్వ అరాచకాలకు బలైన కాలంలో, వీరోచితంగా తన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజల విశ్వాసాన్ని బలపరుస్తూ, సేవాతత్పరత కలిగి, మూడు వ్రతాలను చక్కగా పాటించి ఒక ఉత్తమ గురువుగా శ్రీసభకు ఎనలేని సేవలు చేసి, దైవ ప్రజల ఎదుగుదల, పురోగతికి తన్ను తాను తరింప చేసుకున్న త్యాగశీలి, ఆదర్శ గురువు అయిన వియాన్నిగారు నేటి శ్రీసభలోని గురువులకు, మఠవాసులకు, శ్రీసభలోని యావన్మందికి ఓ గొప్ప మార్గదర్శి.

క్రీస్తును అనుసరించాలనుకున్న ప్రతి ఒక్కరికీ, మార్గదర్శంగా ఈ మూడవ సంవత్సర దైవశాస్త్ర పరిపూర్తి చేయడం కోసం ఈ ప్రతము ఎన్నుకొన్నాను. నేను నా పాఠ్యాంశమును మూడు అధ్యాయాలుగ విభజించాను. మొదటి అధ్యాయంలో వియాన్ని జననం, విద్యాభ్యాసం, దేవుని పిలుపు, గురుపట్టాభిషేకం, పునీత పట్టం గురించి వివరించాను. రెండవ అధ్యాయంలో వియాన్ని ఆర్స్ గ్రామాన్ని ఏ విధంగా తన ప్రార్ధన, ఉపవాసం, తపో జీవితం ద్వారా శోధనలను ఎదుర్కొని ప్రజలను ఏ విధంగా దేవునికి దగ్గర చేసాడో వివరించాను. మూడవ అధ్యాయంలో వియాన్ని ఆర్స్ గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి పరిచాదో, ప్రజలకు ఏ విధంగా సేవ చేసాడో వివరించాను. చివరిగా నాలుగవ అధ్యాయంలో ఆయన ఆధ్యాత్మిక జీవితం ద్వారా మనం నేర్చుకోవలసిన అంశాలను, క్రీస్తులో మనం ఎదగడానికి కావలసిన సుగుణాలను, మరియు శ్రీసభలో తన జీవితం ద్వారా అందించిన సేవలను పేర్కొన్నాను.

# 1. జాన్ మరియ వియాన్నివారి జీవిత చరిత్ర

## 1.0. ఉపోద్ఘాతము

దేవుడు తన పోలికలో ఎంతో ప్రీతి పాత్రంగా సృష్టించుకున్న మానవుని జీవితం ఎంత గొప్పగా ఉంటుందో ఊహలకందనిది. దేవుని ప్రణాళికలో మనమంతా భాగస్తులమే. అయితే దేవుని పిలుపును విని, తమ జీవితాలను ధన్యం చేసుకున్నవారు కొద్దిమంది మాత్రమే. అటువంటి వారిలో బహుకొద్ది మంది తాము నమ్ముకున్న దేవుని కోసం జీవితాంతం కట్టుబడి జీవించి, ఆఖరికి తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి, గురువుగా, మతసాక్షిగా, గురువులందరికి పాలక పునీతుడుగా, ఆదర్శ మూర్తులుగా నిలిచారు. సాధారణ జీవితం నుండి శ్రేష్టమైన పవిత్రతను అధిరోహించిన పుణ్యపురుషుడు పునీత జాన్ మరియ వియాన్ని గారు. వీరు. ఫ్రాన్సు దేశంలోని నైరుతి ప్రాంతమైన లయన్సు నగరానికి ఆరుమైళ్ల దూరంలో ఉన్న డార్డిల్లో అనే గ్రామంలో జాన్ మరియ బాప్టిస్ట్ వియాన్ని జన్మించారు. ప్రభువు పిలుపును స్వీకరించి, ప్రభువుకు సంపూర్ణ విధేయుడుగా జీవించారు. ఇప్పుడు ఆయన జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను చూద్దాం.

## 1.1. జననము

క్రైస్తవ కుటుంబం వృద్ధి చెందాలంటే భార్యాభర్తలు కలిసి జీవించాలి. మన ఇల్లు ఓ దేవాలయంగా మారాలి. ఇంటిలో బైబులు పఠనం, ప్రార్థన జరగాలి. క్రీస్తు సాన్నిధ్యం నెలకొని ఉండాలి, పరస్పర సహాయం, ఓర్పు, ప్రేమ మొదలైన సుగుణాలు కన్పించాలి. తల్లిదండ్రులు పిల్లలకు లౌకిక విద్యతో పాటు మతపర జ్ఞానంకూడా నేర్పించాలి. వారిని దైవమార్గాల్లో నడిపించాలి. పిల్లలకు దైవ పిలుపు అందేలా చూడాలి. అదే వియాన్నిగారి జీవితంలో జరిగింది. సామాన్యంగ జన్మించి, అసామన్యంగ ఎదిగి, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చి, చరిత్రలో చిరస్మరణీయంగ నిలిచిపోయిన మహానుభావులు పునీత జాన్ మరియ వియాన్నిగారు. వీరు 1786 వ సంవత్సరం మే మాసంలో

8వ తారీఖున పుణ్యదంపతులైన, శ్రీ మత్తయి వియాన్ని, శ్రీమతి మరియ బెలునెగార్లకు జన్మించారు. వారిది పేదకుటుంబం, పెద్దకుటుంబం, ఆరుమందితో ఆనందంగా జీవిస్తున్న వియాన్నిగారు, కుటుంబంలో మూడవవారు. వారి తల్లియైన మరియ బెలునె వారందరిని తన గర్భంలో ఉండగానే మరియ తల్లికి సమర్పించింది. వారినందరిని విశ్వపథంలో ఎదిగి ప్రభు పాద సేవలో పవిత్ర పుత్రులుగా, సాక్ష్యమిచ్చేలా తయారుచేయమని ఆనాడే మరియతల్లికి మనవి చేసింది. మొదటి అమ్మాయి కత్తెరీన, వివాహమైన కొద్దికాలానికే ఆమె మరణించింది. అప్పుడు వియాన్ని గారు ఐదు సంవత్సరాల వయస్సులో ఉన్నాడు. ప్రాన్సీస్ తన తండ్రి వారసత్వాన్ని పొంది గృహ సంరక్షకునిగా వ్యవహరించేవాడు.!

## 1.2. కుటుంబము

కుటుంబ జీవితం ఒక సుందరమైన వనం. ఈ సుందరమైన వనం పైనే మన ప్రపంచం, శ్రీసభ భవిష్యత్తు ఆధారపడి ఉంది. మానవుడు దేవునితో దగ్గర సంబంధం పెట్టుకొని భక్తిగా జీవించాలి. మనం దేవునికి ప్రీతి కలిగించే పనులే చేయాలి, అప్పుడు మన జీవితం సురక్షితంగా ఉంటుంది. మన కుటుంబంలో శాంతి, సంతోషం, ప్రశాంతత నెలకొంటాయి. ఇటువంటి జీవితమునే వియాన్ని కుటుంబం జీవించింది. డార్టిల్లీ అనేది ఒక అనామక గ్రామం. ఆ కాలంలో గ్రామ జనాభా చాలా తక్కువగ ఉండేది. ఆ గ్రామం లియోన్స్ నగరానికి ఆగ్నేయ దిశలో అయిదు మైళ్ల దూరంలో ఉంది. డార్టిల్లీ గ్రామం చుట్టు చాలా పొలాలు ఉన్నాయి. మత్తయి వియాన్ని పొలంలో పనిచేస్తూ తన గొర్రెల్ని, ఆవుల్ని మేపుకొంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆ గ్రామంలో త్రికాలగంటలు ప్రతిరోజు మ్రోగేవి. ప్రజలు పేదవారు అయిన్నటికి వారు శాంతియుంతగా ఇతరులతో జీవించేవారు. వియాన్నిగారు చిన్న నాటి నుండే భక్తియందు, విశ్వాసమందు, దేవుని ప్రేమ యందు జీవించారు. ఆయన ఎక్కువగా ప్రార్థనకు, దివ్యబలిపూజకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా విశ్వాసం కొల్పోకుండ, దేవుని చిత్త ప్రకారం జీవించేవారు. కావున

కుటుంబ జీవితంలో వచ్చే సమస్యలు సర్వసాధారణం. మరి అటువంటి సమస్యలను చిరునవ్వులతో ఎదుర్కొంటూ, ప్రేమతో జీవిస్తూ, ప్రార్థన చేస్తుండాలి. ప్రతి క్రైస్తవ కుటుంబం కతోలిక సిద్ధాంతాలను పాటిస్తూ, ప్రభుని ఆరాధించాలి.

### 1.2.1. బాల్యము

మనిషి పుట్టుక ఈ సృష్టిలో మహోన్నతమైనది. జీవితం భగవంతుని కానుక. మనిషిగా పుట్టడం దేవుని ఆశీర్వాదం. మానవుడు ఒంటిరిగ ఉండలేడు. అతడు ప్రధానంగా సంఘజీవి. తోటి నరులతో కలిసి జీవించాలి. ఈ లోక జీవితాన్ని సంతోషంగా గడపాలని, దైవ మహిమ కొరకు ఇతరుల శ్రేయస్సు కొరకు వినియోగించాలని వియాన్ని చిన్నతనంలోనే, దేవునికి ప్రార్థన చేసాడు. వియాన్ని బాల్యంలో ప్రతిరోజు దివ్యబలిపూజకి వెళ్ళేవాడు. వియాన్ని దేవునికి భయపడుతు, మరియతల్లి మీద ఎంతో భక్తి, ప్రేమ చూపుతు దేవుని బిడ్డగా పెరిగారు. కాని డార్టిలీ గ్రామంలో శాంతి, సమాధానాలు వెల్లివిరుస్తున్న సమయంలోనే, ఫ్రెంచి విప్లవం ప్యారిస్ నగరాన్ని కుదిపేసింది. క్రూరమైన పాలనకు సంకేతమైన బాస్టిల్లి నగరం 1789లో పతనమైంది. 1793లో అతినీచమైన భయానక రాజ్యపాలన ఆరంభమైంది. కాని ప్యారిస్ విప్లవం ఆగిపోలేదు. ఫ్రాన్స్ లో ప్రతిచోట ఆ విప్లవతరంగాలు ప్రతిధ్వనించటం, ప్రజల విశ్వాస అభివృద్ధికి అడ్డుగోడలు అమర్చినట్లయింది. ఎంతోమంది విశ్వాసులు తమ ప్రాణాలను కొల్పోయారు. దేవాలయ గంటలు మూగవోయాయి. దారి ప్రక్కన ఉన్న పుణ్యక్షేత్రాలు శిథిలాలుగ మారిపోయాయి. వియాన్ని విశ్వాసం కొల్పోకుండా దేవుని బాటలో నడిచేవారు. ఎన్ని ఆటంకాలు, కష్టాలు వచ్చిన మనం విశ్వాసాన్ని వదిలిపెట్టకూడదు. మనం జీవితంలో ముందుకు సాగుతు, దేవుడు ఇచ్చిన జీవితాన్ని కొనసాగించాలి.

### 1.2.2. విధ్యాభ్యాసము

ప్రతి ఒక్కరి జీవితములో విద్య అనేది ఎంతో గొప్ప స్థానమును కలిగి

ఉంటుంది. విద్యను అభ్యసించుట వలన ప్రతి ఒక్క వ్యక్తికి మంచి, చెడు అను దాని మీద ఒక పట్టు ఉంటుంది. చదువుకోవటం వలన కొందరు విద్యావంతులుగా తయారువుతారు. జాన్ మరియ వియాన్ని చిన్నతనంలో చదువుకోవాలి అన్న కోరిక నేరవేరలేదు. అతని స్వగ్రామమైన డార్టిల్లీలోని పాఠశాల మూతపడటం వలన, అతనికి చదువుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ లోటును కొంతవరకు పూడుస్తూ ఆయన పెద్ద అక్క కత్తెరీన వియాన్నికి వ్రాయడం, చదవడం నేర్పించింది. జపపుస్తకంలోని అక్షరాలను, పదాలను ఉచ్చరించడం నేర్పింది. అదృష్టవశాత్తు 1795లో డార్టిల్లీ గ్రామంలో ఒక పాఠశాలను ప్రారంభించారు. వియాన్నికి ఆ పాఠశాలకు వెళ్లి చదువుకొనుటకు అవకాశం, అనుమతి రెండూ దొరికాయి. కనీసం వసంత ఋతువులోని నాటులకాలం వరకు చదువుకునే భాగ్యం దొరికింది. చరిత్ర, భూగోళశాస్త్రాల్లో బాగా రాణించారు వియాన్నిగారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు 'మీరంతా వియాన్నివలె ఉంటే ఎంతో బాగుండేది, అని ఇతర విద్యార్థులతో అనేవారు. ప్రతి ఒక్కరూ వియాన్నిగారిని ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదువు నేర్చుకోవాలి. మన జీవితం ఇతరలకు ప్రేరణ కలిగించాలి. తల్లిదండ్రులు పిల్లలకు చదువు నేర్పించాలి. వారిని విశ్వాసమందు, భక్తియందు నడిపిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా నిలబడాలి.

### 1.2.3. ప్రథమ పాపసంకీర్తనము, దివ్యసత్రసాదము

నరుడు దుర్బల ప్రాణి, మట్టి మనిషి. సులువుగా పాపంలో పడిపోతుంటాడు. ఈ పాపాలకు పశ్చాత్తాపపడాలి. దేహానికి మురికైతే స్నానంతో శుద్ధిని పొందుతాం అదేవిధంగా ఆత్మ పాపం వలన మలినమైతే పశ్చాత్తాపంతో శుద్ధిని పొందాలి. తప్పిపోయిన కుమారుడు పశ్చాత్తాపం చెంది తండ్రి వద్దకు తిరిగివచ్చాడు. అదేవిధంగా వియాన్ని తమ మొదటి పాపసంకీర్తన చేసిన దేవునికి దగ్గర చేసిన సంఘటన ఇది. ఫ్రెంచి విప్లవకారుల దృష్టిలో వంటవానిగా జీవిస్తున్న గ్రీబోజ్ స్వామి 1797వ సంవత్సరంలో వియాన్నిల గృహంవద్దకు వచ్చి జాన్ మరియ వియాన్నిని చూసి, 'నీ వయసెంత వియాన్ని" అని

ప్రశ్నించారు... 'పదకొండు స్వామి, అని వియాన్ని సమాధానమిచ్చాడు. 'ఎంతకాలం క్రితం నువ్వు పాపోచ్చారణం చేసి సఖ్యతాసంస్కారం స్వీకరించావు?, అని ఆ గురువు మరల ప్రశ్నిస్తే, 'స్వామి, నేనింకా పాపసంకీర్తనమే చెయ్యలేదు, అని పలికాడు వియాన్ని 'అయితే వెంటనే నీవు నీ మొట్టమొదటి పాపసంకీర్తనాన్ని ఇక్కడే, ఇప్పుడే చెయ్యి" అని ఎలాంటి సంశయం లేకుండా గ్రీబోజ్ స్వామి అన్నారు. వెంటనే తన ఇంటిలోనే భక్తితో మోకరించి పాపనివేదన ద్వారా తన ఆత్మాంతరంగాన్ని ఆ గురువుకి బహిర్గతం చేశాడు. పాపం అంటే ఏమిటో అతనికి చాల తక్కువగా తెలుసు. ఎందుకంటే 'నేను పాపోచ్చారణ సంస్కారంలోనే పాపం అంటే ఏమిటో తెలుసుకున్నాను," అని తర్వాత కాలంలో అనేవారు. వియాన్ని ప్రథమ దివ్యసత్రసాద స్వీకరణకు పదమూడేళ్ల వయస్సు అంటే 1798 వరకు వేచి ఉండవలసివచ్చింది. వియాన్ని ఎనలేని ఆసక్తిని వ్యక్తపరుస్తూ ఆయా తరగతులకు హాజరు కావటం, తోటి విద్యార్థులవలే తాను నేర్చుకుని, ఆ ప్రత్యేకదినమునకై ఎంతో ఎదురు చూశారు. ఆ దివ్యసత్రసాద స్వీకరణ ఉత్సవం విప్లవకారుల కంటబడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయాన్నే మొదటిసారి దివ్యసత్రసాదాన్ని స్వీకరించే పిల్లలంతా పాతబట్టలు ధరించి ఒకరి తర్వాత ఒకరు పెద్దగదిలోకి వచ్చారు. అప్పుడు దివ్యబలిపూజ సమర్పణకు ఒక గురువు రహస్యంగా సిద్ధమై ఉన్నారు. మరియ వియాన్ని మొదటి దివ్యసత్ర. సాదాన్ని నిరాడంబరంగా జరిపిన ఒక పూజలో కొద్దిమంది సమక్షంలో స్వీకరించాడు. దానిని తిలకించిన అతి కొద్దిమందిలో అతని అక్క మార్గరెట్ కూడా ఉంది. కొన్నేళ్ల అనంతరం ఆమె మాట్లాడుతూ, 'ఆ రోజు నేను అక్కడ ఉన్నాను. దివ్యసత్రసాద స్వీకరణానంతరం వియాన్నిలో కనిపించిన ఆనందం వర్ణనాతీతం. ఎంత సంతోషంగా ఉన్నాడంటే అతను ఆ గదిని విడిచిపెట్టి బయటకు వెళ్లలేకపోయాడు. దివ్యసత్రసాద స్వీకరణకు గుర్తుగా ఆ రోజు మరియ వియాన్నికి ఒక జపమాలను బహూకరించారు. కావున ప్రతి ఒక్కరు వియాన్ని స్వామి ఆదర్శంగా తీసుకుని పాపసంకీర్తనం, దివ్యసత్రసాదం యెడల ప్రేమ కలిగి జీవించాలి. మనం ఆత్మలో ఎదుగుతూ

దేవునికి సమర్పించుకోవాలి. మనం దేవునితో మంచి సంబంధం కలిగి జీవించాలి. మనం పాపంలో పడకుండా ఆత్మచేత నడిపించబడాలి."

## 1.3. జాన్ మరియ వియాన్ని సైన్యంలో సేవచేయుట

వియాన్ని దేవుని తెలుసుకొని, సేవిస్తూ, ప్రేమిస్తూ ఉన్నాడు. అతని హృదయం దేవుని కోసం తపిస్తుంది. వియాన్ని ప్రాపించక సుఖాలకు లోంగకుండా పవిత్రంగా జీవిస్తున్నారు. ఇటువంటి తరుణంలో వియాన్నికి మరో చేదు అనుభవం ఎదురైంది. 1809వ సంవత్సరపు శీతాకాలంలో మరియ వియాన్ని నెపోలియన్ సైన్యంలో చాలా ఎక్కువమంది చనిపోయిన కారణంగా ఆ సంవత్సరంలో ప్రతిపురుషుడు సైన్యంలో చేరాలనే ఆజ్ఞను ఓ పోలీసు అధికారి డార్టిల్లీకి వచ్చి అందజేశాడు. వియాన్నిని సైన్యంలో చేరకుండా ఉంచాలని అభ్యర్థిస్తూ బాల్లేస్వామి లియోన్స్‌లోని పీఠాధిపతుల కార్యాలయానికి లేఖ వ్రాశారు. కాని ఆ ప్రత్యేక విజ్ఞాపన పీఠాధిపతుల కార్యాలయానికి చేరడంలో చాల ఆలస్యమగుట వలన వియాన్ని లియోన్స్‌లోని సైన్యంలో చేరక తప్పలేదు. 1809వ సంవత్సరం అక్టోబరు 26వ తేదీన వియాన్నికి సైనిక శిక్షణ ప్రారంభమైంది. అక్కడ తాను చూసిన సంఘటనలు, విన్న విషయాలు మానసిక వ్యధకు గురిచేశాయి. శిక్షణా సమయంలో అష్టకష్టాలు ఎదురొచ్చినా అధికారులపట్ల విధేయతతో మెలిగాడు. కాని కేవలం రెండు రోజుల శిక్షణ తర్వాత చాల బలహీనుడైపోయాడు. దీనికి అతను జీవించిన తపోజీవితం కూడా ఒక కారణం. అతన్ని పరీక్షించిన సైనిక వైద్యుడు వియాన్నిని వెంటనే ఆసుపత్రిలో చేరమని ఆదేశించాడు. వియాన్ని ఇంకా కోలుకొంటున్న సమయంలోనే అనగా నవంబర్ 12న లియోన్స్ నుండి రోవెన్నెకి వెళ్తున్న సైన్యంతో కలిసి వెళ్లాలని అధికారులు నిశ్చయించారు. కొంత దూరం వాహనంలో ప్రయాణించాడు. కాని చలిని తట్టుకోవటానికి కావలసిన బట్టలులేక జలుబుచేసి నీరసించిన వియాన్నిని మరల రోవెన్నెలోని ఆసుపత్రిలో చేర్చారు. కొన్నిరోజుల తరువాత వియాన్ని సైనికుల నుండి తప్పించుకుని ఇంటికి వెళ్ళిపోయాడు, తల్లిదండ్రుల దగ్గర ఆనందంగా జీవిస్తున్నారు. మనం కూడా

వియాన్నిగారి వలె కష్ట సమయములో విశ్వాసం, ధైర్యం కొల్పోకుండ దేవుని చిత్త ప్రకారం జీవించటానికి ప్రయత్నించాలి.

### 1.3.1. తల్లి మరిణించుట

ప్రతి ఒక్కరి జీవితములో తల్లి ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తుంది. తన గర్భంలో ఎదుగుతున్నప్పుడే నా బిడ్డ ఎలా ఉండాలో ఊహించుకున్నది ఆ తల్లి, వియాన్ని జీవితము యందు ఎంతో శ్రద్ధను కనబరిచింది ఆ తల్లి. వియాన్ని తన తల్లి వద్ద ఆనందంగా గడుపుతూ ఉన్నాడు. వియాన్నికి తల్లి అంటే ఎంతో ప్రేమ, గౌరవం. కాని ఆ తల్లి ఆర్యోగం బాగలేదు, అందుకే ఆమె చనిపోయింది. ఆమె తన నిత్యజీవన బహుమానం కొరకు దేవుని చెంత చేరుటకు ఆమెకు సాయం చేశాడు. తర్వాత జీవితంలో తన తల్లిని గూర్చి మాటల్లో చెప్పలేక కన్నీళ్ల భాషలో మాట్లాడేవాడు. ఆమెని కోల్పోయినప్పుడు, కాలవాహినిలోని ఈ ప్రపంచ వస్తువుల పట్లగల ఆశనంతా కోల్పోయాడు. 'పాపాత్మునిగా జీవించి తల్లి ప్రార్థనచే గొప్ప పునీతుడైన అగుస్తీనువలె వియాన్ని అత్యంత ప్రశస్తమైన తన తల్లిని జీవితమంతా బలిపీఠంచెంత గుర్తుచేసుకున్నారు'. వియాన్ని తల్లి మరణానంతరం, బార్లీ స్వామి వియాన్నిని తనవద్ద ఉండమని ఆహ్వానించారు. బాల్లేస్వామి గృహంలో వియాన్ని విద్యార్థిగా, తోటమాలిగా, ఉపదేశిగా, గృహ నిర్వాహకుడిగా, వత్తాసు బాలుడిగా జీవించాడు.

### 1.4. జాన్ మరియ వియాన్ని దేవుని పిలుపును పొందుట

దైవ పిలుపు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా లభిస్తుంది. పిలుపు పొందిన విధానములో రకాలుంటాయి. సృష్టిలోని ప్రతి జీవి పుట్టుకకు పరమార్థం ఉంది. గడచిపోయిన కాలంలో 'గురుత్వపు పిలుపు' అను విషయం వియాన్నిని ఆకర్షించింది. రాత్రిపూట మెలకువగా వుండి క్రొవ్వొత్తి వెలిగించి 'సువార్తను' లేక క్రీస్తు అనుకరణ'ను చదివేవాడు. గురువిద్యార్థిగా చేరడానికి అతని ఆత్మ పరిపక్వమైంది. కాని పదిహేడుసంవత్సరాలు నిండినా కూడా ప్రాథమిక విద్యను

పూర్తిచేసే భ్యాగం పొందలేదు. లతీనుభాష అసలే తెలియదు. 'నేను గనుక గురువునైతే ఎన్నో ఆత్మలను దేవుని చెంతకు చేరుస్తాను," అని వియాన్ని తన తల్లితో ఎంతో నమ్మకంగా చెప్పేవాడు. గురువిద్యాలయంలో చేరి తర్ఫీదు పొందాలనుకున్న వియాన్నిగారికి తన తండ్రి అనుమతి లభించలేదు. దైవ చిత్తం నెరవేర్చాలని వియాన్ని ఆశించాడు, నెరవేర్చాడు కూడా. డార్టిల్లీ ప్రక్కనున్న ఎకుల్లీలో బాల్లేస్వామి తన గృహంలో ఒక చిన్న గురువిద్యాలయాన్ని ప్రారంభించారు. ఎకుల్లీ కూడా వారి పోలానికి దూరమేమి కాదు. మరోసారి వియాన్ని ఎకుల్లీలోగల తన అత్త ఇంట్లో ఉంటూ తక్కువ ఖర్చుతో గురు విద్యను అభ్యసించవచ్చాడు. 'వియాన్ని మనస్ఫూర్తిగా గురువు కావాలను కుంటున్నాడు కాబట్టి మనం ఎంత కాలం వాడి ఇష్టాన్ని కాదంటాం,' అంటూ తండ్రి కూడా అడ్డు చెప్పక బాల్లేస్వామి వద్దకు శిక్షణ పొందటకు అనుమతి ఇచ్చాడు. వియాన్ని గురువిద్యాలయాలంలో చేరాడు. కానీ వియాన్నితో ఉన్న మిగతా ఇద్దరు విద్యార్థులు వియాన్నిని హేళన చేస్తూ వెకిలిగా నవ్వేవారు. వారు సులభంగా నేర్చుకున్న విషయాలు కూడా వియాన్నికి కష్టమనిపించేవి. దీర్ఘంగా ఆలోచిస్తూ ఒకరోజు వియాన్ని బాల్లేస్వామి వద్దకు వచ్చి, 'నేను ఇంటికి వెళ్లిపోతాను,' అని చెప్పాడు. వియాన్ని దేవునికి ప్రార్థన చేసి చదువుకోవటానికి కావలసిన జ్ఞాన వరాలను అనుగ్రహించమని దేవున్ని వేడుకొన్నాడు. వియాన్ని భవిష్యత్తులో ఎదురయ్యే కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొనుటకు వియాన్నికి 1807వ సంవత్సరంలో అగ్రపీఠాధిపతియైన కార్డినల్ ఫెశ్ ధ్రువీకరణ సంస్కారాన్ని (భద్రమైన అభ్యంగం) ఇచ్చారు.

ఈ కార్డినల్‌గారు నెపోలియన్ చక్రవర్తి మామ. ధ్రువీకరణ అభ్యంగ సమయాన బప్తిస్మ యోహానును వియాన్ని తన సంరక్షకునిగా ఎన్నుకొన్నాడు. మనము కూడా దేవుని చేత పిలువబడ్డాము. కావున మన పిలుపులో వచ్చే బాధలను, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. మనం వియాన్నిని ఆదర్శంగా తీసుకుని, దేవునికి ప్రార్థన చేస్తూ భవిష్యత్తులో ముందుకుసాగాలి.

### 14.1. తత్వశాస్త్రము

ప్రాచీన కాలంలో భక్తులు ఆధ్యాత్మిక గ్రంథపఠనానికి ఎక్కువ సమయం కేటాయించేవారు. ఆధ్యాత్మిక గ్రంథాలను వినయ విశ్వాసాలతో చదవాలి. వాటి ద్వారా దేవుడు మనతో మాట్లాడుతాడు. మనం నడవవలసిన మార్గాన్ని చూపిస్తాడు. అవి మనకు మంచి ప్రేరణ పుట్టిస్తాయి. అందుకే వియాన్నిని 1812వ సంవత్సరంలో తత్వశాస్త్రాన్ని చదవడానికి వెర్రియిారెస్తోని చిన్న గురు విద్యాలయానికి పంపారు. అచ్చట తన తోటి విద్యార్థుల కంటే తానే తరగతిలో పెద్దవాడని వియాన్ని గ్రహించాడు. వయసులో తనతో దాదాపు సమంగా ఉన్న ఏడుగురికి ఫ్రెంచిభాషలో తత్వశాస్త్రం నేర్పించారు. గురు విద్యార్థిగా చిన్న సెమినరీలో ఉన్నప్పుడు పునీత లూయిస్ ది మౌంట్ ఫోర్ట్ వలె వియాన్నీ కూడా తనను తాను దేవమాతయైన మరియమ్మగారి సేవకునిగా అంకితం చేసుకున్నాడు. 1814వ సంవత్సరం, పాస్క పండుగ సమయంలో దైవశాస్త్ర చదువులు పూర్తిచేయుటకు వియాన్ని మరల తన పూర్వ స్నేహితుడైన పూజ్య బాల్లేస్వామి వద్దకు చేరుకున్నాడు. వియాన్నిస్వామి మనం ఆదర్శంగా తీసుకుని దేవుని సహాయంతో, మరియ తల్లి ప్రార్థన సహాయంతో చదువులో ముందుకు సాగుతు, మన జీవిత కోరికలను కష్టపడి నెరవేర్చుకోవాలి. మనం దేవుని సందేశాలను శ్రద్ధగా అర్థం చేసుకుని, పవిత్రంగా జీవించాలి.

### 1.4.2. ఉపగురువు పట్టము

వియాన్ని ఉపగురువుగా అభిషేకం పొందే ముందు ఆయనకు చిన్న పరీక్ష జరిగింది. పూజ్యులైన కుర్బానుస్వామి నిరాడంబరమైన మంచిగురువు. నిష్కపటమైన సమాధానంకోసం వికార్ జనరల్‌గారు వియాన్నిని ఇలా ప్రశ్నించారు. (ప్ర) "ఈ యువకుడైన వియాన్ని భక్తిపరుడేనా?" (జ) "అవును, చాల భక్తిమంతుడు. (ప్ర) "దేవమాతపట్ల ఇతనికి భక్తి ప్రపత్తులున్నాయా?" (జ) "ఉన్నాయి". (ప్ర) "జపమాలచెప్పటం తెలుసా?" (జ) "తెలుసు". (ప్ర) "దైవభక్తి విషయంలో ఇతడు ఆదర్శప్రాయుడేనా?" (జ) "అనుమానం

లేకుండా, ఇతడు భక్తికి నమూనాలాంటివాడు. భక్తికి ఆదర్శం ఇతడు," అని బాల్లేస్వామి మరోసారి నొక్కిచెప్పారు. అలా అయితే "నేను గురుపట్టాభిషేకానికి రమ్మని పిలుపునందిస్తున్నాను. తక్కిన విషయాలన్ని దైవకృప చూసుకుంటుంది" అని వికార్ జనరల్‌గారు అన్నారు. 1814 మే31న మరియమాత ఎలిజబేతమ్మను సందర్శించిన పండుగనాడు లియోన్స్ లో పునీత యోహాను పెద్ద దేవాలయంలో మరియ వియాన్ని కొన్ని చిన్నదీక్షలను (Minor Orders), గ్రీనోబుల్ పీఠాధిపతి చేతుల మీదుగా పొందాడు. ఈ సాంగ్యాల నిమిత్తమే వారు గ్రీనోబుల్ నుండి తరలివచ్చారు. తన గురువిద్యార్థియైన వియాన్ని బాధ్యతనంతా బాల్లేస్వామి తనమీద వేసుకొన్నారు. ఫ్రెంచి రాజకీయ వాతావరణం మేజర్ సెమినరీలో ప్రవేశించింది. తత్ఫలితంగా అల్లకల్లోలం, చివరికి హింసకూడా గురువిద్యార్థుల మధ్య చోటుచేసికొన్నాయి. వియాన్ని ఈ చెడునుంచి దైవికంగా తప్పించబడ్డాడు. 1815వ సంవత్సరం మే నెలలో గురువిద్యాలయానికి వచ్చి తననుతాను సిద్ధపరచుకున్న పిదప వియాన్ని, జూన్ నెల 23న సిమోను పీఠాధిపతిచే ఉపగురువుగా (Deacon) అభిషేకం పొందాడు.

వియాన్నిగారు ఒక ఉపగురువుగా సక్రమమైన మార్గంలో నడుస్తూ ఇతరలకు సుమాతృకగ నిలిచారు. మనం కూడా వియాన్నిగారివలె, ప్రభువు బాటలో నడుస్తు పదుగురిని సక్రమమైన మార్గంలో నడిపించాలి. మనలో అహంభావాన్ని, గర్వాన్ని చూపించక, మనం క్రీస్తు ప్రతి నిధులుగ సేవక రూపం కలిగి జీవించాలి. మనం సంఘంలో జీవిస్తు ఇతరులతో ప్రేమ బంధాన్ని ఏర్పాటుచేసుకోవాలి.

## 1.5. జాన్ మరియ వియాన్ని గురుపట్టాభిషేకము

పవిత్ర గురుత్వం వియాన్ని కళ్లెదుట కనబడుతూవుంది. తన ప్రయాణ గమ్యం చాలా దగ్గరౌతోంది. కాని గురువుగా అభిషిక్తుడయ్యే ముందు శ్రీసభ చట్టసంబంధమైన చివరి పరీక్ష ఒకటుంది. ఒక గంటసేపు సాగిందా పరీక్ష,

ఈసారి ఫలితం చాలా సంతృప్తికరంగా ఉంది. అందువలన వియాన్ని గురు పట్టాభిషేకం పొందు శుభదినం 1815 ఆగష్టు 12 అని పెద్దలు నిర్ణయించారు. అతని యోగ్యతా పత్రాల మీద సంతకం చేసేటప్పుడు వికార్ జనరల్‌గారు ఇలా వ్యాఖ్యానించారు. 'శ్రీసభకు అవసరమైంది పాండిత్య గురువులే కాదు. అన్నిటికంటే ఎక్కువగా ఆమె ఆశించేది పవిత్ర గురువులు". లియోన్స్‌కు అరవై మైళ్ల దూరంలో ఉన్న గ్రీనోబులోని వియాన్ని గురుపట్టాభిషేకం పొందాలి. కాబట్టి వియాన్ని ఒక చిన్న సంచిని, మొదటి పూజనర్పించుటకు 'ఆల్బ్' అను పూజావస్త్రాన్ని తీసుకొని ఒంటరిగా ప్రయాణమయ్యాడు. పెంతెకోస్తు పండుగ తరువాత వచ్చు పదమూడవ ఆదివారానికి ముందు రోజు అనగా శనివారం రాత్రికి గ్రీనోబుల్‌కి చేరుకున్న వియాన్ని, ఆదివారం ఉదయం పీఠాధిపతిని కలిశాడు, గురుపట్టం పొందే అభ్యర్థి ఒక్క వియాన్నియే. ఆ పీఠాధిపతి ఇలా అన్నారు. 'ఒక మంచివ్యక్తిని గురువుగా అభిషేకించుట ఇబ్బంది కానేకాదు". ఇరవైతొమ్మిది సంవత్సరాల వయస్సులో గ్రీనోబులోని మేజర్ సెమినరీ దేవాలయంలో బ్రదర్ జాన్ మరియ వియాన్ని గురుత్వ పట్టాభిషేకం పొంది ఫాదర్ వియాన్నిగా మారిపోయారు. అప్పట్నుంచి గురుత్వం పరువునీ, ఔన్నత్యాన్ని, విలువను వియాన్ని స్వామి జీవితాంతం వరకు కలలో కూడా మరువలేదు. తరువాత కాలంలో గురువును గూర్చి ఇలా అనేవారు వియాన్ని స్వామి. 'గురువెంత మహోన్నతుడు! గురువంటే ఏమిటో పరలోకంలో మాత్రమే నిండుగా అర్థమౌతుంది. ఒకవేళ ఈ భూమ్మీద అర్థమైతే ప్రజలు చనిపోతారు. అది కూడా భయంతోగాక ప్రేమతో చనిపోతారు. ఆ మరుసటి రోజున అదే దేవాలయంలో తన ఏకాంత పూజాబలిని అర్పించారు వియాన్ని స్వామి. ఈనాటి గురువులు అపోస్తులుల వలె క్రీస్తుతో స్నేహభావము ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి గురువు కూడా తనను తాను పూర్తిగా క్రీస్తుకు అంకితం చేసుకోవాలి. గురువు క్రీస్తుతో స్నేహ బంధం కలిగి ఉన్నప్పుడు క్రీస్తు పరలోక రహస్యములన్ని తెలియపరుస్తారు. కావున ప్రతి గురువు ప్రార్థనాపరుడుగా, సువార్త సేవకుడుగా తన కర్తవ్యంను నేరనేర్చాలి.

### 1.5.1. సహాయక గురువు

పవిత్రుడు, పూజ్యుడు అయిన బాల్లేస్వామి వియాన్నిని మంచి గురు విద్యార్థిగా తీర్చిదిద్దారు. వియాన్నిని సుశిక్షితుడైన గురువుగా మార్చుటకు దైవకటాక్షం ఆయన్ని తన గురువైన బాల్లేస్వామికి సహాయక గురువుగా నియమించే ఏర్పాటుచేసింది. వియాన్ని గురువైన పిమ్మట ఎకుల్లీకి వచ్చినప్పుడు బాల్లేస్వామి తన శిష్యుడైన వియాన్ని స్వామి ముందు మోకరిల్లి, ఆ నూతన గురువు ఆశీర్వాదాన్ని స్వీకరించి, అతని అభిషేక హస్తాలు ముద్దాడి, ఆ సంతోషకరమైన వార్తను ఇలా చెప్పాడు. 'వికార్ జనరల్ గారు ఎకుల్లీకి ఒక సహాయక గురువును ఇచ్చారు, ఆయనెవరో కాదు సాక్షాత్తు జాన్ మరియ వియాన్నిస్వామియే'. వారి కాపరివలె విచారణ ప్రజలు కూడా ఆ వార్త విని ఎంతో సంతోషించారు. తాను చదువుకున్న రోజుల్లోనే మనల్ని ఎంతో ఆధ్యాత్మికంగా వికసింపచేశారు అని ఒకరితోనొకరు చెప్పుకొన్నారు.

మొదటి నుండి ప్రతి ఒక్కరిలో ప్రేమను చూడగలిగారు వియాన్ని స్వామి. వియాన్ని స్వామి ప్రసంగాన్ని వినాలని తన అక్క మార్గరెట్ డార్టిల్లీ నుండి ఎకుల్లీకి వచ్చేది. వియాన్ని ప్రసంగించటానికి వచ్చినప్పుడు ఎక్కువ మంది ప్రజలు దేవాలయంలో గుమిగూడేవారు. రోగులు ఎల్లప్పుడు సహాయక గురువు కోసం అడిగేవారు. సత్యోపదేశ పాఠాలు బోధిస్తు, రోగులకు క్రీస్తు ప్రేమను పంచుతు, చిన్న 'ప్రసంగాలు తయారు చేసుకుంటు"? తాను అభ్యసించిన వేదశాస్త్రాన్ని చదువుతు, తన గురువు దర్శకత్వంలో అంతరాత్మ సమస్యలున్న వారికి హితబోధ చేస్తూ వియాన్నిస్వామి తీరికలేకుండా ఎకుల్లీ విచారణలో గడిపేవారు. ఎకుల్లీలోని గురు గృహంలో బాల్లేస్వామి, వియాన్ని స్వాములిద్దరూ ఒక విధమైన మౌన జీవితాలు గడిపేవారు. వారి మధ్య గొప్పశాంతి ఉండేది, కలసి ప్రార్థించేవారు. మంచితనంలో పోటీ పడుతూ ఒకరికంటే ఒకరు ఆధ్యాత్మికంగా వికసించారు. కనుక ప్రతి గురువు బాధ్యత కలిగి జీవించాలి. నేను మంచి కాపరిని నన్ను నా తండ్రి ఎరిగియున్నట్లు నేను నా తండ్రిని

ఎరుగుదును. అట్లు నేను నా గొర్రెలను, నన్ను నా గొర్రెలను ఎరుగును. నేను నా గొర్రెల కొరకు ప్రాణమునిచ్చెదను (యోహాను 10:14-15). గురుత్వ బాధ్యతను స్వీకరించిన ప్రతి గురువు క్రీస్తు కోసం వారి జీవితాలను త్యాగం చేయాలి, వారి జీవితం పరిపూర్ణం చేసుకోవాలి. ప్రతి గురువు ప్రతి క్షణం క్రీస్తుతోనే కలిసి జీవించాలి. వియాన్నిగారు ఏ విధంగా దేవుడుతో ఉన్నారో అలాగే ప్రతి గురువు దేవుని అంటి పెట్టుకొని జీవించాలి. గురువు దైవ ప్రజలను క్రీస్తులో నడిపిస్తు వారికి రక్షణను కల్పించాలి.

## 1.5.2. బాల్లేస్వామి మరణం

బాల్లేస్వామి ఆనందకరమైన రోజులు ముగిసే సమయం ఆసన్నమైంది. 1817 ఫిబ్రవరిలో బాల్లేస్వామికి తన 65వ యేట కాలికి పుండైంది. క్రమక్రమంగా అది వ్రణమై శరీరం కృశించిపోవటం వలన అతని పరిస్థితి దుర్భరమైందని వైద్యులు చెప్పారు. ఆ సంవత్సరమంతా వియాన్నిస్వామి ఒక్కరే విచారణ పనినంతా నిర్వర్తించారు. మరోవైపు మంచంలో పడివున్న బాల్లేస్వామికి కన్నకొడుకులా సేవలు చేశారు. తన నమ్మకమైన సేవకుని ఇంటికి పిలవాలని దేవుడు ఎంపిక చేసిన తేది, డిసెంబరు 17, 1817. బాల్లేస్వామి తన సహాయక గురువు వద్ద పాపోచ్చారణచేసి సఖ్యతాసంస్కారం స్వీకరించారు. ముందుగనే అతన్ని తన ఆధ్యాత్మిక గురువుగా, పాపోచ్చారణ సంస్కార గురువుగా తానే ఎంపిక చేసికొన్నారు. అతని నుండి దారిబత్తె భోజనమైన దివ్యసత్రసాదాన్ని (Viaticum), అవస్థ అభ్యంగాన్ని పొందారు. తర్వాత అతని చెవిలో కొన్ని కృతజ్ఞతా మాటలను చెప్పి, కొంత హితబోధ చేశారు. వియాన్ని స్వామి వాటిని తీసికొన్నారు. వాటిని తన తపోజీవితంలో ఉపయోగించారు."

'నేనెంతోమంది పుణ్యాత్ముల్నిచూశాను. కాని ఇంత పవిత్రమైన భక్తుణ్ణి ఎన్నడూ చూడలేదు,' అంటు గురువు, ఆత్మీయుడు, నమ్మక పాత్రుడైన సోదరగురువు బాల్లేస్వామి మరణించినప్పుడు, వియాన్ని స్వామి చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చారు. తర్వాత తన గురువైన బాల్లేస్వామిని గూర్చి ఎప్పుడు

మాట్లాడినా కళ్లు చెమ్మగిల్లేవి. 'నేనొక చిత్రకారుడ్నైతే, అతని రూపాన్ని ఇప్పటికి చిత్రీకరిస్తాను' అనేవారు. ప్రతిదిన దివ్యపూజలో అతన్ని స్మరించేవారు.

## 1.5.3 వియాన్ని మరణము, పునీత పట్టం

క్రీస్తు ప్రభువు చెప్పినట్లు 'మీరు నా వలె లోకమునకు చెందిన వారు కారు' అనునట్లు, వియాన్నిగారు జీవించారు (యోహాను 17:16). ప్రతి గురువు క్రీస్తుకు సంబంధించిన వాడు, దేవుని మనిషి, సేవ చేసేవాడు, రక్షణను ప్రసాదించువాడు. వియాన్నిగార్ని 1845 వ సంత్సరంలో సాతాను బాధపెట్టడం మానేసింది. ఆర్స్ విచారణలో 41 సంవత్సరాలు సేవలందించాక చివరి రోజుల్లో 3 వారలు మాత్రమే జబ్బున పడ్డారు. అస్వస్థతతో నేనిక 3 వారాలు మాత్రమే జీవిస్తానని తన మరణం గూర్చి మరియ వియాన్నిగారు ముందుగానే తెల్పారు. అలాగే జరిగింది. ఆ గ్రామంలోనే విచారణ కర్తలుగా సేవలు అందించి 1859 ఆగష్టు 4న పరమపదించారు. అంత్య సమయంలో పీఠాధిపతి, ఇరవై మంది గురువులు వారి మంచం చుట్టూ నిలబడి ప్రార్ధన చేశారు. ప్రశాతంగా వారు దేహయాత్రను చాలించడం చూశారు. 1925 లో ఆయనకు ఆర్చ్యశిష్ట పట్టం లభించింది. పాపుగార్లు ఆయనను 1926 లో విచారణ గురువులకు పాలక పునీతుడుగా నియమించారు. 1950 జనవరి 9న పదవ పయస్ (భక్తినాధ) పోపుగారు వియాన్నిగారికి ముక్తి భాగ్యం పట్టాకట్టారు. తరువాత 1955 మే 31న పదకొండవ పయస్ పోపుగారు పునీత పట్టా ఇచ్చారు. గురువుంటే ప్రజల మనిషని ప్రజల ఆధ్యాత్మిక అవసరాలకు మించిన మరేపని గురువులకు ముఖ్యం కాదని పునీత వియాన్నిగారి జీవితాదర్శం తెల్పుతోంది. అందుకే వీరిని విచారణ గురువుల పాలక పునీతులుగా శ్రీసభ గుర్తించింది. మనం కూడా వియాన్నిగారి వలె దేవుని దైవత్వం, ప్రార్ధన, పవిత్రత, శాంతి కలిగి జీవించాలి. ప్రతి గురువు నిత్య గురువైన క్రీస్తుకు ప్రతి రూపముగా, అపర క్రీస్తుగా జీవించి మన జీవితం ధన్యం చేసుకోవాలి.

### 1.6 ముగింపు

"మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం' అనే నానుడి అక్షరాల పునీత జాన్ మరియ వియాన్నిగారిని చూస్తే మనందరికి తెలుస్తుంది. వియాన్ని చిన్నతనంలో చదుకోవాలని కోరిక ఉన్నా పరిస్థితులు సహకరించలేదు, అయినా కాని పట్టుదలతో తన అక్క దగ్గర చదువు నేర్చుకుని, ప్రార్ధనలు, విశ్వాసంతో మంచి మనస్సుతో దివ్యసత్రసాదం స్వీకరించారు. ఎకుల్లీ విచారణ గురువు చార్లెస్ బాల్లేస్వామి దగ్గర ఉంటూనే, గురు విద్యాంశాలు నేర్చుకొన్నాడు. బాల్లేస్వామి వియాన్నిగారిని ఎంతోగానో ప్రోత్సహించేవారు. దేవుని కృప వలన, మరియమాత సహకారం వలన గురువుగ అభిషేకం పొంది, సహాయ గురువుగ బాల్లేస్వామి విచారణలో సేవ చేస్తూ ఉండేవారు. వియాన్నిగారు మనందరికి ఎంతో ఆదర్శం, సుమాతృక. ఆయన కన్నకల, కోరిక నేరవేరింది.

## 2. జాన్ మరియ వియాన్నిగారు ఆర్స్ గ్రామానికి ప్రయాణము

### 2.0. ఉపోద్ఘాతము

ఆర్స్ గ్రామం ప్రాన్స్ దేశంలో లియోన్స్ నగరానికి ఇరవై రెండు కిలోమీటర్ల దూరములో ఉన్నది. లియోన్స్ పీఠంలో వెనుకబడిన ఒక కుగ్రామం ఆర్స్. ఆ గ్రామనికి సరియైన రోడ్డు కూడా లేదు. ఆ గ్రామ పరిస్థితి విచిత్రంగా దయనీయంగా ఉంది. ఆర్స్ గ్రామంలో ఉన్న ప్రకృతి అందాలు, పంట భూములు నిస్సారమైనవి. మట్టితో నిర్మించిన ఇళ్ళు దాదాపు నలభై వరకు ఉన్నాయి. ఇంకో ఇరవై ఇళ్ళు గ్రామానికి అవతలి ప్రక్కన చెల్లాచెదురుగా ఉన్నాయి. ఆ గ్రామంలో ఓ చిన్న భాగం గుడి, విచారణ స్వామి గృహం, సమాధుల స్థలం, ఒక చిన్న పండ్లతోట ఉన్నాయి. ఆర్స్ గ్రామం చిన్నదైనప్పటికీ అన్నపానీయాలు లభించే సత్రాలు నాలుగు ఉన్నాయి. ప్రజలందురు ప్రాపంచిక ఆశలపై, భౌతిక సుఖాలకై అలవాటు పడ్డారు. దేవుని పట్ల, మతాచారాల పట్ల వారు ఆత్మలో బలహీనులైపోయారు. త్రాగుబోతుతనం, నృత్యాలు, దుష్టత్వం, విశ్వాస

బలహీనత మొదలగునవి ఆర్స్ గ్రామములో ఉన్నాయి. చుట్టు ప్రక్కల గ్రామాలు కూడా ఈ విధంగానే తయారయ్యాయి. ఫ్రెంచి విప్లవ ప్రభావం వల్ల గురువులు తగ్గిపోవటం, సత్యోపదేశాన్ని, మత ప్రాథమిక సిద్ధాంతాలను బోధించేవారు. తగ్గిపోయారు. ప్రజలు నైతిక విలువలు మరిచి దివ్యపూజలపై అశ్రద్ధ చూపుతూ, నిర్లక్ష్య జీవితం కొనసాగిస్తున్నారు.

## 2.1. వియాన్నీ ఆర్స్ ప్రయాణము

ఆర్స్ గ్రామ ప్రజలను నీతియందు నడిపించుటకు, విమోచనం కలిగించుటకై, ఆ ప్రజలను పరలోక మార్గమున నడిపించుటకై తెలివితేటలులేని, జ్ఞానసంపన్నుడు కాని, అతి సామాన్యమైన జాన్ మరియ వియాన్ని గారిని దేవుడు ఎన్నుకున్నాడు. వియాన్నిగారు ఎకుల్లీ నుండి ఆర్స్ గ్రామానికి కాలినడకన ప్రయాణం మొదలు పెట్టారు. తనతోపాటు వియాన్ని స్వామి ముఖ్యమైన వస్తువులు, పాత మంచాన్ని, కొన్ని దుస్తులు, బాల్లేస్వామి ఇచ్చిన పుస్తకాలను తీసుకొని వచ్చారు. ఆ రోజు మంచు ఎక్కువగా ఉండుటచే సరిగా దారి కనిపించలేదు. అంతలో ఒక పిల్లవాడు అయిన అంతోయిన్ గ్రివే కనిపించాడు. ఆ బాలుడితో, 'నేను ఆర్స్ వెళ్ళుటకు దారి చూపించు, నీవు మోక్షానికి వెళ్ళుటకు మార్గము చూపిస్తాను' అని వియాన్ని అన్నారు. మరుసటి రోజు ఉదయం వియాన్నిగారు దివ్యపూజకు గంట కొట్టారు కాని ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. వియాన్నిగారి కంటే ముందు పనిచేసిన గురువులు ఎక్కువ కాలం విచారణలో ఉండలేకపోయారు. వచ్చిన గురువులు ప్రజలను విశ్వాసంలో, నీతియందు, సత్యమందు నడిపించలేకపోయారు. వియాన్నిగారు ఆర్స్ గ్రామ విచారణకర్తగా 1818 ఫిబ్రవరి 13 ఆదివారం రోజున ఫాదర్ డ్యుక్రెక్స్ స్వామి ఆధ్వర్యంలో భాధ్యతను స్వీకరించారు. అబ్రహాము సోదొమ గొమర్రా పట్టణాలు పాపంలో పడినప్పుడు దేవుని వేడుకొన్నాడు. అదే విధంగా వియాన్ని ఆర్స్ గ్రామం కోసం, ప్రజలు మారు మనస్సు పొందుటకు నిరంతరం దేవునికి ప్రార్థన చేస్తు, పవిత్రంగ జీవించేవారు. కొన్ని రోజుల తరువాత ప్రజలందరు

దివ్యబలిపూజకు వచ్చారు. వియాన్నిగారి జీవితం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మాకు చిన్న దేవాలయం ఉన్నప్పటికి ఒక పవిత్రమైనగురువు కూడా ఉన్నాడు అని ప్రజలు చెప్పేవారు.!

## 2.2. వియాన్ని ఉపవాసం, ప్రార్థన

వియాన్ని ప్రార్థన యొక్క గొప్పతనం తెలుసుకొని, దేవుని చిత్తమే జరగాలని, ఇతరుల కొరకు ప్రార్థన చేసే వారు, కాని తన స్వలాభ ప్రయోజనాల కొరకు ప్రార్థించలేదు. ఆయన ఏ కార్యము ప్రారంభించినా ముందు ప్రార్థన చేసి ప్రారంభించేవారు. వియాన్ని స్వామి విచారణ కర్తగా బాధ్యత చేపట్టిన తరువాత ముందుగా తన సేవను విచారణలో జనాభా లెక్కల సేకరణతో ప్రారంభించారు. ప్రజలు పొలంలో ఉంటే అక్కడే ప్రజలను కలిసేవారు. పెద్దలను, పిల్లలను కలుస్తూ, కుంటుంబాలను సందర్శిస్తు, వారి గురించి తెలుసుకొంటు శ్రీసభ బోధించే విషయాలను తెలియజేస్తు ఉండేవారు. వియాన్ని యేసు ప్రభువు చెప్పిన బోధనలను గ్రహించి ఆర్స్ గ్రామమును మార్చాలి అని, ఇలాంటివి కేవలం ప్రార్థన, ఉపవాసం ద్వారానే చేయగలమని దృఢంగా విశ్వసించారు (మత్తయి 17:20). ఆర్స్ గ్రామ విచారణ మారు మనస్సు పోందుటకై వియాన్ని ఉపవాస ప్రార్థనలు చేసేవారు. ప్రజలను దైవ ఆశ్సీసుల పొందాలని, ఆదివారం గుడికి రావాలని ఆయన ప్రగాఢ కోరిక. ప్రజలు మధ్యపానం, జూదం, దైవదూషణ నుండి బయటకురావాలని ఉపవాస పోరాట ఉద్యమం చేపట్టారు. వియాన్ని ప్రతిరోజు ఉదయాన్నే గుడికి వెళ్ళి దివ్యసత్రసాద మందసం ముందు నేలపై సాష్టాంగపడి కన్నీటి ప్రార్థన చేస్తు ఉంటే, ఒక వ్యక్తి ఆయన ఏమి చేస్తున్నాడని గుడి దగ్గరకు వెళ్ళి వియాన్నిని చూచి ఈ వ్యక్తి ఇతరులవంటివాడు కాదు అని ఆశ్చర్యపోయాడు.

వియాన్ని తనను తాను దేవునికి సమర్పించుకుంటూ, ఈ ప్రజలకు ఎక్కువ సేవచేయటకు నాకు శక్తిని ఇవ్వండి అంటు పశ్చాత్తాప ప్రార్థన చేస్తుఉండేవారు. నా విచారణలో ప్రజలందరు హృదయపరివర్తన చెందేటట్లు చేయండి అంటూ

దేవునికి వియాన్ని ప్రార్థన చేసేవారు. నా ప్రభువా! నా జీవిత కాలమంతా నీవు పంపే బాధలను అనుభవించుటకు నేను సిద్ధంగా ఉన్నాను, వంద సంవత్సరాలు అయిన సరే కఠినాతి కఠినమైన శ్రమలను, బాధలను సైతం అనుభవించటానికి నేను సిద్ధంగా ఉన్నాను, నా ప్రజలందరికీ హృదయ పరివర్తన కలిగించండి అని దేవున్ని వేడుకొనేవారు వియాన్ని స్వామి. ఏ విధంగానైతే అబ్రహాము, మోషీ తన ప్రజల కోసం మధ్యవర్తిగా ఉండి ప్రార్థించారో అదే విధంగా వియాన్ని దేవుడిని వేడుకొనేవారు.

### 2.2.1. కఠినమైన తపో జీవితము

క్రీస్తు ప్రభువు వాగ్దానం చేసినట్లు మీరు ప్రార్థనలో పరలోక తండ్రిని ఏమి అడిగినా అవన్నీ మీకు ఒసగబడతాయి' అని విశ్వసించి దేవుని పై ఆధారపడి ప్రార్థన చేస్తూ ఉండేవారు. వియాన్ని ప్రతిరోజు శ్రీసభ పవిత్ర గడియలో ప్రార్థన చేస్తు, జపమాలను జపిస్తు ఒంటరిగా నడిచేవారు. ప్రజలు వియాన్నిస్వామిని కలిసికోవాలి అంటే దేవాలయంలో ఉంటారు అని వారికి తెలుసు. కొన్నిసార్లు వియాన్ని త్రికాల జపం చెప్పిన తరువాత గుడి బయట ప్రజలను కలుస్తు ఉండేవారు. ఆయన ప్రార్థనతో పాటు తపస్సు కూడ చేసేవారు. వియాన్ని ఒకేసారి వందల ఆత్మలను రక్షింప శక్తి ఉంది అని ప్రజలు గ్రహించేవారు. వియాన్ని ఆర్స్ విచారణకు వచ్చిన తర్వాత తన పరుపును పేదలకు ఇచ్చి, ఒక చెక్కముక్కను దిండుగా పెట్టుకొని నిద్రించేవారు. ఆయన చేసే తపోజీవితం కనీసం పదిహేను రోజులపాటు కొనసాగేది.

ఆయన భోజన సమయానికి క్రమ పద్ధతి ఉండేది కాదు. వియాన్ని కావలసిన ఆహారం కేవలం కొన్ని రొట్టి ముక్కలు, బంగాళదుంపలు మాత్రమే, అవి కూడా ఆయన నాలుగైదు రోజలకు ఒకసారి మాత్రమే స్వీకరించేవారు. నేను తండ్రి చిత్తాన్ని నెరవేర్చడానికి వచ్చియున్నాను అని యేసు చెప్పిన మాటను తు.చ తప్పకుండ పాటించారు వియాన్ని (యోహాను 4: 34). ఒక స్త్రీ ఆయనకు సేవ చేయ ప్రయత్నించి, పునీతులకు సేవచేయటం బహుకష్టం అని నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయింది. కొన్నిసార్లు ఆయనకు ఆకలి అయినప్పుడు ఒక గుడ్డు

కాని, కొన్ని అప్పాలు చేసుకొని తినేవారు. మరి కొన్నిసార్లు ఆయన రోజకి గ్లాసు పాలు తీసుకుంటు ఆవిధంగా జీవించేవారు. మరి ముఖ్యంగ వియాన్ని తపస్సు కాలంలో ఎక్కువగా తపోజీవితం మరింత కఠినంగ ఉండేది. పవిత్ర వారంలో కనీసం భోజనాన్ని కూడా స్వీకరించేవారు కాదు. ఒంటరిగా ప్రార్థన, ఉపవాసం, ధ్యానం చేస్తు జీవించేవారు. కావున మనం వియాన్ని స్వామిని ఆదర్శంగా తీసుకుని ఇతరులు మంచివారిగ మారుటకు ప్రార్థన, తపోక్రియలు చేయటం నేర్చుకోవాలి.

### 2.2.2. పిల్లలకు, పెద్దలకు సత్యోపదేశము బోధించుట

వియాన్ని స్వామి ప్రజలను విశ్వాసమందు, సత్యమందు నడిపించడానికి సత్యోపదేశ తరగతులను ప్రవేశ పెట్టారు. ప్రజలను చైతన్యవంతులను చేయుటకు, వారిని అజ్ఞానం నుండి జ్ఞానంలోనికి, చీకటి నుండి వెలుగులోనికి తీసుకొనిరావటానికి సత్యోపదేశం బోధించడం మొదలుపెట్టారు. ఆర్స్ గ్రామంలో ఉన్నపిల్లలు, చిన్నప్పట్టినుండి పొలం పనులకు వెళ్ళిపోతూ ఉండేవారు. కనీసం వారికి ఆరు లేక ఏడు సంవత్సరాలు నిండకపోయినప్పటికీ పొలంలో గేదలను, గొర్రెలను కాపుకాస్తు ఉండేవారు. పంద్రెడు సంవత్సరాలు నిండిన పిల్లలు వారి తండ్రి దగ్గర పొలం పనిచేస్తు, తండ్రికి సహాయం చేస్తు ఉండేవారు. వసంతకాలంలో సత్యోపదేశ తరగతులకు వచ్చిన పిల్లలకు చదవటం వచ్చేదికాదు. పిల్లలు, పెద్దలు ఆదివారం కూడా దివ్యబలిపూజ మరిచిపోయి పొలంలో పనిచేయటానికి వెళ్ళిపోయేవారు."

వియాన్ని పిల్లలకు, పెద్దలకు సత్యోపదేశం నేర్పించేవారు. వారిచే ముఖ్యమైన విషయాలను, కంఠస్తం చేయిస్తు ఉండేవారు. సత్యోపదేశంలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేవారికి ఒక పవిత్ర పటాన్ని లేక పవిత్ర వస్తువులను బహుమతిగా ఇచ్చేవారు. ఒక వేళ పిల్లలు పొలం పనులకు వెళ్ళాలంటే పిల్లలకు ఉదయం ఆరు గంటలకే సత్యోపదేశ తరగతులకు వచ్చి, వియాన్ని చెప్పే విషయాలను నేర్చుకునేవారు. అందరికన్నా ముందుగా సత్యోపదేశ తరగతికి

వచ్చేవారికి బహుమతులు ఇచ్చేవారు. వియాన్ని పిల్లలందరి దగ్గర జపమాల ఉండేటట్లు చూసుకునేవారు. ఈ విధంగా సత్యోపదేశంలో, విశ్వాసంలో పిల్లలు వృద్ధిచెందటం ఆర్స్ గ్రామంలో ఆరంభమైంది. వియాన్ని 1845 సంవత్సరం వరకు అంటే తనకు సహాయ గురువు వచ్చే వరకు పిల్లలకు సత్యోపదేశం నేర్పించారు. మనం కూడా వియాన్ని స్వామిని ఆదర్శంగా తీసుకుని చిన్నపిల్లలకు సత్యోపదేశమందు, విశ్వాసమందు, సత్యమందు నడిపించడానికి ప్రజల అనుకూల సమయంలో ప్రయత్నించాలి."

## 2.2.3. ఆదివార ప్రాముఖ్యత

'మీ ప్రభువైన దేవుని పూర్ణ హృదయముతోను, పూర్ణ మనస్సుతోను, పూర్ణ శక్తితోను ప్రేమింపుడు' (ద్వితీయ 6:5) అను వాక్యం ప్రకారం వియాన్ని జీవించారు. 'ఆర్స్ గ్రామంలో ఉన్న క్రైస్తవులారా, మీరు దేవుడు ఇచ్చిన ఆజ్ఞలను మర్చిపోయి జీవిస్తున్నారు. మీరు దేవున్ని పూర్ణ హృదయంతో ప్రేమించాలి, విశ్రాంతి దినమును పాటించాలి' అని వియాన్ని తన ప్రసంగాల ద్వారా పిలుపును ఇచ్చేవారు. వియాన్నిగారు ఆదివారం వచ్చే ముందే తన ప్రసంగాన్ని తయారు చేసుకొనేవారు. దేవాలయంలో ఉండి దివ్యసత్ప్రసాద మందస ప్రేరణ తీసుకొంటు, ఆయన పునీతుల జీవిత చరిత్రను, ట్రెంటు మహాసభ సత్యోపదేశమును, ఆదివారములలో దైవశాస్త్ర నిఘంటువును, ఇతర పుస్తకాలను చదవి పీఠం ముందు మోకరించి ప్రార్థించేవారు.

ఆయన సామన్య ప్రజలు అర్థం చేసుకొనే రీతిగా భోధించేవారు. మొదటలో గుడికి వచ్చేవారి సంఖ్య చాలా తక్కువ. తరువాత వియాన్నిగారి పట్టుదల, ప్రార్థన వలన ప్రజలు దేవాలయానికి రావటం మొదలుపెట్టారు. వియాన్ని తన ప్రసంగాల ద్వారా పరలోకం, నరకం, పాపం గురించి చక్కగా బోధించేవారు. మానవుడు సృష్టించబడినది దేవున్ని తెలుసుకోవాలి అని వారికి గుర్తు చేస్తు ఉండేవారు. విశ్రాంతి దినము – అయిన ఆదివారమును మీరు ఖచ్చితంగా పాటించాలి, మీరు ఇతర పనులను, వ్యాపారమును, డబ్బును సంపాదించటానికి ప్రయత్నించవద్దు అని గట్టిగా చెప్పేవారు. మానవుడు దేవున్ని

తెలిసుకొని, శాశ్వత ఆనందాన్ని సంపాదించాలి కాని నరక లోకానికి వెళ్ళకూడదు అని చెప్పేవారు. ప్రజలు వియాన్ని బోధల ద్వారా మరణం, న్యాయ తీర్పు, అనేవి నిజంగా ఉంటాయి అని తెలుసుకోగలిగారు. ఈ విధంగా క్రమం తప్పకుండా ప్రజలు ఆదివారం గుడికి రావటం మొదలు పెట్టారు. ప్రజలు తండోప తండాలుగా దేవాలయానికి రావటం వియాన్ని స్వామి ప్రార్థన సహాయం వల్లే సాధ్యపడింది. మనం కూడా వియాన్ని స్వామిని ఆదర్శంగా తీసుకుని ఆదివారం ఎవరైతే దేవాలయమునకు రారో వారి వద్దకు వెళ్ళి ఆదివార ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేసి, మన క్రైస్తవ బిడ్డలను విశ్వాసంలో దృఢపరచాలి. వారి కోసం దివ్యసత్ప్రసాద మందసం ముందు ప్రార్థన చేయాలి, మారు మనస్సు పొందే బిడ్డలుగా చేయగలగాలి.

## 2.3. మధ్యపానము, నృత్య నిషేధము

'యేసు జ్ఞానమందును, ప్రాయమందును, వర్ధిల్లుచు దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందుచుండెను' (లూకా 2:42). ఈనాటి కుటుంబ వ్యవస్థ ఎన్నో మార్పులకు, పరిణామాలకు గురి అవుతుంది. కుటుంబంపై సరియైన అవగాహనలేక, అంకింతభావం లోపించి ఎన్నో విపరీతమైన దారుణాలను, మన సమాజంలో ఉన్న కుటుంబాలలో మనం చూస్తున్నాం. మన కుటుంబాలలో కూడా కొన్నిసార్లు చెడు అలవాట్లులకు దారితీస్తుంది. మనం కూడా దేవుని మరిచి ఈ లోక ఆశలకు, వ్యామోహాలకు బానిసలమవుతాము. నేటి ప్రపంచం సుఖాలను కోరుకొంటుంది. తిని త్రాగి ఆనందించడం, ఇంద్రియాలను సుఖపెట్టడం, శ్రమను తప్పించుకోవటం చాలమంది ధేయ్యం. కష్టపడి పనిచేయడానికి ఒప్పుకోరు. అన్నిటిలోను సులువైన మార్గాలు వెదుకుతారు. చాలామంది వస్తువులను కూడబెట్టుకొని సంతోషంగా జీవించవచ్చని అనుకొంటారు. కాని వారికి సుఖభోగాలు ముఖ్యం అని భావిస్తారు. అటువంటి సంఘటనలు ఆర్స్ గ్రామంలో కొన్ని జరిగాయి. ఆర్స్ గ్రామంలో ప్రజలు ఆదివారం దివ్యబలి పూజకు రావాలి అని తెలిసినా పొలం పనులకు వెళ్ళిపోయేవారు. వారు సంపాదించిన డబ్బుతో మంచి బట్టలు ధరించి

భోజన పానీయల కోసం సత్రాలకు వెళ్ళి అక్కడ మితిమీరి త్రాగి అసభ్యకరమైన మాటలు మాట్లాడేవారు, దైవదూషణ కూడా చేసేవారు. ప్రజలు సంపాదించిన డబ్బునంతా వినోదకాలక్షేపాలకే ఖర్చుపెట్టేవారు. ఆ సత్రాలు పాపాన్ని పోషించే కేంద్రాలు కావటం వల్లనే వియాన్ని స్వామి సత్రాలను నడిపే వారిని ఖడించేవారు. వియాన్ని ఒకసారి ప్రసంగంలో ఈ విధంగా చెప్పారు, సత్రాల యజమానులారా, మీరు ద్రాక్షసారాను త్రాగుబోతులకు అమ్మి, పేదలు సంపాదించుకున్న రొట్టెలను దొంగిలిస్తున్నారు. వారు సంపాదించిన డబ్బును ఆదివారం నాడు మీ సత్రాల్లో వృధా చేయిస్తున్నారు. దేవుడు ఖచ్చితంగా మిమ్మును శిక్షిస్తాడు అనేవాడు. వియాన్ని ఒకసారి సత్ర యజమానికి కొంత డబ్బు ఇచ్చి సత్రాన్ని మూసేటట్లు చేసాడు. అటు తరువాత యజమాని ఒక ఆదర్శ క్రైస్తవుడయ్యాడు. అది చూసే ఇతరులు కూడా తమ దుకాణాలను మూసివేశారు. మరల ఏడుగురు కొత్త సత్రాలను తెరిచారు. ఈ విచారణలో మద్యపాన సత్రాలను తెరచువారు నశించిపోతారు. అది మీరు చూస్తారు అని వియాన్ని స్వామి హెచ్చరించారు. వియాన్ని చెప్పిన విధంగా కొట్టులన్నీ మూసివేయబడ్డాయి. మద్యపాన సత్రాలను మూయించటం ద్వారా ప్రజలు దైవ దూషణం చేయటం తగ్గిపోయింది. ప్రజలకు దేవుని నామం పట్ల గౌరవం పెరిగింది. ప్రజలు దేవుని స్తుతిస్తూ ఉండేవారు.

ఆర్స్‌లో ప్రజలకు నృత్యం చేయుటం అనేది చాలా ఆసక్తిగా ఉండేది. ఈ నృత్య వ్యసనాన్ని నిషేదించుటకు వియాన్నికి 25 సంవత్సరాలు పట్టింది. ప్రతిరోజు సాయంకాల సమయాల్లో ప్రజలు నృత్యం చూడటానికి వెళ్ళేవారు. భౌతిక ఆనందం కోసం, చెడు వ్యసనం కోసం తమ సమయాన్ని వెచ్చించేవారు. నృత్యం చేసే స్థలాల్లో ఏం జరుగుతుందో తెలుసుకొని వియాన్ని యువతీ యువకుల తల్లిదండ్రులకు నిర్భయంగా ఇలా చెప్పేవారు. 'మీ ఆత్మలకు మీరెంత బాధ్యులో, మీ పిల్లల ఆత్మలకు మీరు అంతే బాధ్యులు. ఆ విషయమై మీరు ఏమైనా ఆలోచన చేస్తున్నారా? మీ పిల్లలను నిత్య నరకం నుండి కాపాడండి' అని వియాన్ని స్వామి హెచ్చరించారు. మనం ఈ లోకంలో ఉండగానే పరలోక

జీవితానికి సిద్ధం కావాలి. ఇహలోక జీవితంతోనే పరలోక జీవితాన్ని కొనుక్కోవాలి. మనం దాన్ని కోల్పోతే మన మనుష్యజన్మ వ్యర్థమై పోయినట్లే. కన్నులు మనిషి హృదయానికి కిటికీల్లాంటివి. వాటిద్వారా వెలుపలి ప్రపంచమంతా మన మనసులోనికి ప్రవేశిస్తుంది. కనుక క్రైస్తవుడు నేత్రాలను అదుపులో ఉంచుకోవాలి. మనం క్రీస్తుని అనుసరించేవారం కనుక మన జీవితం క్రీస్తు జీవితంలా ఉండాలి. క్రీస్తు ఆశయాలు మనవి కావాలి. మనం సిలువ మార్గాన్ని ఎన్నుకోవాలి. అందుకే మనం వియాన్నిగారిని ఆదర్శంగా తీసుకుని జీవించాలి. కావున నజరేతు ఆత్మీయ కుటుంబం మానవాళికి నిరంతరం సజీవ ఆలయం. మరియ యోసేపులు తల్లిదండ్రులకు ఆదర్శం, బిడ్డలను విశ్వాసంలో నడిపించాలి. ప్రతి బాలుడు, ప్రతి బాలిక, ప్రతి యువతి, ప్రతి యువకుడు ఆ బాలయేసుని ఆదర్శంగా తీసుకుని విశ్వాసంలో ఎదగాలి. మన జీవితాన్ని మార్చుకోవాలి.

## 2.4. శోధనలు ఎదుర్కొనుట

చెడుకు పాపానికి అధిపతియైన సాతాను దురాత్మ. ఈ లోకంలో తాండవిస్తున్న భక్తిహీనత అనేక రూపాలల్లో దాగి ఉంది. వక్ర మనస్సు, దుర్మార్గం మనిషి హృదయాన్ని కలుషితం చేసి, మనిషిని చెడు పనులకు పురికొల్పుతుంది. స్వయాన తండ్రియే తన స్వంత కుమార్తె పై అత్యాచారం చేయడం కూడా సాతాను పనే. ఈ లోకం సాతానుకు ఎంతగా దాసోహమైందో మనం అర్థం చేసుకోవచ్చును. నీతిమంతులను నిత్యం శోధిస్తు పడగొట్టేందుకు దురాత్మయైన సాతాను పలురకాలుగా ప్రయత్నిస్తునే ఉంటుంది. ఇటువంటి తరుణంలో వియాన్ని ఏ విధంగా సైతానును జయించాడో తెలుసుకొందాం. వియాన్ని స్వామి ప్రజలను దేవుని తెలుసుకునెటట్టు చేయగలిగాడు, ప్రజలు మారు మనస్సు పొంది, పశ్చాత్తాపం చేసుకొంటూ దేవుని ప్రేమలో నడిపించారు. పాపాత్ములు హృదయ పరివర్తనం చెంది విశ్వాసంలో వారిని దృడపరచారు. వేలాది ప్రజలు మారు మనస్సు పొంది, దేవున్ని తెలుసుకొన్నారు. ఇది అంతా ఆయన ప్రార్థన, ఉపవాసం, తపోజీవితం ద్వారా చేయకలుగుతున్నారు. మంచి

జరుగుతు ఉంటే సైతానుకు నచ్చక, వియాన్ని స్వామిని చిత్రహింసలకు గురిచేసేది. ఒకనాడు సైతాను బాధితురాలైన ఒక స్త్రీ నోటి నుండి వియాని గురించి ఒక వాక్యం పలికింది, నీవు నన్నెందికిలా బాధిస్తున్నావు, నీలాంటి వారు ఈ భూమ్మీద ముగ్గురు ఉన్న ఎడల నా రాజ్యం అంతమయ్యుండెడిది అని పలికింది. వియాన్నిస్వామి చాలా ఆత్మలను సైతాను బారినుండి రక్షించేవారు. సైతాను భయపడి తన రాజ్యంకంటే, దైవ రాజ్యం బాగా వ్యాప్తి చెందుతున్నదని భావించి, వియాన్నిస్వామిని వివిధ రకాలైన శబ్దాలతో, భయపెడుతు ఉండేది.

సైతాను వియాన్నిని వేళాకోళంగ వెక్కిరిస్తు ఈ విధంగా అనేది, "వియాన్నీ! వియాన్నీ! బంగాళదుంపలు తినువాడా! హా, నీవు ఇంకా చావలేదా, నీపై సర్వాధికారాన్ని సాధిస్తాను అని గర్జిస్తు మరోవైపు విలపించేది. సైతాను పునీతులు చేసే మంచి కార్యలు చూచి ఓర్వక అసూయ చెంది, భయంకర శోధనలతో ఆత్మపై దాడి చేసేది. కొన్నిసార్లు సైతాను అనైతిక, అసహ్యకర పద జాలం ఉపయోగించి దూషించేది. వియాన్ని స్వామిని ఆత్మల రక్షణ విషయమై నిరుత్సాహపర్చాలని 35 సంవత్సరములకు పైగా సైతాను విశ్వ ప్రయత్నాలుచేసి ఓడిపోయింది. సైతాను స్వామిని భయపెట్టడానికి ఎన్నో హింసలను పెట్టేది. కాని చివరకు సైతాను విజయం సాధించలేకపోయింది. పాపాత్ములు మారు మనస్సు పొందుతు ఉంటే సైతాను తన కక్షను, పగను వియాన్ని పై తీర్చుకొనేది. చివరకు సైతాను భయపడి వియాన్ని స్వామిని భయపెట్టక నరకానికి వెళ్ళిపోయింది. వియాన్ని స్వామి ఆర్స్ నందు ఆత్మలను రక్షిస్తు ముందుకు సాగిపోయారు. దేవుని ఆత్మచేత నడిపించబడే క్రైస్తవులు యందు ప్రేమ, ఆనందం, శాంతి, సహనం, దయ, మంచితనము, నిగ్రహం, ఔదార్యం, సాధుత్వం, నమ్మకం వ్యక్తమవుతుంటాయి (గలతీ 5:22). క్రైస్తవ విశ్వాస జీవితాన్ని కొనసాగించుటకు దేవుడు ఆత్మ బలమును దయ చేస్తుంటారు. దేవుడు యిస్రాయేలీయులను ముందుండి నడిపించారు. పగలు త్రోవ చూపు మేఘ స్తంభముగా, రాత్రి వెలుగు ఇచ్చు అగ్ని స్తంభముగా ప్రభువు

యిస్రాయేలీయులను ముందుండి నడిపించారు (నిర్గమ13:21). కావున వియాన్ని స్వామి ఆదర్శంగా తీసుకుని మన క్రైస్తవ విశ్వాసులను పవిత్రాత్మ సప్త వరాలతో, దేవుని ఆత్మ చేత నడిపించాలి.

### 2.5. ముగింపు

ఏదైనా ఒక పనిని కాని కార్యక్రమాన్ని కాని మంచిగా ప్రారంభిస్తే, సగం పని అయినట్లేనని అన్నారు పునీత జాన్ మరియ వియాన్ని. వియాన్ని ఆర్స్ గ్రామంలో ఉన్న స్థితిగతులను పరిశీలించారు. ప్రజలకు దైవప్రేమ, సోదరప్రేమ, దైవభయం లేకుండా జీవిస్తున్న సమయంలో ఆర్స్ విచారణకు వచ్చిన ప్రజలకు సత్యమును, బోధించడానికి, దోషములను ఖండించటానికి, ప్రజలను పరలోక బాటలో నడిపించుటకై వచ్చారు. ప్రజలను సందర్శిస్తు, పేదవారిని, రోగులను పరామర్శించి వారి కొరకై ప్రార్థించేవారు. ఆ గ్రామ ప్రజలు నైతిక విలువలు కొల్పోయి, మత్తుపానీయాలకు బానిసలై, నృత్యాలతోను, విందులు విలాసాలతో జీవిస్తున్న సమయంలో వియాన్ని దేవాలయంలో దివ్యసత్రసాదం ముందు మోకరించి, గంటల తరబడి వారి మారుమనస్సు కొరకు ప్రార్థించారు. వియాన్ని దివ్యసత్రసాదం ముందు కూర్చొని, తన ప్రజల ప్రాయశ్చిత్తం కొరకు ఉపవాసం చేస్తూ ఉండేవారు. పిల్లలకు, పెద్దలకు సత్యోపదేశం నేర్పిస్తు, ప్రజలను ఆధ్యాత్మిక బాటలో నడిపించేవారు. వియాన్ని దేవుని ప్రేమను అర్థం చేసుకుని ప్రజలను ఎంతగానో ప్రేమించారు.

## 3. వియాన్ని ఆర్స్ విచారణను అభివృద్ధి పరుచుట

### 3.0. ఉపోద్ఘాతము

వియాన్ని స్వామి ఆర్స్ విచారణకు వచ్చినప్పుడు దేవాలయమును చూచి దానిని నూత్నీకరించాలి అని ఆలోచన చేసారు. ఆర్స్ గ్రామ విచారణ పునీత సిక్సుస్‌గారికి అంకితం చేయబడంది. వియాన్ని స్వామి ప్రజల విశ్వాసం దృఢపడితే దేవాలయాన్ని అందమైన ఆలయంగా బాగు చేయాలని అనుకున్నారు. పునీత సిక్సుస్ దేవాలయం బయటకి అందవిహీనంగా ఉండేది, గుడి అంతా

బీటలు తీయటం చూచి ఇతర గురువులు బాధపడేవారు. గుడిలో పూజ వస్త్రాలు పాతబడి దారాలు వేలాడుతూ ఉండేవి. వియాన్ని స్వామి గుడిని ఎంతో ప్రేమించి, దివ్య మందసం ముందు ప్రార్థించేవారు. వియాన్ని యేసు ప్రభువుకు ఉన్నత స్థానం ఇచ్చుట కొరకు ఆలయంలో ఉన్న పూజా పీఠాన్ని మార్చి కొత్త పీఠాన్ని తయరుచేయించారు. దానికయ్యే ఖర్చును తానే భరించారు. తరువాత వియాన్ని లియోన్స్ పట్టణానికి వెళ్ళి రెండు దేవదూతల స్వరూపాలను తెచ్చి దివ్య సత్రసాద మందసానికి ఇరువైపులా ఉంచారు. దేవాలయంలో ఉన్న చెక్క బల్లలకు, పీఠం ప్రక్కనున్న కొయ్య బల్లలకు తానే రంగులు వేసి తేజోవంతంగా తయారుచేసారు. వియాన్ని స్వామి కంసాలి వద్దకు పూజకు కావలసిన బంగారు పాత్రలను, బట్టలు నేసే వారి వద్దకు వెళ్ళి అలంకారప్రాయమైన పూజ వస్త్రాలను తయారు చేయించారు. ఈ విధంగా వియాన్ని దేవాలయంలోనికి కావలసిన సామగ్రిని సమాకుర్చారు. వియాన్ని స్వామి నిలువుటంగీ ఎంత పాతగా ఉన్నప్పటికీ పూజవస్త్రాలను మంచిగా, ఖరీదు అయిన వాటిని కొని, ఆ చిన్న దేవాలయం చక్కగ ఉండేటట్లు చూసుకున్నారు."

## 3.1. వియాన్ని దేవాలయాన్ని నూత్నీకరించుట

మన దేశంలో చెట్టుకో గుడి, గుట్టకో ఆలయం, ఊరుకో మసీదు ఉన్నాయి. గుడులు, ఆలయాలు పుట్ట గొడుగుల్లా పుట్టకొస్తున్నాయి. ప్రజలు దేవుని పూర్తిగా మరిచిపోలేదు. శాటిలైట్ యుగంలో గడియారంతో సమంగా పరుగులు తీస్తున్నారు. కొంతమందికి చర్చిలో దేవుడు ఉన్నాడా? చర్చికి ఎందుకు రావలి? ఇంట్లో ప్రార్థన చేసుకుంటే దేవుడు వినడా అని ప్రశ్నిస్తుంటారు. దైవ సంఘమంతయు ఒకే కుటుంబముగా చేరి దేవున్ని ఆరాధించుటకు ప్రత్యేకముగా ఏర్పాటు చేసుకొనిన పవిత్ర స్థలమే దేవాలయము.'నా ఆలయము అన్ని జాతులకు ప్రార్థనాలయము అనబడును! అని ప్రభువు చెప్పారు (మార్కు11: 17).

దేవాలయము పరమ పవిత్రమైన స్థలం. కావుననే వియాన్ని గారు ఆర్స్ గ్రామంలో చాలా దేవాలయాలు స్థాపించారు. వియాన్ని దేవాలయంలో గంట

గోపురాన్ని స్థాపించారు. వియాన్నీ స్వామికి మరియమాత పట్ల భక్తి చాలా ఎక్కువ, దేవాలయంలో మరియ మాతకు చిన్ని ఆలయమును స్థాపించి 1820 ఆగష్టు ఆరవ తేదిన ఆర్స్ విచారణ పండుగ రోజున ఆమెకు అంకితం చేసారు. వియాన్ని పునీత బప్తిస్మ యోహాను పేరున చిన్న దేవాలయం, పునీత ఫిలోమినగారి పేరున ఒక దేవాలయం స్థాపించారు. వియాన్ని స్వామి ప్రతి శనివారం మరియమాత ఆలయంలోనే పూజను సమర్పించేవారు. ఆయన ఉన్న 40 సంవత్సరాలు ఆర్స్ విచారణలో పూజ సమర్పణ మరువలేదు. వియాన్ని స్వామి నిరంతరం దేవాలయంలో మార్పులు, చేర్పులు చేస్తుండేవారు, 1826 లో ఆలయ ప్రవేశాన్ని కొద్ది వెడల్పుగా చేసి, పైకి నడచుటకు మెట్లు కట్టించారు. కొన్నాళ్ల తర్వాత దేవాలయంపై నిష్కలంకమాత స్వరూపాన్ని స్థాపించారు. ఆలయమంటే ప్రజలకు ప్రేమాభిమానాలు పెరిగాయి. యాత్రికులు దేవాలయమును సందర్శించి దేవుని అనుభూతి పోందేవారు. వియాన్ని ప్రతిరోజు దివ్యమందసం ముందు మోకరించి, పవిత్రత యందు వృద్ధి చెందేవారు.

### 3.2. వియాన్ని బాలికలకు పాఠశాలను నిర్మించుట

ఎంత చదివామన్నది కాదు, ఆ చదువు మనకు ఎంత సంస్కారం నేర్పిందన్నదే ముఖ్యం. వియాన్ని స్వామి చిన్నతనంలో చదువుకునే అవకాశం లేకుండా పోయింది కావున పిలల్ల కోసం ఒక పాఠశాలను నిర్మించారు. మనకు పాఠశాలలో గురువువిద్యను అందిస్తారు. పాఠశాల ఎన్నో నేర్పుతుంది, వినయం నేర్పుతుంది, ఒదిగుండడం నేర్పుతుంది, తెలివిని, భయము నేర్పుతుంది. కొంతమందికి చదువు చేదుగా ఉంటుంది కానీ అది ఇచ్చే ఫలాలు ఎప్పుడు తీయగా ఉంటాయి అని అంటారు సోక్రటీస్. మార్గము తెలిసిన వాడు మేధావి, చూపించిన వాడు నాయకుడు, దాటినవాడు సమర్థుడు కాని మార్గం తెలిసిన, చూపించక, దాటని వాడు అసమర్థుడు అని అంటారు పెద్దలు. వియాన్ని స్వామి మాత్రం ప్రతి ఒక్కరికి మార్గం, సత్యం, చూపించిన గొప్ప పునీతుడు అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. వియాన్నిస్వామి తండ్రిగారు 1819 జూలై 8 వ తేదిన వియాన్ని మత్తయి స్వర్గస్తులయ్యారు. వియాన్నిస్వామి ప్రతి రోజు

దివ్యపూజలో తన తండ్రిని స్మరించేవారు. తండ్రి ఆస్తి నుండి ఒక భాగం వియాన్ని స్వామికి వారసత్వంగా వచ్చింది దానితో బాలికలకు ఒక పాఠశాలను నిర్మించాలని అనుకున్నాడు. వియాన్ని బాల్యంలో చదువు కోసం విద్యావసతులు లేక అష్టకష్టాలు అనుభవించారు కనుక తన గ్రామంలో ఉన్న బాలికలు అలాంటి కష్టాలు పడకూడదని తలంచి మొదట బాలికలకు ఒక పాఠశాలను ప్రారంభించారు. పాఠశాలలో చదువు చెప్పుటకు కేథరిన్ లాసాగ్నే, బెన్నోటి లార్డెటే అను సామన్య స్త్రీలను ఎంపిక చేశారు."

వియాన్ని ఒక ఇంటిని కొని, పిలల్లకు చదువు నేర్పించాటానికి ఒక ఉపాధ్యాయుని ఏర్పాటు చేసారు. ఆ పాఠశాలకు కావలసిన వసతులు దేవుడే ఇచ్చేవాడు. వారి అభివృద్ధి కొరకు దేవునికి ఎప్పుడు ప్రార్థన చేస్తు ఉండేవారు. అనాథలకు, కని పారేసిన అక్రమ సంతాన బిడ్డలకు వసతి గృహం అన్ని సదుపాయాలు కల్పించేది. అనాథ బాలికలు అందురు భవిష్యత్తులో మంచి కతోలికులు, మంచి తల్లులు కావాలని, కొందరు మంచి మఠకన్యలు కావాలని వియాన్నిస్వామి ఆశించేవారు. కొన్నిసార్లు వియాన్ని ఆతురత, ఆవేదన చెందేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు కొంతమంది ముందుకు వచ్చి ఉదారంగా సహాయం చేసేవారు. కొన్నిసార్లు వియాన్ని స్వామి సత్యోపదేశ తరగతులు తీసుకుని వారికి యేసు ప్రభువు గురించి, మరియ తల్లి గురించి తెలిసిన విషయాలను చెప్పుతు ఉండేవారు. వియాన్ని గారు పిలల్లు ఏ విధంగా జీవించాలో నేర్పేంచేవారు.

### 3.2.1. మఠకన్యలకు పాఠశాలను అప్పగించుట

జీవితం ఎప్పుడూ సవాళ్ళను విసురుతూనే ఉంటుంది. దానిని ఎదుర్కొని నిలచిన వారికే విజయం సొంతం అవుతుంది. కావుననే వియాన్ని ఎప్పుడు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని జీవితంలో ముందుకు వెళ్ళేవాడు. వియాన్ని స్వామి స్థాపించిన ఆశ్రమం నానాటికి అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఒకవేళ వియాన్నిస్వామిని బదిలీ చేసినట్లయితే ఆశ్రమం, పాఠశాల రెండూ కూడా

మూతపడే ప్రమాదం ఉంటుందని పీఠాధిపతులు ఆశ్రమాన్నే మూసివేశారు. ఈ సంఘటన నిజంగా వియాన్ని స్వామిని కృంగదీసింది. దీని వలన ఆయన తనలో తానుఎంతో మనోవేదన చెందాడు. అటుతరువాత ఇది దైవ నిర్ణయమని తలంచి, 1848 నవంబర్ 5 వ తేదిన పీఠాధిపతులకు పునీత యోసెఫ్‌గారి మఠకన్యల సభమధ్య ఒక ఒప్పందం కుదిరి ఆ పాఠశాలను ఆ సభ అధీనం చేసుకుంది.

ఆ పాఠశాలలో పని చేయడానికి వచ్చిన ఉపాధ్యాయులు గురునిలయంలో ఉంటూ, గుడిపనులు చూసుకునే వారు. మఠకన్యలతో వియాన్ని స్వామి మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. వియాన్నికి ఆనందం కలిగించే విషయం ఏమిటంటే 1855 వ సంవత్సరంలో మఠకన్యలు మాటపట్టను దైపకృప గుడిలో తీసుకోవటం, మఠకన్యలు ప్రభువుకి పేదరికం, విరక్తత్వం, విధేయత అనే ప్రమాణాల ద్వారా తమ్ముతాము అర్పించుకొన్నారు. వియాన్నిస్వామి తనకు అప్పగించిన విచారణ ప్రజల కొరకు హృదయపూర్వకంగ సేవలు చేసేవారు. తన ఆశ్రమాన్ని మూసివేసినా, పాఠశాలను తీసుకున్నా, వియాన్ని అనుదిన పూజలు అర్పించుటలో, దైవవాక్కును ప్రసంగించుటలో, సఖ్యతా సంస్కారాలను నిర్వర్తించుటలో విసుగుచెందకుండా శ్రమించేవారు. వియాన్ని ఒక కతోలిక పాఠశాల ప్రారంభించాలన్న తన కల 1849 మార్చిలో నిజమైంది. పాఠశాలను నడుపుటకు "హోలి ఫ్యామిలీ ఆఫ్ బెల్లీ అను సభకు చెందిన ముగ్గురు బ్రదర్లులు ఆర్స్ కు వచ్చారు. ఆ ముగ్గురులో పెద్దవాడు అయిన బ్రదర్ అతనాసు గుడిలో హోర్మోనియం వాయించేవాడు, పాటలు నేర్పించేవాడు, ఆ గ్రామంలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా పేరు గడించారు. వియాన్ని చదువుతో పాటు గ్రామల్లో సువార్తా కుటాలు నిర్వహించారు, దాదాపు పది సంవత్సరాల్లో వంద గ్రామాలలో క్రొత్త సంఘాలను స్థాపించారు. ఆర్స్ గ్రామ ప్రజలు ఇప్పటికీ ఆయన చేసిన సేవలకు ఆయనను కీర్తిస్తున్నారు. కావున ప్రతి గురువు పిల్లల కోసం పాఠశాలలో మంచి వసతులు కల్పించి, వారికి చదువు నేర్పించి సత్యమందు, నీతియందు నడిపించటానికి ప్రయత్నించాలి ఎందుకంటే ప్రపంచాన్ని మార్చాలంటే

శక్తిమంతమైన ఆయుధం చదువొక్కటే. మన ఆలోచనలు ఉన్నతమైతే ఆచరణలును మహోన్నతమగును. కావున ప్రతి గురువు వియాన్నిస్వామి ఆదర్శంగా తీసుకుని, విద్యను దాచుకొకుండా, అందరకి పంచాలి. మనం చదువుకోవటం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటాం అని గ్రహించాలి.

### 3.3. ఆర్స్ గ్రామమును పుణ్యక్షేత్రంగా మార్చుట

వియాన్ని దేవునికి ప్రార్థన చేయగా ఆయన తన ప్రార్థనను దేవుడు ఆలకించేవారు. ఎందుకుంటే ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపును ఉండునని తెలియజేస్తారు. దేవున్ని వెదకువారు హృదయం సంతోషంగా ఉండును. దేవున్ని ప్రేమించేవారు అధికంగా ఆశీర్వదించబడటం, దీవించబడటం జరుగుతుంది. అదే వియాన్ని గారి జీవితంలో జరిగింది. ప్రజలు అందురూ వియాన్నిగారిని ఒక గొప్ప వ్యక్తిగా, పవిత్ర గురువుగా అంగీకరించారు, మొదట ఆర్స్ గ్రామ ప్రజలను ప్రభువైపు త్రిప్పుటలో కష్టాలు అనుభవించినప్పటికి, ఆయన ప్రయత్నం కార్యరూపం దాల్చింది. ప్రజలు అందురూ వియాన్ని ఒక పునీతునిగా గ్రహించేవారు 1827వ సంవత్సరం 1859 వరకు దేవాలయాన్ని దర్శించడానికి ప్రజలు గుంపులు గుంపులుగా రావటం మొదలుపెట్టారు జ. ఫ్రాన్స్ దేశంలో ఆర్స్ గ్రామం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తయారయింది. ఆర్స్ గ్రామంలో అద్భుతాలు జరుగుతున్నాయి అని ప్రజలు డార్టిల్లీ, ఎకుల్లీ, లెసేరాబిన్స్ నుండి వచ్చేవారు. ప్రజలు వియాన్నిగారిని ఆధ్యాత్మిక వ్యక్తిగా అంగీకరించి, సలహాలకై ఆయనను సంప్రదించేవారు. ప్రజలు వియాన్నిస్వామి చెప్పే సందేశం వినటానికి పొరుగు గ్రామముల నుండి వచ్చేవారు. వియాన్ని చేస్తున్న అద్భుతాలు చూడటానికి ప్రజలు వచ్చేవారు, ఆయన కీర్తి ఆ ప్రాంతమంతా విస్తరించింది. సఖ్యతా సంస్కారం ద్వారా ప్రజలు పాపోచ్చారణం చేసి ఆనంద హృదయాలతో ఇంటికి తిరిగి వెళ్లేవారు. ఈ విధంగా వియాన్ని ఆర్స్ గ్రామాన్ని ఒక సజీవ పుణ్యక్షేత్రంగా తయారు చేసారు. ప్రతి గురువు శ్రమయందు ఓర్పుగలవారై, ప్రారయందు

పట్టుదల కలిగి ఉండాలి. ఎందుకంటే దేవునికి సమస్తము సాధ్యమని విశ్వసించి జీవించాలి. ప్రతి గురువు దేవున్ని సంపూర్ణంగా ప్రేమించాలి, ఆయన బాటలో నడవాలి, దేవుని కోసం దప్పిక కలిగి జీవించాలి. మనం దేవుని ముందు తగ్గించుకుని, వినయం కలిగి జీవించాలి.

### 3.4. ఇతర గురువుల నుండి విమర్శలు

ఎదుటి వారి ఆలోచనల్ని గౌరవించక పోయినా పరవాలే కాని అపహాస్యం చేయకండి. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక గొప్పతనం ఉంటుంది. మనకు దాన్ని చూసే గుణం ఉండాలి, దానిని అభినందించే మనస్సు ఉండాలి. ఎదుటి వారిలో తప్పులు వెతకడమే పనిగా పెట్టుకుంటే బంధువులు, స్నేహితులు, గురువులు ఎవరూ మిగలరు. కావుననే వియాన్ని ఆర్స్ గ్రామంలో దేవుని ప్రేమను గ్రహించగలిగారు. అక్కడ అనేక అద్భుతాలు ప్రార్థన ద్వారా చోటుచేసుకున్నాయి. అయితే ఇలాంటి కీలక సమయాల్లో ప్రోత్సాహించవలసిన గురువులు, సహాయక గురువులు, ఆయన ప్రార్థన జీవితాన్ని, అక్కడ జరుగుతున్న అద్భుత కార్యాలను నమ్మలేదు. ఆయన గురించి ఇతర గురువులు హేళనగ మాట్లాడేవారు. వియాన్నికి తెలివితేటలులేవని, సరిగ్గా చదవలేకపోయేవాడని, బాల్లేస్వామి దయతో గురువయ్యాడని గుర్తు చేసుకోనేవారు. వియాన్ని మంచి దుస్తులు ధరించకుండా ధనాన్ని కూడబెట్టుకొంటున్నాడని అంటూ ఉండేవారు. అతని నిర్ణయాలను తప్పుగా ఉంటాయని ఇతర గురువులు భావించేవారు. ఏది ఏమైనా నా విచారణ ప్రజలు ఆర్స్ గ్రామ విచారణకు వెళ్ళితే వారికి పాప పరిహారాన్ని ఇవ్వను అని ఇతర గురువులు చెప్పేవారు. కొంత మంది గురువులు వియాన్నిగారికి వ్యతిరేకంగా పీఠాధిపతికి ఒక లేఖ రాశారు. ఒకసారి పీఠాధిపతి వికార్ జనరల్‌గారైన రూయివెటేగార్ని ఆర్స్ గ్రామం పంపించి, అక్కడ ఆర్స్ విచారణ గురించి క్షుణ్ణంగా తెలుసుకునిరా అని పంపించారు. తరువాత సంవత్సరం నుండి ఇతర గురువులకు వియాన్నిగారిపై నమ్మకం, విశ్వాసం కలిగింది. తద్వారా ఆయన ఇతర గురువులను ఆకర్షించగలిగారు. ఆధ్యాత్మిక వడకంలో కొంతమంది గురువులు వచ్చి వియాన్ని దగ్గర పాపసంకీర్తనం

చేసేవారు. ఈ విధంగా చివరకు ఆయన పవిత్రతను, గొప్పతనాన్ని తెలుసుకోగలిగారు. మనం ఆశయాలను ఆచరణలో పెడుతూ ఒక గొప్ప వ్యక్తిగా జీవించాలి. మనం మన కోసం కాదు, ప్రజల కోసం, జనం కోసం జీవించాలి. మనం జీవితంలో కోటిశ్వరులు కావడం ముఖ్యం కాదు కానీ నిజాయితీపరులు కావడం ముఖ్యం. మనం కష్టాలను ఎదుర్కొని, రత్నాలుగా మెరుస్తు జీవిస్తు ఉండాలి. మనకు సమస్యలొస్తే రానీ, సవాళ్ళు ఎదురవుతే ఎదురవనీ, ఓటిమి తలుపు తడితే తట్టనీ, కానీ మనం మాత్రం నిలుద్దాం, పోరాడుదాం, జీవితంలో గెలుద్దాం ఇతరులకు ఆదర్శంగా ఉందాం."

## 3.5.వియాన్ని పునీత ఫిలోమిన ప్రార్థనను కోరుట

మనం దేవుని సాయం అడగాలి, ఇతరులకు మనం చేయకలిగినంత సాయం చేయాలి. మనం మనకు నచ్చినప్పుడు సహాయం చేస్తే, ఇతరులు అవసరంలో ఉన్నప్పుడే సహాయం చేస్తే మంచిది. మనం ఇతరులకు ఉపకారం చేయాలి. వియాన్ని గారు తన జీవితంలో ఎంతో మందికి సహాయం, ప్రార్థన, ప్రేమ, దయ, కరుణను చూపించారు. మనం ఇతరులకు చేసే సహాయం కొన్నిసార్లు శాశ్వతంగా ఉంటుంది. వియాన్నిగారు పునీత ఫిలోమిన ప్రార్థన సహాయంతో ఎన్నో దీవెనలు ఇతరులకు దయచేస్తారు. వియాన్నిస్వామి ఒక సారి జారికోట్ కుటుంబాన్ని దర్శించారు. అక్కడ ఫిలోమిన అవశేషాలద్వారా జరుగుచున్న అద్భుతాలను చూచి తాను కూడ ఒక అవశేషాన్ని ఆర్స్ గ్రామానికి తీసికొనివెళ్ళారు. వియాన్నిస్వామి ఎప్పుడు వినయంతో, దీనత్వంతో జీవించేవారు. ఆర్స్ గ్రామానికి పునీత ఫిలోమిన అవశేషాలు వచ్చాయి. అప్పటి నుండి ఆర్స్ విచారణలో జరిగే అద్భుతాలు దేవుని కృప వలన, పునీత ఫిలోమిన గారి ప్రార్థన సహాయంతో జరుగుతున్నాయని వియాన్ని వినయంగా చెప్పేవారు. వియాన్నిగారికి పునీత ఫిలోమిన పట్ల ఎంతో భక్తి ఉండేది, ఆమెను ఏమి అడిగిన సమకూర్చేది అని వియాన్ని నమ్మేవారు. ఆర్స్ ఒక పుణ్యక్షేత్రంగా వెలయడానికి కారణం ఆమేనని, ప్రజలు పొందిన అనుగ్రహాలు తన గొప్పతనం

వలనగాక ఆమె ద్వారనే జరుగుతున్నాయి అని వియాన్ని చెప్పేవారు. యాత్రికులు వియాన్ని దగ్గరకు వచ్చినపుడెల్లా, మీరు ఫిలోమిన దగ్గరకు వెళ్లండి, ఆమె మీద నమ్మకం ఉంచండి లేక ఫిలోమిన చిన్న గుడిలోనికి వెళ్లి స్వస్థత కోసం ఆమెను ప్రార్థించండి ఈ లోపున నేను మీకోసం ప్రార్థిస్తాను అని చెప్పేవారు. ఈ విధంగా ఆయన ఎంతో ఎత్తుకు ఎదుగుతూ, దీనత్వంతో జీవించారు. కావున మనం నిజాయితీ, నమ్మకం కొల్పోకూడదు. ఏ విధంగా స్నేహమనే చెట్టుకు నమ్మకమనే నీరు ఉన్నంత కాలం చెట్టు పచ్చగానే ఉంటుంది, మనకు అతి ముఖ్యమైనది నమ్మకం. మన జీవితంలో వస్తువులను వాడుకోవాలి, మనుషలను, దేవున్ని పేదలవారిని ప్రేమించాలి. మనం దేవుని యెడల నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటే దేవుని మహిమను చూస్తాం. పునీత మదర్ థెరిస్సాగారు ఈ విధంగా అంటారు. మనం మాట్లాడే ప్రతి పలుకూ ప్రేమతో ఉండాలి. కావున మనం దేవున్ని సేవిస్తు, ప్రేమిస్తు ఆయన బాటలో నడవాలి.

### 3.6. ముగింపు

ఆర్స్ గ్రామం చాలా చిన్నది. రవాణా సౌకర్యాలు కూడా అంతగాలేవు, అటువంటి ఆర్స్ గ్రామన్ని ఒక మహాక్షేత్రంగా మార్చారు. చదువుకోవడానికి వీలులేని బాలికలకు, బాలురకు పాఠశాలను నిర్మించి చదువు నేర్పించారు. సహాయం చేయలసిన గురువులు వియాన్ని గొప్పతనాన్ని అర్థం చేసుకొనక, విమర్శలు చేస్తు ఉండేవారు. కాని చివరికి ఆ గురువులు తన వద్ద పాపసంకీర్తనం చేయడానికి వచ్చి, తమ తప్పులను తెలుసుకొని ఆయనను మెచ్చుకున్నారు. నా ఆలయం సకల ప్రజలకు ప్రార్థనాలయం అని పిలవబడును (మత్తయి 21:13). వియాన్ని దేవాలయానికి కావసిన వస్తువులు, సామగ్రిని కొని, పూజ పీఠాన్ని తయారు చేయించి, పూజ వస్త్రాలు, స్వరూపాలు తెచ్చి, దేవాలయాన్ని శుభ్రంగా ఆలంకరించారు. వియాన్ని పునీత బప్తిస్మ యోహానుగారి పేర దేవాలయాలను స్థాపించి తన ప్రేమను, భక్తిని వెల్లడించారు.

# 4. శ్రీసభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో వియాన్నిగారి పాత్ర

## 4.0. ఉపోద్ఘాతము

దేవుడు నరున్ని తనకు పోలికగా చేశాడు. నరుడు తన కొరకు కాదు, దేవుని కొరకు ఉన్నాడు. దేవుని దరికి చేరడం అతని ధ్యేయం. అందుకే అందరి హృదయాల్లో దేవుని పట్ల ఆకర్షణ ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితం మనం దేవుని వైపు మనసు తిప్పి అతని చెంతకు ప్రయాణం సాగించేలా చేస్తుంది. అతన్ని చేరితేనే గాని మన మనస్సుకు శాంతి లభించదు. అగస్తీను భక్తుడు, "ఓ ప్రభూ! మా హృదయాన్ని నీ కొరకే చేశావు. నీ యందు విశ్రమిస్తేనే గాని దానికి విశ్రాంతి లేదు" అని నుడివాడు. మన జీవితం ద్వారా సమాజాన్ని ఆధ్యాత్మికత సమ సమాజం చేయాలి. మన ఆధ్యాత్మికతకు క్రీస్తు కేంద్ర బిందువు. మన జీవితమంతా క్రీస్తుతో జీవిస్తు, ఆధ్యాత్మికతలోనే గడుపుతుండాలి. మన అందరికీ వియాన్ని స్వామి ఒక ఆదర్శ వ్యక్తిగా, సుమాతృకగ, మార్గదర్శిగ నిలిచారు. ఆర్స్ గ్రామ ప్రజలకు పరలోక మార్గాన్ని చూపించి దేవుని వైపు నడిపించారు. వియాన్ని దేవున్ని ప్రేమను సంపూర్ణంగ అర్థంచేసుకుని, ఆ ప్రేమను ప్రజలకు, మనకు అందించారు. ఆర్స్ గ్రామ ప్రజలలో దేవుని ప్రేమను రగిలించగలిగారు. వారిని దేవునికి సాక్షులుగా మలిచారు. వియాన్ని వారి ఆధాత్మిక విషయాల యందు శ్రద్ధ చూపి, వారిని ప్రేమ బాటలో నడిపించారు. వియాన్ని స్వామి ప్రేమ, త్యాగం, దయ, కనికరం, దీనత్వం అనే సుగుణాలతో విశ్వాస పాత్రుడుగ జీవించి, మనకు ఒక ఆధాత్మిక గురువుగా నిలిచారు. అదే విధంగా మనం కూడా ఇతరులను దేవుని వైపు నడిపించడానికి ప్రయత్నించాలి.

## 4.1. ప్రార్థన జీవితము

నరునికి జీవం దేవుడు. దేవుని ప్రేమపాత్రుడు నరుడు. వీరిరువురి అనుబంధం అనంతమైనది. దేవునితో సహవాసం కలిగి సంభాషించటం ప్రార్థన. దైవ సన్నిధిలో కాలం గడపటం ప్రార్థన. పునీత అగస్తీనుగారు "మన దేహానికి

ఊపిరి గాలి. అలాగే మన ఆత్మకు ఊపిరి ప్రార్థన" అంటారు. పునీత అవిలాపురి తేరేసమ్మగారు "దేవుని ప్రేమించడమే ప్రార్థన" అంటారు. మానవుని, భగవంతుని కలిపే వారధియే ప్రార్థన. ప్రార్థన ద్వారా మనం అన్ని సాధించగలం అని దృఢంగా వియాన్నిస్వామి విశ్వసించారు. ఆయన ప్రార్థనలో దైవానుభూతి పొంది, దేవుని ఎక్కువగా ప్రేమించేవారు. వియాన్నికి చిన్నతనం నుండి దేవుని యందు భక్తి, ప్రేమ, ప్రార్థన ఎక్కువే. ఆయనకు ఎన్ని కష్టాలు, ఇబ్బందులు వచ్చినా ప్రార్థనా జీవితాన్ని మరువలేదు. వియాన్నికొన్నిసార్లు బాల్లేస్వామితో కలిసి ప్రార్థన చేసేవారు. ఆర్స్ గ్రామం వచ్చిన తరువాత ప్రజలను మారు మనస్సు పొందుటకు, దివ్యసత్రసాదం యందు కన్నీటి ప్రార్థన చేసేవారు. సైతానుకు భయపడకుండ దేవుని మీద ఆధారపడి, ప్రార్థనా శక్తితో సైతానును ఓడించగలిగారు. వియాన్ని ఆర్స్ విచారణ హృదయ పరివర్తనం చెందుటకై ఉపవాసం, తపోక్రియలు చేస్తూ ఉండేవారు. వియాన్ని ఉదయన్నే లేచి, దేవాలయంలోనికి వెళ్ళి, విచారణ ప్రజలకై దివ్యమందసం ముందు గంటల తరబడి ప్రార్థించేవారు. వియాన్నిగారు కుటుంబ సభ్యుల కోసం, తల్లి దండ్రుల కోసం, ఉత్తరించు స్థలములో ఉన్న ఆత్మల కొరకు ఎల్లప్పుడు ప్రార్థన సలిపేవారు. మనం కూడ వియాన్నిస్వామిని ఆదర్శంగా తీసుకుని మన విచారణ ప్రజలను ఆధ్యాతికంగా ప్రభువువైపు నడిపించాలంటే, మనకు దేవుని సహాయం ఉండాలి. మన విచారణ మార్చాలంటే ముందుగ మన జీవితం ప్రభువుకు అంకితం చేసుకోవాలి. మనం ప్రభువు ప్రేమ బాటలో నడుస్తు, మన ప్రజలు హృదయ పరివర్తన చెందుటకై కన్నీటి ప్రార్థన, ఉపవాసం చేస్తు, సైతాను శక్తులను ఎదుర్కొకోవాలి. మనకు అప్పగించిన ప్రజల కోసం ఎల్లప్పుడు ప్రార్థన చేయాలి. మనం దేవుని చిత్తానుసారం జీవించటానికి ప్రార్థించాలి. మనం వియాన్ని ఆదర్శ జీవితాన్ని తీసుకుని సంఘంలోని ప్రజల కొరకు, వారి అవసరాల కొరకు ప్రార్థించాలి. మనం వియాన్ని ప్రేరణగ తీసుకుని ఆయన అడుగుజాడల్లో, ప్రభుని అనుసరించటానికి ప్రయత్నించాలి.

## 4.2. పవిత్ర జీవితము

మనమందరం లోకములో జీవించేది ఒక్కసారి మాత్రమే ఆ జీవితాన్ని ఉన్నతంగా జీవించాలి. తల్లి శ్రీసభ మనలను పవిత్రంగ జీవించాలి అని కోరుతుంది (1840 . మనకు ఎన్ని కష్టాలు వచ్చిన దేవుని చిత్తం నేరవేర్చడానికి ప్రయాసపడాలి. పవిత్రత అనగా సంపూర్ణంగ మనలను దేవునికి అంకితం చేసుకోవటం. "మిమ్ము పిలిచిన దేవుడు పవిత్రుడు కనుక మీ ప్రవర్తనయందు మీరును పవిత్రులై ఉండుడు.. నేను పవిత్రుడును కనుక మీరును పవిత్రులై ఉండుడు" (1 పేతురు1:15 -16). అని పరిశుద్ధ గ్రంథము పలుకుతుంది. వియాన్నిని చాలా మంది ఎందుకు పనికి రాడు అని అన్నారు. ప్రభువు చెప్పినట్లు త్రోసి వేసిన రాయి మూలరాయి అయినట్లు వియాన్ని ఆధ్యాత్మిక గురువుగా అంగీకరించబడ్డారు. ప్రజలు ఆయన దగ్గరకు వచ్చి, వియాన్ని స్వామిచే ప్రార్థన చేయించుకోవాలని, ఆయన చెప్పే ప్రసంగాలను వినాలని, ఆయనలాగా జీవించాలని తపించారు. జాన్ మరియ వియాన్నిగారు చిన్నతనం నుండి పవిత్రంగ జీవించాలని తపించారు. దేవుని పిలుపును స్వీకరించి పవిత్రంగ ఉండాలని దృఢంగ విశ్వసించారు. ఆయనకు వచ్చిన కష్టాలు, బాధలను అనుభవిస్తు, ఒక పవిత్ర గురువుగా పట్టాభిషేకం పొంది, పవిత్రంగ జీవించటం నేర్చుకున్నారు'.

వియాన్ని ప్రజలను ఆధాత్మికంగ పవిత్రంగ నడిపించుటకు ఆర్స్ గ్రామం వచ్చి, అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజలకు కావలసిన ఆధ్యాత్మిక అవసరాలను తెలుసుకుని వారిని నీతియందు, సత్యమందు నడిపిస్తు, దివ్యసంస్కారాలు గురించి తెలియజేశారు. ప్రతి దినము పేదలకు, అనాధలకు సయహాం చేస్తూ వారిని పవిత్ర మార్గంలో నడిపించారు. వారికోసం ఎప్పుడు దివ్యసత్రసాద ప్రభును ప్రార్థించేవారు. గురువులు వియాన్ని ఆదర్శంగా తీసుకుని జీవిస్తు, భక్తితో, దైవభయంతో, ప్రార్థనతో జీవించాలి. వారు క్రైస్తవ విశ్వాసులను భక్తియందు, సన్మార్గంలో నడిపిస్తు, దేవున్ని చిత్తం నెరవేర్చుటకు ప్రయత్నించాలి.

దేవునిచే పిలువబడిన గురువులు తమ పాలక పునీతుడైన వియాన్నిగారి ఆదర్శంతో, క్రీస్తు పలికినట్లు “ఇదిగో ఓ దేవా నీ చిత్తము నెరవేర్చుటకు నేను ఇట వచ్చి ఉన్నాను” అంటూ దేవుని చిత్తాన్ని అనుసరించి పవిత్ర జీవితం జీవించాలి. మనం పవిత్ర జీవితం జీవించడానికి ప్రయాసపడాలి. మనం పవిత్ర జీవితం ద్వారా జీవిత విలువలను పునరుద్ధరించుకోవాలి తద్వారా దేవుడు అనుగ్రహించే కృపతో జీవించాలి. మనం అనుదినం క్రీస్తు బాట యందు పయనిస్తు ఆయన యందు విశ్వాసంలో ఎదుగుతు, ఆయన ఒసగు ఆత్మశకితో దేవుని చిత్తాన్ని నేర్పించాలి. మన హృదయంలో దేవుడు నివస్తిసాడు కాబట్టి దానిని పవిత్రంగ ఉంచాలి. మనకు ఎన్ని విమర్శలు వచ్చినా, వాటిని ఎదుర్కొని పవిత్ర జీవితం జీవించుటకు కృషి చేయాలి

**4.3. విధేయతా జీవితము.**

విధేయత వ్యక్తిత్వ సుగుణం. ఆధ్యాత్మిక ఎదుగుదలకు సాధనం. దేవునికి, దైవసమానులుగ ఉన్నవారికి లోబడి జీవించడమే విధేయత. అనగా దేవుని చిత్తానికి తలవంచడం. వియాన్నిగారి ఆధాత్మిక ఎదుగుదలకు తొలి మెట్టు విధేయత. విధేయత ప్రతి గురువుకి ఉండవలసిన సుగుణం, అదే విధంగా దేవుడికి పరిపూర్ణంగా విధేయించి జీవించాలి. విధేయతకు పెట్టింది పేరు పునీత జాన్ మరియ వియాన్ని అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. వియాన్నికి చిన్నతనం నుండి దేవుడన్నా, తల్లిదండ్రులన్నా ఎంతో భక్తి, విధేయత ఉండేది. యేసు ప్రభువు ఏ విధంగా తల్లిదండ్రులకు విధేయించి జీవించారో అదే విధంగా వియాన్నిగారు తల్లిదండ్రులకు, సోదరులకు సంపూర్ణంగా విధేయించి జీవించారు. వియాన్ని బాల్లేస్వామి దగ్గర ఉండేటప్పుడు ఎంతో విధేయత కలిగి జీవించారు. వియాన్ని ఆర్స్ గ్రామంలో ఉన్నప్పుడు ప్రతి రోజు మోకరించి దేవునికి విధేయించి ప్రార్థించేవారు. ఆదికాండం 22వ అధ్యాయంలో అబ్రహాముని విధేయత ఆదర్శవంతమైనదిగా దేవుడు మెచ్చుకున్నారు. ఆయన చూపిన విధేయత మూలముననే రక్షణ చరిత్రలో ప్రముఖ పాత్రను పొందారు. విధేయతకు అబ్రహాము పోలికగా ఉన్నారని పునీత పౌలు ప్రకటించారు (గలతీ

3:6-9). దేవుడు తన నిర్ణయాలను అబ్రహాముతో ముచ్చటించారు. అంతగా దేవునితో సాన్నిహిత్యం పెంచుకున్నారు. విధేయత ఉన్నవారితో దేవుడు ముచ్చటిస్తారని తెలుస్తుంది. యేసు ప్రభువు దేవునికి విధేయించారు. తల్లిదండ్రులకు విధేయించారు. అధికారులకు విధేయించారు. ఆయన విధేయతతో ప్రజల మనస్సులు గెలిచారు. కనుక ప్రతి గురువు వియాన్ని స్వామి ఆదర్శంగా తీసుకుని, అపర క్రీస్తులా జీవించటానికి ప్రయత్నించాలి. గురువులు అధికారులైన పాపుగారికి, పీఠాధిపతులకు విధేయించి జీవించాలి. ప్రతి ఒక్కరం ఇంట్లో యజమానికి, బిడ్డలు తల్లిదండ్రులకు, సంఘంలో పెద్దలకు, విచారణలో గురువుకు ప్రపంచంలో జగద్గురువుకు, జీవితంలో దేవునికి విధేయతను చూపాలి. అప్పుడే జీవితం మధురంగ ఉంటుంది. దైవాశీస్సులు పొందుతాం. ప్రార్థన, ఉపవాసములు ద్వారా విధేయతను సంపాదించుకోవాలి. మనము దేవుని, సువార్తను, దైవరాజ్యన్ని ప్రేమించాలి, విధేయతే.. గురు లక్షణం. ప్రతి గురువు తన విధేయతను క్రీస్తు విధేయతతో పోల్చుకొని చూచుకోవాలి. విమర్శించుకోవడానికి తావివ్వకూడదు. మన విధేయతతో దేవుని ప్రేమను వ్యక్తపరచాలి. మన జీవితం పవిత్రంగ సాగడానికి సరియైన వాతావరణం కల్పిస్తుంది విధేయత. ఆధ్యాత్మిక నాయకత్వ బాధ్యతలను కొనసాగించడానికి విధేయత అత్యవసరము."

## 4.4. పాప విమోచక సాంగ్య గురువు

దేవుని ప్రేమ అనంతమైనది. దేవుని ప్రేమకు ఎటువంటి హద్దులులేవు. దేవుడు పాపులను చేరదీసి, పాపాలను కడిగి ఆణిముత్యంలా తయారుచేసే పుణ్యనది పాపసంకీర్తనం. పాపం వలన దేవునికి మనిషికి మధ్య ఏర్పడిన అగాధాన్ని పాప సంకీర్తనం పూడ్చుతుంది. పాపాత్ముడు దేవుడుతో సఖ్యత ఏర్పచుకున్నది పాప సంకీర్తనం ద్వారానే. వియాన్ని ఆర్స్ గ్రామాన్ని ఒక గొప్ప పట్టణంగా మార్చగలిగారు అంటే అది ప్రార్థన ద్వారానే సాధ్యమయింది. వియాన్ని దగ్గరకి విశ్వాసులు, అవిశ్వాసులు, పాలకులు, పీఠాధిపతులు,

గురువులు, మఠవాసులు, చిన్నా, పెద్దా అనుభేదం లేకుండా అందరూ, వియాన్ని స్వామి వద్ద పాపోచ్చారణ చేసి సలహాలు పొందేవారు. ప్రభువు చెప్పినట్లు భూలోకముందు మీరు వేనిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడును (మత్తయి 18:18). గురువులు పాపసంకీర్తన సంస్కారాన్ని అశ్రద్ధ చేయకూడదు. పాపం వలన మానసిక వేదన పొందుతున్న వారిని విముక్తి చేయగలగే అధికారం ఒక్క గురువుకే ఉంది. పాపసంకీర్తన ద్వారా పాపి దేవుని ప్రేమను అనుభవించే అదృష్టానికి నోచుకుంటాడు. వియాన్నిగారు రోజుకు 16 గంటలు పైనే దేవాలయంలో కూర్చుండి పాప సంకీర్తనాలు వినేవారు. ఒక ఫ్రాన్సు నుండేకాక ఇతర దేశాల నుండి కూడా భక్తులు ఆయన దగ్గరకు వచ్చి పాపసంకీర్తనం చేసేవాళ్ళు. 40 ఏళ్ళ పాటు రోజుకు 300 మంది దాకా ఆయన దగ్గర పాప సంకీర్తనం చేసికొని పాప పరిహారం పొందుతు వచ్చారు. ఈనాడు పాపసంకీర్త నానికి విశ్వాసులు, ముఖ్యంగా యువత దూరంగ ఉన్నారంటే వారు ఆ ప్రేమను ఈ సాంగ్యంలో పొందలేకపోవటమే కారణం. పాప సంకీర్తన కార్యం యాంత్రికంగా తయారవటం, సరియైన బోధనలేకపోవటం, హితబోధతో కూడిన పాపసంకీర్తనం ఇవ్వకపోవటం మొదలైయిన అంశాలు విశ్వాసుల్ని విముఖత వైపు నడిపిస్తున్నాయి. గురువుకు మనం చెప్పే పాపాలను తిరిగి క్రీస్తుకు అర్పించాలి. ఇది దివ్యబలి సమర్పణలో సాధ్యమవుతుంది. అలానే ఉపవాస ప్రార్థనలు కూడా అవసరం. పాపసంకీర్తన సంస్కారం వల్లనే మనకు మనశాంతి కలుగుతుంది. గురువులు దీనిని అశ్రద్ధ చేయకూడదు. గురువులు వారి జీవితంలో నెలకు ఒక్కసారియైన ఈ దివ్యసంస్కారం చేయాలి. తద్వారా గురువు యొక్క ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. ఈ సంస్కారాన్ని ఇతరులకు ఇచ్చేటప్పుడు, మన జీవితం ద్వారా ప్రజలను దైవ ప్రేమలో నడిపించాలి. మనం పాపసంకీర్తన సాంగ్యము అశ్రద్ధ చేస్తే మనిషి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక జీవితం దెబ్బతింటుంది. మనం పాపసంకీర్తనం ద్వారా పాపపు సంకెళ్ల బంధాన్ని విడిచి, మనం విముక్తిని, విశ్రాంతిని పొందాలి. మనం ఎంత పాపాత్ములమైనా, దేవుడు

మనలను ప్రేమిస్తున్నారు అన్న విషయం గుర్తించుకొని, ఆదర్శ జీవితం జీవించడానికి ప్రయత్నించాలి.

## 4.5. దివ్యబలిపూజ యెడల భక్తి

వియాన్నిగారికి చిన్నతనం నుండి గురువు కావాలనే కోరిక బలంగా ఉండింది. అందుకే తాను గురువు కానిచో తన జీవితం వ్యర్థం అనేవాడు, గురువు జీవితంలో ఎన్ని శ్రమలు, అంతరాయాలు వచ్చినా, ఎదుర్కొని పవిత్ర గురువుగా జీవించాలి అని కాంక్షించాడు. గురుత్వ జీవితానికి, దివ్యబలి సమర్పణకు విడదీయరాని సంబంధం ఉందని గ్రహించారు. వియాన్ని గారు గురువుగా అభిషేకించబడిన తర్వాత దివ్యబలి పూజను భక్తి విశ్వాసాలతో సమర్పించేవారు. గురుత్వంపై ఎనలేని నిరీక్షణ, ఆరాటం తనను ఒక దివ్యసత్తసాద గురువుగా తయారవడానికి నాంది పలికాయి. వియాన్ని ప్రదర్శించిన నియమ నిష్టలు ప్రస్తుత గురువులకు, మనకందరకు ఎంతో అవసరం. దివ్యబలి పూజ భక్తితో, అర్థవంతంగా, ఒక రక్షణ పూరిత సజీవ సంఘటనగ దివ్యబలిపూజను సమర్పణ చేయాలి. వియాన్ని ప్రజలకు ఈ విధంగా తెలియజేసేవారు, “ఎంత ఎక్కువగా పాపోచ్చరణం చేస్తే అంత పవిత్ర హృదయంతో దివ్యసత్రసాదంను స్వీకరించి, అంత ఎక్కువగా సత్రసాద ప్రభుని దర్శించవచ్చును”. పాపసంకీర్తనం చేయకుండ దివ్యసత్రసాదము స్వేకరింపవద్దు అని హెచ్చరించేవారు. దివ్యబలిపూజలో పవిత్రంగా, యోగ్యంగా పాల్గొనాలని చెప్పారు. గురువులు జీవిత సాఫల్యంను దివ్యసత్రసాదంలో వెదకాలి. దివ్యబలి సమర్పణలో క్రీస్తు ఏ విధంగా తన శరీరరక్తాలను మన కోసం సమర్పించారో అదే విధంగా గురువులు తమ జీవితాలను తండ్రి దేవునికి అర్పిస్తు ఉండాలి. ప్రతి గురువు దివ్య పూజాబలిని సమర్పించడం ద్వారా తన బాధ్యత తీరపోయింది అని భావింపరాదు. తన ప్రజలతో కలిసి సంఘప్రార్థన అనునిత్యం చేస్తూన్సే శ్రీసభ తన కప్పగించిన అనుదిన ప్రార్థనావళిని క్రమం తప్పక జపించాలి. ఏకాంతముగ పరలోక తండ్రితో, నిత్యగురువైన క్రీస్తుతో గంటల తరబడి

సంభాషించాలి. తద్వారా గురువు తన ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించు కుంటాడు. మనం దివ్యబలి పూజలో పాల్గొనేటప్పుడు మనకు ఆత్మీయ, మానసిక, శారీరక సంసిద్ధత ఉండాలి. అప్పుడే మనం ప్రభువు విందును యోగ్యంగా స్వీకరించగలము. మనం దివ్యబలిపూజలో పవిత్రంగ, ఉత్సాహంగ పాల్గోనాలి. మనం మంచి పాపసంకీర్తనం చేశాకే దివ్యభోజనంను ఆరగించాలి. మన గురుత్వ జీవితమును తండ్రి దేవునికి అర్పించి జీవించాలి!

### 4.6. దివ్యసత్రసాదము యెడల భక్తి

జాన్ మరియ వియాన్ని గారు దివ్యసత్రసాదం యెడల గొప్ప విశ్వాసం, ఆరాధ్యభావాలు గల ఒక గొప్ప దైవజనుడు. ఆర్స్ విచారణలో ఆత్మల సంరక్షణ మహాకార్యములో ప్రజలను ఆధ్యాత్మికం వైపు నడిపించి వారికి ఎనలేని సేవలు అందించారు. ప్రతి విచారణ గురువు దైవ ప్రజల శ్రేయస్సుకై పాటుపడాలి. నిర్గమ కాండము 3:14 వచనంలో ఈ విధంగా తెలియజేస్తుంది, “నేను ఉన్న వాడను. దేవుడు యిస్రాయేలు ప్రజలతో ఒప్పదం చేసుకొన్నాడు, ‘నేనుమీ దేవుడను మీరు నాకు ప్రజలు” (యెహె 36:28). దేవుడు తన ప్రేమను మనపై కుమ్మరించి, “నేను మీకు తోడై ఉందును” అని తెలియజేస్తున్నారు (నిర్గమ 3:12). క్రీస్తు ప్రభువు “సర్వదా నేను మీకు తోడై ఉంటాను (మత్తయి 28:20) అంటూ వాగ్దానమును దివ్య సత్రసాదము స్థాపించి, మనలను కాపాడుతున్నారు. వియాన్నిగారు ప్రతి రోజు “దివ్య సత్ర్రసాద ఆరాధన” తన అధ్యాత్మిక జీవితాన్ని, సాధన ప్రాప్త జీవితాన్ని జీవించుటకు దోహదం చేసింది. వియాన్ని ధ్యాన పూరిత జీవితంను, వాస్తవిక జీవితమును జీవించడానికి దివ్య సత్రసాద ఆరాధననిచ్చింది. ప్రతి గురువు నివసించే చోటు విచారణ గురునిలయం కాదు, దివ్య మందసంలోని దివ్య సత్రసాదంలా ప్రభు వసించే చోటు కావాలి అని తన అభిప్రాయమును తెలియజేసారు. నేటి గురువులు దివ్య సత్ర్తసాదంలో ఉన్న ప్రభువును ఆరాధించ లేకపోతున్నారు. వారు ఈ లోక విషయాలలోను ఆసక్తి చూపిస్తు, మనశ్శాంతిలేక, గర్వం చూపిస్తు జీవిస్తున్నారు. ప్రతి గురువు తన వ్యక్తిగత జీవితాన్ని ప్రభువునకు సమర్పించాలి.

గురువులు దివ్య సత్రసాద రూపంలో ఉన్న యేసుక్రీస్తును తమ జీవితాలకు కేంద్ర బిందువుగా ప్రతిష్టించుకోవాలి. గురువులు తప్పకుండ, ఎంత తీరిక లేకుండ ఉన్నా దివ్యసత్రసాదంలో దేవున్ని దర్శించే అలవాటును అలవర్చుకోవాలి. ప్రస్తుత ప్రపంచంలో ఉన్న సవాళ్లను దివ్య సత్ర్పసాద ప్రభుని బలంతో ఎదుపేగి మన జీవన యాత్రను కొనసాగించాలి.

### 4.7. మరియమాత యెడల గౌరవము

డార్టిల్లీ గ్రామంలో ఏడేళ్ల జాన్ వియాన్ని మాత్రం రోజూ గాడిదపై ఆవుల్ని, గొర్రెల్ని మేపుటకు లోయలోకి వెళ్లేవాడు. తనతోపాటు జపమాలను, చెక్కతో చేసిన ఒక చిన్న మరియమాత స్వరూపాన్ని తీసికెళ్లేవాడు. ఒక చిన్న ఏటి ఒడ్డున నరికివేయబడ్డచెట్టు మొదట్లోగల తొర్రలో మరియమాత స్వరూపాన్ని పెట్టి పూలు, ఆకులతో అలంకరించేవాడు. అదొక సహజమైన పూజాప్రార్థనా పీఠం, దానిముందు మోకరిల్లి ప్రార్థనలు చేసేవాడు, జపమాలను చెప్పేవాడు. ఈ రహస్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు వియాన్ని బాల్యాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. పునీత ఫ్రాన్సిస్ రెజిస్ పుణ్యక్షేత్రానికి వెళ్లినప్పుడు తన ప్రయాణంలో తనకు తోడుగా ఉండమని మరియమాతను ప్రార్థించారు. వియాన్ని గారు గురు విద్యాలయంలో చేరినప్పటి నుండి ఏనాడు జపమాల జపించడం మరువలేదు. వియాన్నిగారు తన విచారణ ప్రజల మారు మనస్సుపొందాలని, ఎంతటి త్యాగానికైన సిద్ధపడి వారికొరకై ఉపవాసము, ప్రార్థనలు ఎడతెగక చేసియున్నారు. ఈ విధంగా ఆయన సహోదర ప్రేమను వ్యక్తపరచారు. మరియమాత స్థిరమైన విశ్వాసమును ప్రకటించింది, 'ఇదిగో ఏలినవారి దాసిరాలను' అంటూ తన విశ్వాసాన్ని వెల్లడించింది. అదే విధంగా జాన్ మరియ వియాన్నిగారు మరియతల్లి వలె విశ్వాసంతో కూడిన జీవితాన్ని జీవించారు. జాన్ మరియ వియాన్ని గారి వలె ప్రతి గురువు మరియతల్లి యెడల అచంచెల భక్తి విశ్వాసాలు కలిగి జీవిస్తూ ఆ తల్లి సహాయ, సహకారాలతో తన విచారణ ప్రజల శారీరక, ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకై కృషి చేస్తు, తన

గురుత్వ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. క్రీస్తు రక్షణ చరిత్రలో మరియ తల్లి ప్రత్యేక స్థానం కలిగి ఉంది. మనుష్యావతార క్రీస్తుని తన గర్భంలో మోసి, గురువులకు అధిపతియైన క్రీస్తుకు తల్లి అవడం వలన ప్రతి గురువుకు ఆధ్యాత్మిక తల్లిగ నిలిచింది. ప్రతి గురువు కూడా ఆ తల్లి యెడల అచంచల భక్తి భావాలు కలిగి ఆమెను తమ జీవితంలో అనుసరించాలి. తమ జీవన విధానాన్ని ఆమె చూపించిన బాటలో కొనసాగిస్తు, క్రీసు ప్రభువునకు మరింతగ దగ్గరవ్వాలి. మరియతల్లి వలె విశ్వాసంతో కూడిన జీవితాన్ని జీవించాలి. ఈ విధంగా ఆ తల్లి సహాయం, సహకారాలతో తన విచారణ ప్రజల శారీరక, ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకై కృషి చేస్తు, తన గురుత్వ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

### 4.8. ముగింపు

క్రీస్తు దేవుడై ఉండి కూడా ఒక మానవునిగ ఈ లోకంలో జన్మించి, దేవుని సన్నిధి నుండి దూరమైన ప్రజలను మరల తండ్రి దరికి చేర్చడానికి తన ప్రాణాలనే దారబోసాడు. గురువు కేవలం పూజలు చేసేవాడు మాత్రమే కాదు. అతని ప్రధాన పని కాపరిగ ఉండటం . పూజనర్పించడం, వాక్యాన్ని బోధించడం, తదితర కార్యాలన్ని కాపరి బాధ్యతలో భాగాలే. క్రీస్తు ఓ మంచి కాపరిగ మేపరిగ వ్యక్తపరుచుకునెను. ప్రజల శ్రేయస్సుకై తన ప్రాణాన్ని పణంగా పెట్టెను. వియాన్ని ఈ లోకంలో జీవితాంతం ప్రజలకు సేవచేయాలని, వారి యొక్క ఆధ్యాత్మిక, శారీరక రుగ్మతుల నుండి కాపాడతు వచ్చాడు. తన దగ్గరకు వచ్చిన ప్రతి వారిని ప్రేమతో ఆదరించాడు. ఈ విధంగా ప్రతి గురువు కూడ ప్రజలను కాపాడాలి. ఎందుకంటే గురువు పిలువబడింది క్రీస్తుతో ఉండుటకు, తన ప్రజలను ఆయనలో నడిపించుటకు కాబట్టి గురువులు వారి జీవితాన్ని వారి స్వంత లాభాల కోసంకాక ప్రజల శ్రేయస్సు కొరకు ఉపయోగించాలి. ప్రజలు కూడా గురువులకు సహాయం చేస్తూ, మంచి సంఘ సభ్యులుగ తయారవ్వాలి.

## ఉపసంహరణము

ప్రసుత్త ప్రపంచంలో ఒక పక్క పొరుగు దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి, మరోవైపు ఊహించలేని విధంగా ప్రతికార హింసలు, మరణాలు, దోపిడీలు, తీవ్రవాదం, స్వార్థం, అవినీతి, యుద్ధాల వలన ప్రజలు తీవ్ర వేదనలు అనుభవిస్తున్నారు. మనిషి ఆనందంగా, సంతోషంగా జీవించే పరిస్థితులలో ఈ లోక వ్యామోహాలలో పడి దుర్భలుడుగా, భ్రమల్లో జీవిస్తున్నాడు. క్రైస్తవ ప్రజలను ఆధ్యాత్మికంగ నడిపించాలి అంటే మనకు ప్రార్థనాశక్తి ఎంతో అవసరం. "ప్రభు! ఆనతియిమ్ము, నీ దాసుడు ఆలించుచునే యున్నాడు (1సమూ 3:9) అని నుడివిన సమూవేలువలె, ప్రతి గురువు దైవసేవ చేయుటకు తన జీవితాన్ని దేవునికి అంకింతం చేయాలి. "గురువు తన కొరకే గురువు కాదు" అని ఫుల్టన్ జె. షీన్‌గారు తెలియపరచినట్లుగా ప్రతి గురువు తన గురుత్వ బాధ్యతలకు అత్యంత ప్రాముఖ్యత నివ్వాలి. ప్రతి గురువు క్రీస్తు సువార్తను, ఆయన మరణ పునరుత్థానాల పరమ రహస్యమును ప్రజలకు బోధించాలి. బోధించే సువార్తకు, జీవించే జీవితానికి వ్యత్యాసము ఉండకూడదు. జీవించే జీవితం సువార్తను పోలి ఉండాలి. అప్పుడే గురువులు వియాన్ని వలె ప్రజలను మోక్షానికి నడించగలరు. పేద కుటుంబంలో జన్మించిన వియాన్నిగారు గురువుగా అభిషిక్తులైన తరువాత కూడా అతి నిరాండంబర జీవితాన్నే జీవించారు కాని, లేనిపోని విలాసవంతమైన జీవితాన్ని ఎన్నడూ జీవించలేదు.

ఇహలోక విషయాలతో సతమతమౌతు తీవ్రమైన మోహావేశాలతో, అహంకారం, ఆగౌరవం అనే. దుష్ట గుణములతో నిండిపోయిన మన హృదయాన్ని శాంతి, సమాధానముతో నిరాడంబరంగా వినయంతో చేసే ప్రార్థనే మార్గం. ప్రతి గురువు దేవుని మీద పూర్తి నమ్మకం ఉంచి ప్రార్థన చేయాలి. ఈనాటి గురువులు సేవాభావంతో జీవించి క్రైస్తవులకు ఆదర్శంగా జీవించాలి. తనకు అప్పగించిన మందను సక్రమమైన మార్గంలో నడపాలి.

పునీత జాన్ మరియ వియాన్నిగారు ఓ మంచి గురువుగ, కాపరిగ దైవకృపను పొంది ఆర్స్ గ్రామాన్ని సంస్కరించారు. ఎన్నో ఆత్మలను క్రీస్తు చెంతకు తెచ్చారు. ఎంతో మందిని పరలోకం వైపు నడిపించారు. వియాన్ని ప్రభు మందనుకాయుచు ఒక అధిపతి వలెకాక మంచి కాపరి క్రీస్తువలే, ప్రేమ కలిగి తమ జీవితమును ప్రభు మందకై అర్పిస్తు వారి సేవలు ఎక్కడ అవసరమో అక్కడకు పయనించి, రేయనక, పగలనక అహర్నిశలు చేస్తు, తన జీవితాన్ని అర్పించారు. ప్రతి గురువు వియాన్ని వలె అంతః శుద్ధీకరణను పొందుతూ క్రీస్తు ప్రేమను, ప్రజలకు అందిస్తూ, సేవ చేస్తు మంచి కాపరిగ వర్ధిల్లుతుండాలి.

# 3. ద్వితీయ వాటికన్ మహాసభల ఆసక్తికర బహుమానం - సామాన్య క్రైస్తవుల పాత్ర

- ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్

శ్రీసభలో సామాన్య క్రైస్తవుల పాత్రను నిర్వచింప అవసరం ఏర్పడినందున ఈ ఉత్తరువును జారీచేసారు. ఈ మహాసభ ప్రారంభించక ముందు ఏర్పడిన



సన్నాహక కార్యనిర్వాహక సంఘం సామాన్య క్రైస్తవులకు సంబంధించిన దైవశాస్త్రం అందుబాటులో లేనేలేదు. రెండు వేల సంవత్సరాలలో జరిగిన ఏ మహాసభలోను సామాన్య క్రైస్తవుల గురించి ఎటువంటి పత్రం వెలువడలేదు.

శ్రీసభ చట్టంలో సామాన్య క్రైస్తవుల గురించిన నిర్వచనం, అదీకూడ వర్జన విధానంలో ఇచ్చారు: 'గురువర్గానికి చెందని వారు సామాన్య క్రైస్తవులు (కతోలికులు). అందుచేత, సామాన్య క్రైస్తవులు చెల్లించుటకు, విధేయించుటకు మాత్రమే కుదించబడ్డారు.' ఇటాలియన్ భాషలో చెప్పాలంటే – "ప్రార్థన, చెల్లింపు, నోరు మూసుకో" అనే వాడియైన పదజాలంతో నిర్వచించారు.

కనుక, ఈ మహాసభలో శ్రీసభ రాజ్యాంగ పత్రాన్ని వ్రాసేటపుడు సామాన్య క్రైస్తవులను నిర్వచించాలని అనుకున్నప్పుడు వారిని, "దేవుని ప్రజలు"గా అభివర్ణించారు.

"సామాన్య క్రైస్తవులే శ్రీసభ కనుక, వారును ఈ భూమిమీద క్రీస్తుని ప్రేషితకార్యం కొరకు గురువులతో, మఠవాసులతో, పీఠాధిపతులతో సహబాధ్యతను కలవారు." 1960 లో "కాల చిహ్నాలను" బట్టి ఆధునిక ప్రపంచం – సువార్తా

సందేశాల మధ్య ఏర్పడిన దూరంబట్టి, సువార్తను బహిరంగ స్థలాలకు తీసుకుపోటానికి సామాన్య క్రైస్తవులను బలపరచ వలసిన అవశ్యకత ఏర్పడింది.

సామాన్య క్రైస్తవుల గురించి చేసిన మూల ప్రణాళిక బృహత్తరంగ ఉండింది. అందుచేత, అందులోని కొన్ని భాగాలను తొలగించిన మీదట –"లోకానికి వెలుగు శ్రీసభ," "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ," "సర్వక్రైస్తవ సమైక్యత," "లోకరక్షా ఉద్యమం – శ్రీసభ ధర్మం" అనే పత్రాలు తయారయ్యాయి. ఇవి కేవలం తర్క విషయమేగాక, దైవప్రేరితమైనవి కూడ! గత 50 సంవత్సరాలలో వీటన్నిటిలోను సామాన్య క్రైస్తవులు ఘనమైన పాత్రను పోషించారు.

ద్వితీయ వాటికన్ మహాసభ ద్వారా, బహుశా, పీఠాధిపతులు చాలా రాయితీలను కోల్పోయి ఉంటారు. అయినా, నేటి శ్రీసభలో అవసరమైన సామాన్య క్రైస్తవుల చిరకాల పాత్రకు స్థానం దక్కింది. కాని గుర్తించదగ్గ విషయమేమంటే – గురువుల, మఠవాసుల జీవితానికి బలమైన మార్గదర్శక సూత్రాలు ఈ మహాసభలో కొరవడ్డాయి. తద్వారా ఈ రెండు వర్గాలవారు మహాసభ తర్వాత కాలంలో వారి అంతస్తుయొక్క ప్రమాణాలు బాగా దిగజారాయి.

మరోప్రక్క, సామాన్య క్రైస్తవుల విధానంలో నిజమైన సంస్కరణకు పిలుపు నిచ్చారు. (రోమీయ పరిపాలనా యంత్రాంగం (Roman Curia) ఈ విషయాలలో అభ్యంతరాలను లేవదీయలేదు) అయితే, అపోస్తలిక కార్యక్రమాలలో ఎదుగుదలను చూడగలిగారు.

సామాన్య క్రైస్తవులపై ఉత్తరువును అక్టోబర్ 1964 లో చర్చించారు. బేటన్ రూగ్ పీఠాధిపతి రాబర్ట్ ఇ. ట్రేసి ప్రకారం – "ఇవి (చర్చలు) లోతైన ఆధ్యాత్మిక నిశితదృష్టి, పాండిత్యం, ప్రకాశవంతమైన జ్ఞానం, సహజత్వం, హాస్యంతో మేళవించబడి, ఐదు రోజులపాటు జరిగాయి. సభాధిపతుల మెరుపులతో కూడిన ఉపోద్ఘాతాల వెనుక గొప్ప దైవశాస్త్ర నిపుణుల నైపుణ్యం కూడ ఉండింది. వారు చర్చలంతటా విలువైన విషయాలను సభాకార్యం కొరక అందించారు."

తన దేశస్థులైన, బెనెడిక్ట్ సభకు చెందిన ఫాదర్ గాడ్ఫ్రె డిక్మాన్ (మిన్నెసోట) దైవార్చన శాస్త్ర నిపుణుడు, సభలో మతపర స్వేచ్ఛపై చేసిన ప్రకటనలను నమోదు

చేసిన యేసుసభ గురువు ఫాదర్ జాన్ కూర్తిని ముర్రె, విఖ్యాత గాంచిన అమెరికా శ్రీసభ చరిత్రకారుడు మోన్సిగ్నోర్ జాన్ ట్రాసి ఎల్లిస్ గురించి కూడ ప్రస్తావించాడు. ఫాదర్ డిక్మాన్, ఫాదర్ ముర్రె సభలో రెండవ సమావేశం నుండి హాజరైనారు. పొరపాటు వలన మోన్సిగ్నోర్ ఎల్లిస్ ను సభకు ఆహ్వానించలేదు. కాని, పీఠాధిపతి ట్రేసి జరిగిన పొరపాటును సవరించదలచాడు.

“చివరకు నా అంతట నేనే ఆ అమెరికా శ్రీసభ ఉద్దండ చరిత్రకారుడిని ఆహ్వానించుటలో సఫలీకృతుడనయ్యాను. అతడు మహాసభ నాల్గవ సమావేశానికి హాజరైనాడు” అని తెలియజేసాడు. సెయింట్ లూయిస్కు చెందిన కార్డినల్ జోసఫ్ ఇ. రిట్టెర్ సామాన్య క్రైస్తవులపైగల ఉత్తరువు మీద ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తి. మౌలిక ప్రణాళికలో ఆశ్రయమిచ్చే గురువర్ణ స్థాయిలో సామాన్య క్రైస్తవుల ప్రేషితకార్యం గురువుకు వారు అందించే సాయం మాత్రమేనని వ్యక్తీకరించారు. కాని, సామాన్య క్రైస్తవుల వివిధ రూపాలలోగల ప్రేషితకార్యాలను గురువుల పరిచర్య నుంచి వేరుచేసి, ప్రత్యేకంగా గుర్తించాలని, అంతేగాని, వారి ప్రేషితకార్యాలను గురుశ్రేణితోగల సంబంధంతో లెక్కించకూడదని ఉద్ఘాటించారు.

సభలో కొంతమంది పై మౌలిక ప్రణాళికనే యథాతథంగా ఉంచమని గొంతెత్తి చెప్పారు. ముఖ్యంగా ఆంగ్లేయ కార్డినల్ మైకెల్ బ్రౌన్ కేవలం వ్యతిరేఖ దృష్టితో ఆలోచించాడు:”ప్రతి ఒక్కడు అపోస్తలుడు కావలెనా?” అని ప్రశ్నించి, పునీత పౌలుని వాక్యాన్ని (1కొరింతీ 12: 29) ఉటంకించాడు. సామాన్య ప్రజలు తమ పీఠాధిపతులకు, కాపరులకు విధేయులుగా ఉండ బద్ధులై ఉన్నారని, అందుకు తగిన బలమైన ఉత్తరువు ఉండాలని కార్డినల్ బ్రౌన్ కోరారు.

పీఠాధిపతి ట్రేసి సామాన్య క్రైస్తవులపై ఉత్తరువును సంక్షిప్తం చేస్తు, మూడు విషయాలుగా వివరించారు:

- సామాన్య క్రైస్తవులు అపోస్తలిక ప్రేషితకార్యం చేపట్టడానికి కారణం గురువుల కొరత ఉన్నందుకు కాదు. శ్రీసభ అవసరాలనుబట్టి కాదు. ఇవి మౌలిక కారణాలు కానేకావు. ముఖ్యమైన కారణమేమంటే – వారు తమ బప్తిస్మం ద్వారా దేవుని బిడ్డలుగా విశిష్టస్థానాన్ని కలిగి ఉన్నారు.

- సామాన్య క్రైస్తవుల ప్రేషితకార్యం ప్రపంచ వ్యవస్థలోనుంచి ప్రభావవంతంగా పుట్టుకొచ్చే శ్రీసభలో ఉంటుంది.
- సామాన్య క్రైస్తవుల భాగస్వామ్యం లేకుంటే లోకరక్షణ అన్నది జరగటం దుర్లభం.
- క్రమపద్ధతి కోసం పీఠాధిపతుల అధికారం అవసరమే అయినా, "దేవుని ప్రజలకు స్వేచ్ఛ" కూడ అంతే అవసరం. ఇటువంటి స్వేచ్ఛను సామాన్య క్రైస్తవులకు ఇచ్చినపుడు వారు పొరపాట్లు చేయడం, గందరగోళం ఏర్పడటం సహజం. కాని, ఇవి లేకుండా ఎదుగుదల కూడ ఉండదు.

ఇందుకు మంచి ఉదాహరణ – బెటోన్ రూజ్ అనే మేత్రాసనంలో కనిపిస్తుంది. మేత్రాసన, విచారణ స్థాయిల్లో సలహాసంఘాలను పెద్ద సంఖ్యల్లో సామాన్య క్రైస్తవులతో ఉండాలని తీర్మానించారు. విచారణ సలహా సంఘాలను బాగానే చేయగలిగాం. కాని, మేత్రాసన స్థాయిలో సలహాసంఘం తయారుచేయుటలో మొదట విఫలమైనాం. ఎందుకంటే, ఎన్నికల తతంగం సంక్లిష్టమయింది. ట్రేసి, స్టేన్లి జె. ఓట్ పీఠాధిపతులిద్దరు మేత్రాసన ఉన్నత స్థాయిలో సామాన్య క్రైస్తవుల భాగస్వామ్యపు పాలన ఉండాలని కోరుకున్నారు.

మూడింటా రెండు వంతుల ప్రజలు, ఇక్కడున్న (సభలో) పీఠాధిపతులకన్నా వయసులో చిన్నవారు, రేపటి నాయకులు, అందరూ యవ్వనస్థులే! కనుక, సామాన్య క్రైస్తవుల ప్రేషితకార్యంలో యువత పాత్రను నొక్కి చెప్పాలి.

కతోలికేతరులతోను, క్రైస్తవేతరులతోను సంభాషణలు సామాన్య క్రైస్తవుల ప్రేషితకార్యంలో ముఖ్యమైన భాగం; ఈ విషయంలో మన ప్రజలు ఇవ్వటమేగాక, పరస్పర వినిమయంలో స్వీకరిస్తారు కూడ."

"మోంట్రియల్కు చెందిన కార్డినల్ పౌల్–ఎలిమి లెజెర్ అన్నట్లు: "శ్రీసభలో గురువర్గ సిద్ధాంతం భ్రష్టుపట్టిన ప్రథమ చెడుపు. శ్రీసభ గురించి సాధారణ క్రైస్తవుల ఉత్పాదకాలు (inputs) లేకుండ, తమ సొంత అధికారభృతి కోసం గురుకులం గురుకులంతోనే చర్చలు జరిపి, నిర్ణయాలు తీసుకోవటం సమజసంగా లేదు. ఇటువంటిది గురు వర్గ సంస్కృతిని శాశ్వతీకరిస్తుంది (perpetuates).

పీఠాధిపతి ట్రేసి ఓ రకంగా ప్రవక్తే! "శ్రీసభలో సామాన్య క్రైస్తవులు తమవంతు పాత్రద్వారా గుర్తించదగిన, విశిష్టమైన మార్పు తీసుకురాగలరని... నాయంతట నేను చెప్పగలిగిన విషయమేమంటే – క్రీస్తు ప్రేషితకార్యంలో సామాన్య క్రైస్తవుల పాత్ర గురించి ఒక "హక్కుల పత్రం" (Magna Carta) స్థాపితమౌతుందని ఆశిస్తున్నాను," అని ముందుచూపు కలిగిన వ్యక్తి అతడు. అతడు తన నమ్మకాన్ని భవిష్యత్తు మీద ఉంచేవాడు.

"యువతరం వారు ఇప్పటికే దాపరికంలేని ఉత్సాహంతో ప్రపంచంలోకి అడుగుపెట్టి ఉన్నారు. వారు పనికిరాని పద్ధతులకుగాని, పాత విధానాలకుగాని ముడిపడి లేరు. నేటి మన శ్రీసభ మతోత్సాహానికి తగిన విధంగ వారికి చక్కని ఉపదేశం చేసినట్లయితే, ఈ మహాసభలో అటువంటి పత్రం ప్రవేశ పెట్టినట్లయితే. ఒక నూతన క్రైస్తవతరం ఉద్భవించగలదని మనం మంచిగా ఆశించవచ్చు. ఆవిధంగా వారు తమ ప్రేషితకార్యంను కొనసాగించటానికి, వారి జీవన సరళిలో క్రీస్తు ఉనికిని ఆశతో పొడచూపగలరు" అని నివేదించారు.

మహాసభ తరువాత రెండు తరాలవరకు సామాన్య క్రైస్తవులు విచారణలలోను, మేత్రాసన స్థాయిలలోను పని చేయటానికి శ్రీసభలో తమ స్థానాలను పూరించి, నిలుపుకున్నారు. ఈ విషయంలో పీఠాధిపతి ట్రేసిగారి భవిష్యజోస్యం నిజమని నిగ్గుతేలింది. నేటి దైవపిలుపుల కొరత మూలంగ పని కుంటువడకుండ, అనేకమంది సామాన్య క్రైస్తవులు, వారి పూర్తి సమయం వెచ్చించకపోయినా, జరగవలసిన ప్రేషితకార్యాన్ని జరిపించి, శ్రీసభ ఉనికిని కాపాడారు.

"ఒక్క అమెరికాలోనే 40,000 మంది శ్రీసభ సంబంధ సామాన్య ఉపచారికులు పనిచేస్తున్నారు. అందులో 80 శాతం స్త్రీలే" నని వార్తా నివేదిక తెలుపుతుంది.

నేటి మన శ్రీసభలో సామాన్య క్రైస్తవుల పాత్ర ఆమోఘం – ఇది ద్వితీయ వాటికన్ యొక్క శక్తిగల బహుమతనే చెప్పాలి. సాధారణంగా, ప్రవక్తలకు పూర్తి ఆవిష్కరణ ఉండదు. అలానే పీఠాధిపతి భవిష్యత్తులో కాలమార్పుల వలన, కాలక్రమీన స్వేచ్ఛ, నిష్కపటం మాయమౌతాయని అనుకోలేదు. సభ ఆశలు అడుగంటిపోయాయి, చాలా మంది కతోలికులు శ్రీసభను వీడి వెళ్లిపోయారు. ద్వితీయ వాటికన్ సభ

దర్శనం యెడల ఉండవలసిన విశ్వాసనీయత, అమలుపరచాలన్న ఉత్సాహం నీరుగారి, కష్టతరంగా మారింది.

మన శ్రీసభ గాయాన్ని మాన్పుటలో మొదటగా “సత్యపథం – సఖ్యపడుట” అన్న ప్రక్రియను నడిపించుటకు భిన్నమైన సామాన్య క్రైస్తవ బృందాలు తరలిరావాలి. ప్రస్తుతానికి ఇదొక్కటే మార్గం. ఈ రకమైన నడిపింపుకు సామాన్య క్రైస్తవుల పాత్రకు గట్టి పునాది శ్రీసభ చట్టంలోను, కతోలిక శ్రీసభ సత్యోపదేశంలోను, ద్వితీయ వాటికన్ పత్రాల్లోను, జగద్గురువు ఫ్రాన్సిస్ ఉద్ఘాటనందు, అమెరికా కతోలిక పీఠాధిపతుల సమాఖ్యయొక్క జాతీయ సమీక్ష మండలిలోను (Board) ఉంది.

- శ్రీసభ చట్టం, కతోలిక శ్రీసభ సత్యోపదేశం ఇలా వివరిస్తున్నాయి: “తమకున్న పరిజ్ఞానం, సామర్థ్యం, విశిష్ట ప్రతిభ ప్రకారం సామాన్య క్రైస్తవులు శ్రీసభ సంక్షేమానికి సంబంధించిన విషయాల పట్ల తమ అభిప్రాయాన్ని తమ కాపరితో వ్యక్తంచేసే హక్కు ఉంది. హక్కు మాత్రమేకాదు అవసరమైన వేళ అది తమ బాధ్యత కూడాను. సాటి క్రైస్తవులకు తమ అభిప్రాయాన్ని తెలిపే హక్కు ఉంది. అయితే – విశ్వాస పరిరక్షణ, నైతిక జీవనం దృష్టిలో ఉంచుకొని, తమ కాపరిపట్ల గౌరవం చూపుతూ, ఉమ్మడి శ్రేయస్సుకు, వ్యక్తుల గౌరవానికి భంగం కలగనీయకూడదు.” (శ్రీసభ చట్టం 212 & 3, CCC 907).

- ద్వితీయ వాటికన్ మహాసభ, లోకానికి వెలుగు శ్రీసభ (అధ్యాయం 4: 33), అధికారం, గుర్తింపు, శ్రీసభ ప్రేషిత కార్యాలను ఇనుమడింపజేస్తూనే విశ్వాసుల, ఉపాధ్యాయుల బాధ్యతను కూడ స్పష్టపరుస్తుంది: “శ్రీసభ పనిని సామాన్య క్రైస్తవుల ఆదర్శ జీవనం ద్వారానే చేయగలిగిన సందర్భాలలో, సామాన్య క్రైస్తవ విశ్వాసులు అందుకు తగిన విధంగా స్పందించాలి... శ్రీసభ స్థానే తాము ’లోకానికి ఉప్పు’ గా జీవించాలి.”

- ఇంకను “లోకానికి వెలుగు శ్రీసభ” (అధ్యాయం 4:37) వక్కాణిస్తుంది: “... లౌకిక వ్యవహారాలలో జ్ఞాన సంపన్నులు, ప్రతిభావంతులు, వివిధ రంగాలలో ఆరితేరిన నిపుణులైన సామాన్య క్రైస్తవులు శ్రీసభ ... సమగ్రాభివృద్ధికి సంబంధించిన అంశాలలో తమతమ అభిప్రాయాలను గురువర్గంతోను, సాటి

విశ్వాసు లందరితోను పంచుకోవాలి. చట్టపరంగా వారికి ఆ అధికారం ఉంటుంది. కొన్నిసార్లు వారు విధిగా నిర్వహించ వలసిన బాధ్యతకూడ అవుతుంది. అలా చేయునపుడు శ్రీసభ స్థాపించిన సంస్థలనే వేదికగా చేసికొని, వెల్లడించాలి. ఈ వ్యక్తీకరణలన్నీ సత్యానికి, ధైర్యానికి, ఆత్మసంయమనానికి కట్టుబడి ఉండాలి. క్రీస్తు స్థానంలో ఉండే అధిష్ఠానానికి గౌరవం, సుహృద్భావం, ప్రేమను చూపాలి.

- జగద్గురువు ఫ్రాన్సిస్‌గారు బోధిస్తు, "మన శ్రీసభలో గురువర్గంలోగల అవక్షేపాలు (మడ్డి) పోవాలంటే – పీఠాధిపతులు, గురువులు సామాన్య క్రైస్తవులను ప్రార్థనా పూర్వకంగా ఆలకించడం అవసరమే అయినా, అది మాత్రమే చాలదు. రూపకాలను ఉపమానాల్లోకి మార్చగలిగినట్లు, గురుకులం ప్రత్యేకతతో మురుకిదేరిన చట్టాల వ్యవస్థీకృతమైన 'పాతతిత్తుల' లోకి 'కొత్త ద్రాక్షసారాయి' అయిన శ్రీసభ సమాఖ్య సదస్సీయతను (synodality) నింపలేము. కావలసినదేమంటే – అన్ని స్థాయిల్లోను శ్రీసభ పాలనా యంత్రాంగం సహాయసహకారంతో, విలువైన సంస్కృతినందు మెలగాలి." ('లైంగిక దాడుల సంక్షోభంలో అధికారిక, గురువర్గ పాత్ర గురించి దైవశాస్త్ర నిపుణుల విచారణ,' డెన్నిస్ సదొవిస్కి, కేతలిక్ న్యూస్ సర్విస్, మార్చి 27, 2019 నుండి జగద్గురువు ఫ్రాన్సిస్గారు ఉటంకించారు.)
- అమెరికా కతోలిక పీఠాధిపతుల సమాఖ్య నెలకొల్పిన జాతీయ సమీక్ష మండలి, "శ్రీసభ స్పందించేలా సహాయం చేయడానికి సామాన్య క్రైస్తవులు ధైర్యంతో కూడిన నాయకత్వం వహించి, ముందుకు రావలసిన సమయం ఆసన్నమయింది. అలానే పీఠాధిపతులు మా సిఫారసులను జాగ్రత్తగా వినగలగాలి. శ్రీసభ గురించి, మరీ ప్రత్యేకంగా ఘోరమైన లైంగిక దాడులవలన గాయపడిన బాధితులు/ బ్రతికి బయటపడ్డవారు, వారి కుటుంబాల గురించి ప్రార్థన చేయడమేగాక, శ్రీసభలో దైహిక సమస్యల ఆధారంగనున్న లైంగికదాడుల సమస్యలయెడ నిర్దిష్టమైన చర్యను తీసుకోవాలి" అని అభిప్రాయపడింది. (ఆగష్టు 28, 2018)

"సామాన్య క్రైస్తవులు సాక్షాత్తు ప్రభుక్రీస్తుకు స్వంతమైన యాజకధర్మాన్నీ, బోధక

ధర్మాన్నీ, రాజధర్మాన్నీ పంచుకోగలుగుతున్నారు. ఈ త్రివిధ ధర్మాల కారణంగానే సామాన్య క్రైస్తవులకు ఇటు శ్రీసభలోను, అటు ప్రపంచంలోను ప్రభువు నిర్దిష్టమైన బాధ్యతను (అపోస్తలిక ధర్మాలను) అప్పగిస్తున్నారు." (ద్వితీయ వాటికన్ మహా సభ 1965, పత్రం – "సామాన్య క్రైస్తవుల ప్రేషితకార్యం" అంశం 2 నుండి).

జీవిత అనుభవాల వైవిద్యం మీద ధ్యానించినట్లయితే, సామాన్య క్రైస్తవుల మధ్యగల నైపుణ్యాన్ని గమనిస్తే,

"సత్యపథం – సఖ్యపడుట" అనే సమాఖ్య పాలనను సామాన్య క్రైస్తవుల అధికారానికి అప్పగించాలని గట్టిగా అనిపిస్తుంది. ప్రత్యేకంగా, సామాన్య కతోలికులు కతోలిక గురువర్గ చేతులలో ప్రతికూలతను ఎంతగానో సహించి, మన్నించగల శక్తిని సంపాదించుకొన్నారు. వారే అత్యుత్తమంగా అర్హతను పొందిన అపోస్తలులు, "సత్యపథం – సఖ్యపడుట" క్రమంలో పాల్గొన అర్హులు.

గురువర్గ లైంగిక దాడులకు గురియైన బాధితుల/బ్రతికి బయటపడ్డవారి న్యాయసమ్మతిని, విశ్వాసనీయతను చూరగొన్నవారు సామాన్య క్రైస్తవులేగాని, శ్రీసభ అధికారక్రమం ఎంతమాత్రం కాదనే చెప్పాలి. ఇంకను గురువర్గం వలన దాడులకు బలియైన బాధితులకు న్యాయం చేకూరుటకు సమర్థత, అనుభవంగల నిపుణులను అనేకమందిని పిలిపించి, తగిన విధంగా పథకం వేసి, అమలుపరిస్తే "సత్యపథం – సఖ్యపడుట" మండలి ఫలవంతం కాగలదు.

మరీ ముఖ్యంగ, ఏరకమైన న్యాయచట్టమైనా, హాని చేసినవారుగాని, వారి మద్దతుదారులుగాని బాధితులపై ఎటువంటి తీర్పు చేయకూడదని గంటాపథంగా చెబుతుంది. 1995 లో విశ్వాస వ్యాప్తికొరకున్న జగద్గువుల పరిపాలనా శాఖ ప్రకారం, "గురుత్వం అన్నది సేవకేగాని, అది ప్రత్యేక హోదా కానేకాదు, పైగా ఇతరులమీద మానవ అధికారాన్ని వినియోగించుటకు అసలేకాదు."ఈ యథార్థ సిద్ధాంతం శ్రీసభయొక్క గురువర్గక్రమాన్ని హెచ్చరిస్తు, సత్యంనుండి, లైంగిక దాడులకు గురియైన బాధితుల ఆరోగ్యరక్షణను పర్యవేక్షించు క్రమంనుండి వైదొలగిస్తుంది.

సత్యపథం–సఖ్యతను అందుకోవడంలో వ్యవస్థీకృతమైన శ్రీసభ తలక్రిందులుగా

ఉందని చాలామంది సామాన్య క్రైస్తవులు నమ్ముతున్నారు. అక్టోబరు 17, 2018 నాడు CBS లెక్కల ప్రకారం – 25% పైనే కతోలికులు శ్రీసభను వీడిపోయారు. వారిలో చాలామంది చెప్పేదేమంటే: "సంస్కరణను పీఠాధిపతుల, మేత్రాసన పాలకుల చేతులలో పెట్టినందువల్లనే వారికి అసంతృప్తి కలిగించింది." (CBS: కొలంబియా బ్రాడ్కాస్టింగ్ సిస్టమ్) నమ్మదగిన, న్యాయమైన, పారదర్శకత, సానుభూతులతో కూడిన సత్యపథం – సఖ్యపదుక్రమం, స్పష్టపరచు రీతులను పర్యవేక్షించే విధానం పీఠాధిపత్యం ఏనాడో కోల్పోయింది. అసలు అది ఎప్పుడైనా సముచితంగా ఉండిందా? ద్వితీయ వాటికన్ పీఠాధిపతులను ఏమి చేయమందో, దానిని చేయాలని మేము ఆశిస్తున్నాం. అదేమన, సామాన్య క్రైస్తవులను గుర్తించి, దన్నునివ్వాలి. బాప్తిస్మం ద్వారా బలపడిన వారికి శ్రీసభ నాయకత్వంలో బాధ్యతాయుతమైన సహకారులుగా నుండ భాగస్వామ్యంను పంచుకోవాలి.

## సువార్తా పరిచారకులుగా సామాన్య క్రైస్తవులు

17 సంవత్సరాల క్రితం రెండవ జాన్ పౌల్ జగద్గురువు "రక్షణ సువార్తా పరిచారకుల ప్రేషితకార్యం" అనే విశ్వలేఖలో ఈ విధంగా వ్రాసారు – "కొన్ని విచారణ సంఘాల పుట్టుక సామాన్య స్త్రీపురుషుల వలన జరిగిందని గుర్తించి, అది వాటి గౌరవ సూచకమని గ్రహించడం ఎంతో అవసరం. అయితే, క్రొత్త విచారణ సంఘం దివ్యసత్ప్రసాదం అగత్యం కనుక, గురువుల పరిచర్య అవసర పడుతుంది. అతడు ఆ పరిచర్యను వివిధ రకాలైన విధానాలలో కొనసాగిస్తాడు. వాటిలో అభిషిక్తేతర పరిచర్యలు క్రైస్తవ విశ్వాసులందరు చేయదగిన పనులే!"

నిజానికి, సామాన్య క్రైస్తవుల సువార్తా పరిచర్య పురాతనం నుండి వేరులూనుకున్న కార్యం. 12వ పయస్ జగద్గురువు ఆది క్రైస్తవులలో సామాన్య సువార్తా పరిచారకులు పోషించిన పాత్రను గుర్తుచేస్తు, తనను వింటుంన్న సామాన్య శ్రోతలను ఆది క్రైస్తవులవలె చేయాలని ప్రోత్సహించారు. "సువార్త మహా రోమీయుల బాటలను పట్టి, అక్కడి వారిని వెంబడించిందని అందరికి తెలుసు. ఈ ప్రచారాన్ని కేవలం పీఠాధిపతులు, గురువులు మాత్రమే గాక, ప్రభుత్వ అధికారులు, సైనికులు, సాధారణ పౌరులు కూడ చేసారు" అని వ్రాసారు. (ఎవన్జేలిఇ ప్రేకొనెస్, 1951)

## అంతర్జాతీయ కతోలిక చైతన్య వేదిక యొక్క 6వ సామాన్య సభలో పరిశుద్ధ జగద్గురువు 16వ బెనెడిక్ట్‌గారు ఇచ్చిన సందేశం

శ్రీసభలో సామాన్య ప్రజల పాత్రను గమనిస్తే, వారి సహబాధ్యతా విషయంలో ఆలోచనా ధోరణి మారవలసి ఉంది. గురుశ్రేణితో వారు కలిసి, పనిచేసే వారిగా భావించకూడదు, కాని, శ్రీసభ ఉనికినందు, దాని పనిపాటులలో వారిని సహబాధ్యతగల ప్రజలుగా గుర్తించాలి. అందుచేత, పరిపక్వత చెందిన, దీక్షవహించిన సామాన్య క్రైస్తవులుగా వారిని బలపరచుకోవలసిన అవశ్యకత ఉంది. అప్పుడు వారు శ్రీసభ సువార్తా పరిచర్యకు ప్రత్యేక సహాయాన్ని అందించగలుగుతారు. శ్రీసభలో ఎవరి పాత్ర వారు పోషిస్తు, ఎంతో గౌరవంతో పరిచర్యలను, పనిపాటులను చేయగలుగుతారు. అలానే, తమ పీఠాధిపతులతో సహృదయంతో సదా కలిసిమెలసి ఉంటారు.

ఈ విషయంలో కతోలిక సిద్ధాంత పరమైన నిబంధనా స్మృతి లోకానికి వెలుగు శ్రీసభ "సుపరచిత" అనే విశేషణంతో సామాన్య క్రైస్తవులు – కాపరుల మధ్య సంబంధబాంధవ్య శైలిని వర్ణిస్తుంది: "గురువర్గానికి సామాన్య క్రైస్తవులకు మధ్య వర్ధిల్లే అంతరంగిక సంబంధం వలన పరస్పర సహకార ధోరణుల వలన – శ్రీసభకు అనేకరకాల ప్రయోజనాలు వొనగూరే అవకాశం ఉంది. శ్రీసభలో తమ స్థానమేమిటో, తమకున్న బాధ్యత లేమిటో సామాన్య క్రైస్తవులకు స్పష్టంగా తెలియవస్తుంది. వారు ఉత్సాహంగా తలపెట్టే పనులకు తగిన ప్రోత్సాహం లభిస్తుంది. గురువర్గంతో కలసి ఉమ్మడి కార్యాచరణకు పూనుకోడానికి సామాన్య క్రైస్తవులు గతంలో కంటె అధికంగా చొరవుచూపుతారు. అలానే – అనుభవజ్ఞులైన సామాన్య క్రైస్తవుల సహకారం వలన పీఠాధిపతులు, గురువులు ఆధ్యాత్మిక లౌకిక వ్యవహారాలలో స్పష్టమైన, న్యాయబద్ధమైన నిర్ణయాలు చేయగలుగుతారు. ఏకపక్ష నిర్ణయాల వలన కలిగే పొరపాటులను అధిగమించ గలుగుతారు. ఈ విధంగా అన్నివర్గాలవారు చైతన్యవంతులు, శక్తిమంతులు కావడం వలన, వారి సంఘటిత కృషి కారణంగా శ్రీసభ యావత్తు తనచైతన్యాన్ని పొందుతుంది, ... "(అంశం 37)".

ప్రియ స్నేహితులారా! "విశ్వసించిన వారందరు ఒకే మనసుతోను, ఒకే హృదయంతోను జీవించుచుండిరి" (అ.కా. 4:32) వాక్యాన్ని దృవీకరణ చేస్తూ,

జీవించిన తొలి క్రైస్తవుల వ్యక్తిత్వం ప్రకారం గాఢమైన సమ్మేళనా జీవితాన్ని శ్రీసభలో గడుపుటకు మనం లోతుగా దానిని అధ్యయనం చేయుట ముఖ్యం.

శ్రీసభ సువార్తా పరిచర్య నిమిత్తం పనిచేయుటకు కావలసిన అంకితభావం మీస్వంతమేనన్న ఆలోచనను కలిగుండాలి. ప్రపంచం యెడల సావధానమైన సకారాత్మక దృష్టిని పెట్టి, శ్రీసభ జీవనంలో కాల గుర్తులను సదా వెదుకుతూ, చురుకుగా పాల్గొనాలి. తమనుతాము మలచుకొనుటలో ప్రతిదినం గట్టిగా ప్రయత్నించుట ద్వారా సామాన్య క్రైస్తవులుగా నుండ పిలువబడిన ఆ ప్రత్యేక పిలుపు యొక్క అంశాలను చక్కగా శుద్ధిచేయుటకు అలసిపోకం డి. ఆ విధంగా మీరు అన్ని సామాజిక పరిస్థితులలో ధైర్యంగాను,  విశ్వసనీయమైన సాక్షులుగా నిలువగలుగుతారు. అపుడు, సాధారణంగా ఈ ఆధునిక కాలపు జీవన యాత్రలో ఎదురయ్యే చిక్కులకు, సమస్యగా తయారైన వారికి, కష్టతరమైన చీకటి పరిస్థితులలోను సువార్తా వెలుగు ఆశను చిగురింపజేస్తుంది.

క్రీస్తును కలుసుకొనుటకు, ఈ మన కాలంలో అర్థవంతంగాను, వివిధ భాషలలో ప్రభుని రక్షణ సందేశాన్ని అందించుటకు ప్రజలను మార్గదర్శక సూత్రాలతో నడిపించాలి. అందునా నేటి సమాజంలోను, సంస్కృతిలోను వచ్చే మార్పులు అతి శీఘ్రగతిన ఉండుటవలన, అవి నూతన సువార్తీకరణకు పెను సవాళ్లుగా నిలుస్తున్నాయి.

శ్రీసభకు సేవచేయుటలో మీరు ఉదారస్వభావంతో పట్టు విడువకూడదని నేను మిమ్ములను  ప్రోత్సహిస్తున్నాను.

శ్రీసభ అపోస్తలిక ఉద్దేశ్యాన్ని పరిపూర్తిగా గ్రహించి, విశేషానుగ్రహంతో పరిపూర్ణ ఆకర్షణతో జీవింపుడు. విశ్వశ్రీసభ–స్థానికశ్రీసభల మధ్య ఫలవంతమైన సమతుల్యతను కలిగి ఉండండి.  అలానే, పేతురుని వారసునితో (జగద్గురువుతో) ఆత్మనందు సన్నిహిత బంధం కలిగుండండి.  అదేవిధంగా, మీ స్వంత కాపరులతో చురుకైన సహబాధ్యతను పంచుకొనండి.  (చూడుడు: “సామాన్య క్రైస్తవుల అపోస్తలిక పరిచర్య” అంశం 20) నేటి పరిణామదశ చరిత్రలో శ్రీసభ సాంఘిక అధ్యాపనాధికారపు (Magisterium) వెలుగులో ఎక్కువగా ప్రాపంచీకరణ వరవడిలో ప్రేమ–సేవలను చేయ ప్రయత్నిస్తుంది. సంపూర్ణ శ్రీసభతో ఎదుగుటకును, ఉమ్మడి బాధ్యతలో మానవాళికి భవితపై నమ్మకంను అందించుటకును, వత్తిడిగల ప్రతిపాదనలకు ధైర్యంతో తగిన సూత్రాలను

ఏర్పరచుకొనుటకు దోహదపడుతుంది. కతోలిక పనిపాటులతో మీకున్న సహవాసం క్రీస్తుకు, సువార్తకు ధైర్యంతో కూడిన మీ సాక్ష్యాలకున్న ఫలవంతమైన సుదీర్ఘ చరిత్రను గొప్పగా చెబుతుంది. అటువంటి వారిలో కొందరిని ధన్యులుగాను, పునీతులుగాను శ్రీసభ గుర్తిస్తుంది. వారి అడుగుజాడలలో, పవిత్ర పథమందు అంకితభావంతో నడచుటకు ఈరోజు మీరు పిలువబడ్డారు. ప్రార్థనా జీవితంలో గాఢతను పెంచుకొంటూ వ్యక్తిగత విశ్వాసపు పద్ధతలను గౌరవంతో ప్రోత్సహించుకొంటూ ప్రతి ఒక్కరి విలువను ఇనుమడింపజేస్తు మీ ఆధ్యాత్మిక మార్గచూపరుల లేక శ్రీసభ ఉమ్మడి బాధ్యతలను నేర్పించగల బాధ్యతాయుత వ్యక్తుల మార్గదర్శకాలను తీసుకొనండి. మీ జీవితాలు సువార్తకు అనుగుణమైన పారదర్శకతను కలిగి, క్రీస్తును సందర్శించుట ద్వారా ఉద్దీపన పొంది, భయంలేని ప్రేమతో అతనిని అనుసరించండి.

మేత్రాసన, విచారణ స్థాయిల్లో మీరే సొంతంగా కాపుదల విషయంలో నిర్ణయాలు తీసుకొని, ఇతరులకు తెలియజేయండి. సమావేశాలకు అవకాసాలను సృష్టించుకొంటూ, నిజాయితీగా ఇతర ప్రాంత సంఘాలలోని సభ్యులను కలుసుకొంటూ ఉన్నట్లయితే, గురువుల పరిచర్యలోను, సంఘ పరిచర్యలోను ప్రతిష్ఠాత్మక సంబంధం, సమ్మేళనను సృష్టించిన వారవుతారు. ప్రతీ ఒక్కరితో వ్యక్తిగతమైన, స్వచ్ఛమైన సంబంధాన్ని కలుపుకొండి. మొదట కుటుంబంతో మొదలుపెట్టి, సాంఘిక, సంస్కృతిక, రాజకీయ స్థాయిలన్నిటిలోను సామాజిక మంచికోసం సంసిద్ధతను తెలుపుతూ పాల్గొనండి.

ఈ కొలది సలహాలతో నా ప్రార్థనలో ప్రేమపూర్వకంగా మిమ్ములను గుర్తించుకుంటానని మాటయిస్తు, మీ కొరకును, మీ కుటుంబాల కొరకును, మీ సంఘాల కొరకును, ఈ సభలో పాల్గొన్న వారందరికిని నా ఆశీస్సులను అందజేస్తున్నాను. ఈ దీవెనలను మీ అపోస్తలిక పరిచర్యలో కలిసేవారందరికి అందజేయండి.

## సామాన్య క్రైస్తవ విశ్వాసులు ఎవరు?

9. సామాన్య సభ (Synod) పితృపాదులు సామాన్య క్రైస్తవుల పరిచర్యకు సకారాత్మక పదాలతో సరియైన నిర్వచనం సూచించాలని కోరుట సమంజసమే.

ద్వితీయ వాటికన్ మహాసభ బోధనలు, ఇటీవల కాలంలో వచ్చిన అధ్యాపనాధికారపు పత్రాలు, పవిత్రాత్మ నడిపింపులో జీవించిన శ్రీసభ అనుభవాలనుండి లోతైన అధ్యయనం చేసి, ఆ నిర్వచనం తయారు చేయుమని కోరారు. [13]

ఆ కోరిక మేరకు స్పదిస్తూ, "సామాన్య విశ్వాసులు ఎవరు?" అనే ప్రశ్నకు జవాబును ఇస్తూ, గతంలో చేసిన చాలా రుణాత్మక వివరణలను దాటివెళ్లారు. అందుచేత, సకారాత్మక దృష్టి దానికదే విచ్చుకొని, ఒక మౌలిక ఉద్దేశం బయల్పడింది – సామాన్య విశ్వాసులు శ్రీసభకు, దాని పరమ రహస్యానికి పూర్తిగా చెందినవారని. అదే సమయంలో శ్రీసభ సామాన్య క్రైస్తవుల పిలుపుకు అద్వితీయమైన లక్షణం ఉందని నొక్కి వక్కాణించారు.

"ఈలోక సంబంధ విషయాలలో ఉంటూనే, వాటిని దేవుని పథకం ప్రకారం తీర్చిదిద్దుటలో దైవరాజ్యాన్ని వెదకుటన్నది ఓ ప్రత్యేక వరవడిగా కనిపిస్తుంది." [14] "సామాన్య విశ్వాసులు" అనే పదబంధకాన్ని "లోకానికి వెలుగు శ్రీసభ" అనే శీర్శికన విడుదలైన శ్రీసభపై నిబంధనలో కనిపిస్తుంది. "పవిత్ర పట్టములు పొందిన వారు తప్ప, విశ్వాసులందరు, శ్రీసభచేత అంగీకరింపబడిన ధార్మిక జీవనదశలో ఉన్నవారు, ఈ సామాన్య క్రైస్తవుల కోవకు చెందినవారౌతారు. బప్తిస్మం ద్వారా సామాన్య విశ్వాసులు క్రీస్తుతో ఏక శరీరులుగా తయారయి, దేవుని ప్రజలులో చేరి, స్థిరపడతారు. వీరు స్వవిధానంలో క్రీస్తుని గురుత్వపు, ప్రవక్తపు, రాజరికపు బాధ్యతలలో భాగస్థులవుతారు. శ్రీసభను, ప్రపంచాన్ని గౌరవిస్తు, సమస్త క్రైస్తవ ప్రజలయందు తమవంతు పనిని నెరవేరుస్తారు." [15]

12వ పయస్ జగద్గురువు ఒకసారి ఇలా ఉద్ఘాటించారు: "విశ్వాసులు, కచ్చితంగానైతే, సామాన్య విశ్వాసులు, శ్రీసభ జీవనంలో ముందు వరుసలో ఉంటారు. వారి దృష్టిలో మానవ సమాజానికి శ్రీసభే సచేతన మూలసూత్రం.

కనుక, వారు ప్రత్యేకంగా, శ్రీసభకు చెందిన వారమన్న తలంపు స్పష్టంగా ఉండటమేగాక, వారే శ్రీసభ అన్న తలంపు రూఢిగా ఉండాలి. వివరంగా చెప్పాలంటే – జగద్గురువు, పీఠాధిపతుల నాయకత్వాన విశ్వాసులు ఈ భూమిమీద సంఘంగా ఏర్పడుతారు. అదే శ్రీసభ అంటే..." [16]

ద్రాక్షతోట అనే బైబిలు భావచిత్రం ప్రకారం, సామాన్య క్రైస్తవులు శ్రీసభకు చెందిన ఇతరులతో కలిసి, నిజమైన ద్రాక్షవల్లియైన క్రీస్తుకు అంటుకట్టబడిన రెమ్మలు. ఆ క్రీస్తునుండే జీవం, ఫలసారం ఉద్భవిస్తాయి.

విశ్వాసం, బాప్తిస్మం ద్వారా క్రీస్తులోకి అంతర్భాగం అయినపుడు, అదే శ్రీసభ పరమ రహస్యంలో క్రైస్తవులుగా జీవిస్తారు. ఈ పరమ రహస్యం క్రైస్తవుని ముఖ్య రూపురేఖల్ని ఏర్పరుస్తుంది, వివిధమైన పిలుపులకు ఆధారమవుతుంది, సామాన్య క్రైస్తవుల జీవితాన్ని క్రియాశీలంగా మారుస్తుంది (చూడుము యోహాను 3:5). మరణించి, మృతులలో నుండి జీవంతుడై లేచిన క్రీస్తునందు బప్తిస్మం పొందువారు "నూతన సృష్టి" ని పొందుతారు (గలతీ 6: 15, 2 కొరింతీ 5: 17), దైవానుగ్రహం ద్వారా పాపంనుండి శుద్ధిని పొంది, జీవంలోకి అడుగిడుతారు.

అందుచేత, సామాన్య క్రైస్తవుల గురించిన మౌలిక వివరణ ఎలా సాధ్యమంటే – పరమ రహస్యంలోగల విలువను అంగీకరించుట వలన మాత్రమే బప్తిస్మంలో క్రైస్తవునికి దేవుడు ఆ జీవాన్ని ప్రసాదిస్తాడు.

## యేసుక్రీస్తుని పరిచర్యలో గురుత్వానికి, ప్రావక్తికతకు, రాజరికానికి వారసులు

14. బప్తిస్మంనకు "జన్మించిన నూతన బిడ్డలు"గా పేర్కొన్నప్పుడు, అపోస్తలుడైన పేతురు వ్రాతమూలంగ ఇలా చెబుతాడు: "నిరుపయోగము అయినదిగ మనుజులచే తిరస్కరింపబడి, అమూల్యమైనదిగ దేవునిచే ఎన్నుకొనబడిన సజీవ శిలయగు ప్రభువును సమీపింపుడు. ఆధ్యాత్మిక దేవాలయమును నిర్మించుటలో సజీవ శిలలుగ మిమ్ము ఉపయోగింపనిండు. యేసుక్రీస్తు ద్వారా, ప్రీతికరమైన ఆధ్యాత్మికమగు బలులను దేవునకు అర్పించుటకు మిమ్ము పవిత్రమైన యాజకులుగ చేయనిండు. కాని, మీరు ఎన్నుకొనబడిన జాతి, రాచరికపు యాజకబృందము, పవిత్రమైన జనము, దేవుని సొంత ప్రజలు, దేవుని అద్భుత కార్యములను ప్రకటింప ఏర్పరుపబడినవారు. ఆయనయే మిమ్ము చీకటినుండి అద్భుతమగు తన వెలుగులోనికి పిలిచెను." (1 పేతురు 2:4–5, 9).

బప్తిస్మం నుండి వచ్చే ఘనత, దైవానుగ్రహాల క్రొత్త అంశం ఇక్కడ

ఆవిష్కరింపబడింది. సామాన్య విశ్వాసులు, వారి వంతుగా, గురువు, బోధకుడు, రాజునైన క్రీస్తు త్రివిధ పరిచర్యలో పాల్గొంటారు. శ్రీసభ సజీవ పారంపర్యలో ఈ అంశాన్ని ఎప్పుడునూ మరువలేదు. పునీత అగుస్తీను కీర్తన 26పై వ్రాసిన వివరణ ఈ అంశాన్ని ఇనుమడింప జేస్తుంది: "దావీదు రాజుగా అభిషిక్తుడయ్యాడు." ఆ రోజులలో రాజును, ఆచార్యున్ని మాత్రమే అభిషేకించేవారు.

వీరిద్దరు రానున్న ఏకైక రాజు, గురువు అయిన క్రీస్తుకు ముంగుర్తులుగా ఉన్నారు. (క్రీస్తు అనగా "అభిషిక్తుడు" అని అర్థం) మన శిరస్సు అయిన క్రీస్తు అభిషిక్తుడు అవటమేగాక, అతని శరీరమైన మనంకూడ అభిషిక్తుల్లా గౌరవించబడ్డాము. అందుచేత, క్రైస్తవులందరికి అభిషేకం ఉంటుంది, పూర్వనిబంధనలో అది కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే ఉండేది. స్పష్టంగా మనం క్రీస్తుని శరీరమై ఉన్నాము, ఎందుకంటే, "అభిషిక్తుడైన అతడు" స్వయాన క్రీస్తు. అభిషిక్తులం అయినందున అతనియందు మనం క్రీస్తులం. ఒక రకంగా శిరస్సు శరీరం కలిసి, పరిపూర్ణ క్రీస్తుగా తయారవుతాయి.[19]

ద్వితీయ వాటికన్ మహాసభ ప్రారంభదశలో [20], నా సువార్తా పరిచర్య మొదలుపెట్టినపుడు, దేవుని ప్రజలందరి ఘనతను వారి గురుత్వంలో, ప్రవక్త కార్యంలో, రాజరికంలో గ్రహించుటకు ఉద్రేకంతో గట్టిగా చెప్పేవాడ్ని.

ఈనా ఉద్దేశాన్ని ఈ దిగువ పదాలలో చెప్పాను:"కన్యమరియ ద్వారా జన్మించిన అతడు, అందరు భావించినట్లుగా ఆ వడ్రంగి కుమారుడు, పేతురు సాక్ష్యం పలికినట్లు ఆ సజీవ దేవుని కుమారుడు, మనలను గురువర్గ రాజ్యంగా ఏర్పాటు చేయడానికే వచ్చాడు. ఈ శక్తివంతమైన పరమ రహస్యాన్ని ద్వితీయ వాటికన్ మహాసభ మనకు గుర్తుచేస్తుంది. శ్రీసభలో క్రీస్తు-గురువు, ప్రవక్త-బోధకుడు, రాజు అనే ఈ పరిచర్య కొనసాగుతూ ఉంటుంది. ప్రతి ఒక్కరు దేవుని ప్రజలందరు, ఈ త్రివిధ పరిచర్యలో భాగస్వాములవుతారు."[21]

ఈ ఉద్బోధద్వారా సామాన్య ప్రజలు మహాసభ పత్రాలు బోధించే విషయాలను మరొకమారు తీసుకొని, మరలా పఠించి, ధ్యానించి, జీర్ణించుకొని, పునరుత్సాహంతో అర్థం చేసుకొని, విలువైన - ఫలవంతమైన బోధనలను, క్రీస్తుని త్రివిధ సువార్తా

పరిచర్యలో వారు పాల్గొనుటను గూర్చి తెలిపే విషయాలను గ్రహించుటకు నేను వారిని ఆహ్వానించాను.[22] ఈ బోధనల ముఖ్య సారాంశాలను ఈ దిగువ అందిస్తున్నాను:

సామాన్య విశ్వాసులు గురుత్వపు పరిచర్యలో భాగస్థులు. ఇందు నిమిత్తం యేసు సిలువపై తననుతాను సమర్పించుకొన్నాడు. దేవుని మహిమార్థం, మానవ రక్షణ కొరకు దివ్యబలి వేడుకలో ఆ అర్పణ కొనసాగుతునే ఉంది.

యేసుక్రీస్తులో అంతర్భాగమై, బప్తిస్మం పొందినవారు అతనిలో ఐక్యం చెందారు. అతని బలియర్పణతో తననుతాను తమ దైనందిన క్రియలతో అర్పించుకొంటారు (చూడుము రోమీ 12:1,2). సామాన్య విశ్వాసుల గురించి మాట్లాడుతూ, మహాసభ అంటుంది: “వారి పనులు, ప్రార్థనలు, వారి అపోస్తలిక ప్రయత్నాలు, వారి సాధారణ వైవాహిక కుటుంబ జీవితం, వారి అనుదిన కాయకష్టం, వారి మానసిక – శరీరక సడలింపులు, కష్టతరమైన ఇబ్బందులు – వీటన్నిటిని పరిశుద్ధాత్మ నడిపింపుతోను, సహనంతోను భరించి ఉన్నట్లయితే – అవన్నీ ఆధ్యాత్మిక బలిసమర్పణలుగా క్రీస్తుద్వారా దేవునికి అంగీరమవుతాయి. (చూడుము 1 పేతురు 2:5) దివ్యబలిని కొనియాడు సమయంలో ఈ బలిసమర్పణలను ప్రభుని శరీరంతో జతచేస్తే, తండ్రిదేవునికి ప్రేమపూర్వక అర్పణగా ఉంటుంది. ఈవిధంగా ఆరాధికులుగా, సామాన్య క్రైస్తవుల ప్రతీ చర్య పవిత్రమై, ఈ ప్రపంచాన్నే దేవునికి ప్రతిష్ఠ చేస్తారు.”[23]

క్రీస్తు తన తండ్రి రాజ్యమును ప్రకటించుటకును, అందుకోసం తన జీవితము, వాక్కు ద్వారా సాక్ష్యమిచ్చాడు. క్రీస్తుని బోధనా (ప్రవక్త) పరిచర్యలో సామాన్య క్రైస్తవులు పాల్గొనుట ద్వారా వారు సామర్థ్యం, బాధ్యతలను పొందారు. ఎందుకంటే, విశ్వాసంతో సువార్తను అంగీకరించి, వాక్కును క్రియలను ప్రకటించుటకు, సంకోచం లేకుండా ధైర్యంతో చెడును గుర్తించి, దానిని త్యజించుటకు పొందారు. మహా ప్రవక్త అయిన క్రీస్తుతోను, పవిత్రాత్మతోను ఐక్యమై (లూకా 7:16), ఉత్థాన క్రీస్తుకు “సాక్షులుగా” తయారయినపుడు, సామాన్య విశ్వాసులు శ్రీసభ పారాలౌకికమైన విశ్వాసం యొక్క ప్రశంసా విలువలోను భాగస్థులవుతారు. విశ్వాసపు విషయాలలో ఇది ఎంతమాత్రం దోషం కానేరదు.”[25] వాక్కుయొక్క అనుగ్రహంలో కూడ వారు భాగస్థులవుతారు,

(చూడుము అ. కా. 2: 17–18, దర్శన 19:10). వారి కుటుంబాలలో ప్రతిదినం, సువార్తయొక్క క్రొత్తదనం, శక్తి వెలుగొందునట్లు చేయువారు పిలుపును అందుకున్నారు. ఆవిధంగా "వారి ఇహలోక జీవన విధానంద్వారా" సాంఘిక జీవనంలో, మున్ముందు మహిమాశలను విరుద్ధ వాదనలమధ్య సహనంతోను, ధైర్యంగాను వెల్లడిచేయగలుగుతారు. [26]

సామాన్య క్రైస్తవులు ప్రభువు, విశ్వపతియగు క్రీస్తుకు చెందినవారు కనుక, అతని రాచరికపు పరిచర్యలో భాగం ఉంది. చరిత్రలో ఆ రాజ్యాన్ని వ్యాప్తిచేయుమని అతడే వారిని పిలిచాడు. వారు ఆ రాచరికాన్ని క్రైస్తవులుగా నెరపుతారు. అన్నిటికన్నా మిన్నగా ఆధ్యాత్మిక పోరాటంలో పాపపు రాజ్యాన్ని అధిగమించుటకు వారంతటవారే చూచుకోగలరు (చూడుము. రోమీ 6:12). న్యాయంలోను, ప్రేమ–సేవలలోను తమనుతాము బహుమతిగా తయారుకాగలరు. యేసు – సహోదరీ సహోదరులలోను, అందరిలోను, అంతకుమించి అత్యల్పునిలోను కొలువై ఉన్నాడు (చూడుము మత్తయి 25:40).

ప్రత్యేకంగా, సామాన్య విశ్వాసులు సృష్టిలోగల వాటన్నిటిని ఆదిస్థితికి పునరుద్ధరించుటకు పిలువబడినారు. జీవన అనుగ్రహం వలన పాలింపబడు క్రియాత్మక గుణంతో మానవసమాజపు ప్రామాణిక శ్రేయస్సుగల స్థితికి తీసుకురావాలి. ఉత్థానమైన క్రీస్తు సమస్తమును తనతట్టు ఆకర్షించి, తనతోబాటు సమస్తమును తండ్రి దేవునికి అప్పగించు శక్తివంతమైన పరిచర్యలో వారు పాలివారవుతారు. అప్పుడు దేవుడు ప్రతివారికి సర్వమై, విరాజిల్లుతాడు, (చూడుము 1 కొరింతీ 15:28, యోహాను 12:32).

క్రీస్తుని గురుత్వ, బోధక, రాచరికపు త్రివిధ పరిచర్యలో సామాన్య విశ్వాసులు పాల్గొంటారు. అందుకున్న మూలం బప్తిస్మంయొక్క అభిషేకమే. మున్ముందుకు ఇంకను దానిని పవిత్రాత్మ దృఢీకరణ సంస్కారం బలపరుస్తుంది, దివ్యసత్ప్రసాదం చలనశీలతను కలిగి, నిలద్రొక్కుకొనే శక్తిని ప్రసాదిస్తుంది. సామాన్య విశ్వాసులలో వ్యక్తిగతంగా ప్రతీ సభ్యునికి పాలుపొందే అవకాసాన్ని ఇస్తుంది. ప్రతి ఒక్కరు తమ శక్తిమేరకు ప్రభుని శరీరంగా తయారై, అనేకమందిలో ఒకరుగా ఇమిడిపోతారు. వాస్తవానికి

యేసు తన శరీరం, తన పత్నియైన శ్రీసభపై తన వరాలను కురిపిస్తాడు. శ్రీసభ సభ్యులుగా ప్రతీ ఒక్కవ్యక్తి క్రీస్తుని త్రివిధ పరిచర్యలో భాగస్థులవుతారు. దీనినే పేతురు బప్తిస్మం పొందిన వ్యక్తిని క్రింది విధంగా విర్వచించాడు: "మీరు ఎన్నుకొనబడిన జాతి, రాచరికపు యాజక బృందము, పవిత్రమైన జనము, దేవుని సొంత ప్రజలు" (1 పేతురు 2: 9). ఖచ్చితంగా ఇది శ్రీసభ సమాజం/సత్ప్రసాదం నుండి ఉద్భవిస్తుంది. క్రీస్తుని శ్రీసభ పరిచర్యలో భాగస్థులైనవారు, ఆ జీవిత సహవాసంలో గుర్తింపును పొందుట, ఆవిధంగా అది అభివృద్ధి చెందుట జరగాలి. పునీత అగుస్తీను వ్రాస్తు, "పరమ రహస్య అభిషేకపు సద్గుణంవలన అందరిని 'క్రైస్తవులు' అని పిలుస్తున్నాం. అందుచేత, ప్రతీ ఒక్కరిని 'గురువులు' అని అంటున్నాం. ఆవిధంగా అందరూ ఒకేఒక గురుత్వం నందు సభ్యులై ఉన్నారు" అన్నారు[27]

15. క్రైస్తవ జీవితం యొక్క క్రొత్తదనవే క్రీస్తునందు బప్తిస్మం పొందినవారందరిలోను, దైవప్రజలో సభ్యులైన వారందరిలోను సమానత్వ శీర్శికకు, పునాదికి మూలం. "సభ్యులుగా, క్రీస్తునందు పునర్జన్మ వలన వారు సమాన ఘనతను పంచుకొంటారు. వారు అదే తండ్రి వాత్సల్యపు అనుగ్రహాన్ని, పరిపూర్ణతకున్న అదే విలువను పొంది ఉన్నారు. అందరు సమాన రక్షణను, ఒకే నిరీక్షణను, ఒకే అఖండ ప్రేమ-సేవలను కలిగి ఉన్నారు" [28]. బప్తిస్మం నుండి ప్రవహించు ఒకే ఘనతనుబట్టి, ప్రతీ సామాన్య క్రైస్తవ సభ్యుడు అభిషిక్తులైన పరిచారకులతోను, మఠవాసులైన స్త్రీపురుషులతోను కలిసి, శ్రీసభ పరిచర్య బాధ్యతలను పంచుకుంటారు. కాని, సామాన్య క్రైస్తవులందు ఈ ఒకేఒక బప్తిస్మపు ఘనత, వారి జీవిత విశ్వాసాన్నిబట్టి, వారిని వేరుపరచి, ఎంతైనను, అభిషిక్తమైన గురుత్వపు అంతస్థు నుండిగాని, మఠవాసుల స్త్రీపురుషుల నుండి మాత్రం వేరుపరుపదు. రెండవ వాటికన్ మహాసభ ఈ రకమైన జీవితాన్ని "లౌకిక ధర్మం"గా వర్ణించింది. "లౌకిక ధర్మం సముచితంగాను, ప్రత్యేకంగాను సామాన్య విశ్వాసులదే" [29].

శ్రీసభలో సామాన్య విశ్వాసులకున్న స్థానాన్ని పూర్తిగా, తగినంతగా, నిర్దిష్టంగా అర్థం చేసుకోవాలంటే - తప్పనిసరిగా లోతైన దైవశాస్త్ర సహాయంతో వారి లౌకిక ధర్మాన్ని, రక్షణయొక్క దేవుని ప్రణాళిక, శ్రీసభ రహస్య పరిధిలోనే కుదురుతుంది.

6వ పౌలు జగద్గురువు అన్నారు: "(శ్రీసభ) ప్రామాణికమైన లౌకిక పరిమాణం, తను స్వతఃసిద్ధంగా అంతరస్వభావంను, సువార్తా పరిచర్యను పొందింది. ఇది మనుష్యవతార మెత్తిన దైవవాక్కు యొక్క పరమ రహస్యంలో లోతుగా వేళ్లానుకొని ఉంది. ఇది ఆమె సభ్యుల ద్వారా వివిధ రూపాలలో బహిర్గతమౌతుంది" [30]

నిజానికి, ఈ లోకానికి చెందింది కాకున్నా, శ్రీసభ లోకంలోనే ఉనికిని కలిగి ఉంది (చూడుము యోహాను 17:16). యేసుక్రీస్తుని రక్షణ కార్యాన్ని కొనసాగించుటకు శ్రీసభ పంపబడింది. "శ్రీసభ, దాని సహజ లక్షణం ద్వారా మానవ రక్షణ నిమిత్తం పట్టించుకుంటుంది, అలానే, యావత్తు ప్రాపంచిక వ్యవస్థను పునరుద్ధరణ చేయుటకు జోక్యం చేసుకుంటుంది"[31].

కచ్చితంగా, శ్రీసభ సభ్యులందరు ఈ లౌకిక పరిమాణంలో పాలివారవుతారు. కాని, పవిత్రములైన విధానాలలో... ప్రత్యేక విధంగా, సామాన్య విశ్వాసులు తమ భాగస్వామ్యంలో వారి గుర్తింపు, కార్యాచరణ సొంత విధానంలో ఉంటుంది. ఇది మహాసభ ప్రకారం - యోగ్యంగా, ప్రత్యేకంగా వారిదే అయ్యుంటుంది. ఇంతటి భావజాలం "లౌకిక ధర్మం" అన్న పదబంధంలో ఇమిడి ఉంది[32].

వాస్తవానికి, మహాసభ లౌకిక ప్రపంచంలోనున్న సామాన్య విశ్వాసుల పరిస్థితిని వర్ణించుటలోగల కారణం ఏమిటంటే, వారున్న ఆ పరిస్థితుల్లోనే దేవుని నుండి పిలుపును అందుకున్నారు. "అక్కడ నుండే దేవుడు వారిని పిలిచాడు"[33]. ఈ "స్థలం" ను చైతన్యవంతమైన పరిభాషలో వివరించి, ప్రతిపాదించారు. సామాన్య విశ్వాసులు "లోకంలోనే జీవిస్తారు, వారివారి లౌకిక వృత్తులలో, ఉద్యోగాలలో ఉంటారు. వారు సామాన్యమైన పరిస్థితుల్లో సాంఘిక, కుటుంబ జీవితాలను గడుపుతుంటారు. వాటినుండే వారి జీవన వ్యవస్థ తయారవుతుంది[34].

ప్రపంచంలో వారు సాదాసీదా జీవితాన్ని గడిపే వ్యక్తులుగా అధ్యయనం చేస్తారు, పనిచేసుకుంటారు. నిపుణులుగా, సంఘ సభ్యులుగా, సంస్కృతి పరంగా, మున్నగు వాటిద్వారా స్నేహబంధాలను పెంచుకుంటారు. అయినప్పటికి, మహాసభ వారున్న పరిస్థితులను కేవలం బాహ్యామైన, పర్యావరణపు చట్రంలో ఇమిడిన పనులుగా గాక, యేసుక్రీస్తు నందు నిర్దేశింపబడిన పరిపూర్ణ అర్థంతో కనిపించే వాస్తవాలుగా

పరిశీలిస్తుంది[35]. నిజానికి, "మానవ శరీరం ధరించిన వాక్కు, మానవ సహవాసంలో పాలుపంచుకోవాలని నిర్ణయించుకొని,... అతడు సాంఘిక భవబంధాలు, ముఖ్యంగా కుటుంబ బంధాలు, ఏర్పడే మానవ బంధాలను పవిత్రపరిచాడు. తన స్వదేశంలోగల చట్టాలకు తననుతాను ఉద్దేశపూర్వకంగా సమర్పించుకున్నాడు. తన కాలంలో, స్వస్థలంలో ఉండిన సామాన్య పనివానిగా (వండ్రంగిగా) జీవితాన్ని గడిపాడు" [36].

ఆవిధంగా, ఈ ప్రపంచం క్రైస్తవ పిలుపును ఫలసిద్ధి చేసుకోటానికి సామాన్య విశ్వాసులకు తగిన స్థలంగా, సాధనగా తయారవుతుంది. ఎందుకంటే, క్రీస్తునందు దేవుడు మహిమ పరచుటకే ఈ ప్రపంచం నిర్దేశింపబడింది.

అలా అయితే, మహాసభ సామాన్య క్రైస్తవులకు ఆదేశించిన దైవపిలుపును సరిగ్గాను, విశిష్టంగాను, అర్థపూరితంగాను సూచించిందని చెప్పవచ్చు. ఈ పిలుపు లోకంలో వారికున్న స్థానాన్ని వదలిపెట్టమని కాదు. బప్తిస్మం వారిని లోకంనుండి తీసివేయటానికి ఎంతమాత్రం కాదు. పౌలుడు చెబుతున్నట్లు – ''తాను పిలువబడినవాడు ఉన్న విధముననే ప్రతి వ్యక్తియు దేవుని సహవాసములో నిలిచి పోవలయును" (1 కొరింతీ 7: 24). అందుకు తగ్గట్టుగానే, అతడు లోకంలో ఒకరు ఏరకమైన పరిస్థితిలో ఉంటారో, దానికి సరిపడిన విధానంలోనే ఆ పిలుపును కూడ అప్పగిస్తాడు. వాస్తవానికి, సామాన్య విశ్వాసులు, "వారి ప్రత్యేక విధులను నెరవేరుస్తూనే, సువార్తా స్ఫూర్తి వలన నడిపింపబడతారు, ప్రపంచాన్ని పులియబెట్టి, పునీతం చేస్తారు. ఆవిధంగా, ప్రత్యేకంగా ఈ జీవిత వరవడిలో, ఉజ్జ్వలమైన విశ్వాసం, నమ్మిక, ప్రేమ–సేవలలో ఇతరులకు క్రీస్తును సాక్షాత్కరింపజేస్తారని దేవుడు పిలుస్తాడు" [37]. సామాన్య క్రైస్తవులకు, ఆవిధంగా, లోకంలో చైతన్యంతో జీవించి ఉండుట – మానవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పరంగా మాత్రమేగాక, దైవశ్రీసభల శాస్త్రపరంగా కూడ చైతన్యవంతులై ఉన్నట్లే. వాస్తవానికి, లోకంలో వారున్న పరిస్థితుల్లోనే దేవుడు తన ప్రణాళికను తెలియపరచి, వారి ప్రత్యేక పిలుపుద్వారా "దేవుని రాజ్యాన్ని తమ ఇహలోక వ్యవహారాలలో కనుగొంటూ, దేవుని చిత్త ప్రకారం ఆ వ్యవహారాలను మలుస్తుంటారు" [38]. ఈ కచ్చితమైన ఆలోచనతోనే సమాఖ్య సదస్సులో పితృపాదులు ఇలా అన్నారు: "సామాన్య విశ్వాసుల యొక్క లౌకిక లక్షణాన్ని సామాజికశాస్త్ర భావంబట్టి మాత్రమేగాక,

ప్రత్యేక విధానంలో దైవశాస్త్ర భావంబట్టి కూడ నిర్వచించవచ్చు. 'లౌకిక ' అనే పరిభాషను సృష్టికర్త, రక్షకుడైన దేవుని కార్యపు వెలుగులో అర్థాన్ని గ్రహించాలి. ఆ దేవుడు ఈ లో దానిని వైవాహిక, అవైవాహిక, కుటుంబ, వృత్తి, ఇతర సామాజిక కార్యకలాపాల ద్వారా పవిత్రపరుస్తారని అప్పగించాడు" [39].

శ్రీసభలో సామాన్య విశ్వాసుల స్థానం ఏమిటంటే – క్రైస్తవ జీవితంలో నూతనత్వాన్నిబట్టి, వింగడించిన లౌకిక లక్షణంబట్టి నిర్వచించవచ్చు [40].

సువార్తయొక్క చిహ్నాలను (ఉప్పు, వెలుగు, పులియబెట్టు పదార్థం) భేదభావం లేకుండా యేసు శిష్యులందరికి అన్వయించవచ్చు. కాని, ప్రత్యేకంగా సామాన్య విశ్వాసులకు వర్తిస్తాయి. ఎందుచేతనంటే, లౌకికమైన మానవ సమాజపు వ్యవహారాలలో వారికి పూర్తి భాగస్వామ్యం ఉంటుందిగనుక. కాని, అంతకుమించి, రక్షణను చేకూర్చే సువార్తను ప్రకటించే ఉద్దేశ్యంలో వారి అనుదిన జీవితంలో ఇమిడి ఉంటుంది. వీటిద్వారా నూతనత్వం, సాటిలేని లక్షణాన్ని తెలుపుతుంది.

## యుక్తవయస్కులకు పిలుపు

సామాన్య క్రైస్తవుల అపోస్తలిక పరిచర్య గురించి ద్వితీయ వాటికన్ ఉత్తరువు చెబుతుంది: రూఢిగా చెప్పాలంటే, ప్రతి ఒక్కరు ఆమె/అతడు శ్రమతీసుకొని, వ్యక్తిగతంగా అపోస్తలిక పరిచర్యకు, మరీ ముఖ్యంగా యుక్తవయస్కులుగా సిద్ధంకావాలి. వయస్సు పెరిగేకొలది ఆత్మజ్ఞానం పెరుగుతుంది. తద్వారా ప్రతీ ఒక్కరికి దేవుడిచ్చిన ప్రతిభను కచ్చితంగా విలువ కట్టగలిగి, అదెంతగా ప్రతి ఒక్కరి ఆత్మను సుసంపన్నం చేసిందో తెలుసుకొని, ఇతరుల బాగుకోసం పవిత్రాత్మ కుమ్మరించిన విశేష పరిచర్యానుగ్రహాలను మరింత ప్రభావవంతంగా కార్యాచరణ చేయవచ్చు [30]. ఈ రోజుల్లో సాధారణ స్త్రీపురుషుల యొక్క ముఖ్యమైన లక్షణాలు ఏమిటంటే – శ్రీసభయొక్క యుక్తవయస్కులుగా ఎదిగామన్నది ముఖ్య ఆలోచనల్లో ఒకటి. యుక్తవయస్సు తెలివితేటలు, అనుభవం, జాగృతి, స్వేచ్ఛ, బాధ్యత, సంబంధాలలో పరస్పర అవగాహన వంటివాటిని సూచిస్తుంది. ఏదియేమైనా, ఒకటి మాత్రం నిజం – "శ్రీసభ సభ్యులుగా సామాన్య వ్యక్తుల అనుభవం ఏమిటంటే: పైచెప్పిన సూచనలు యుక్తవయస్కులలో

ప్రతిబింబించలేదని. ఇపుడు ద్వితీయ వాటికన్ మహాసభ ఇచ్చిన ప్రోత్సాహానికి వందనాలు. సామాన్య స్త్రీపురుషులు అదే పరిపక్వమైన పరస్పర ఆలంబనాన్ని వినియోగించుకోవాలని సంవేదన చెందుతున్నారు. ఇతర జీవన శైలినుండి ఏర్పడిన లక్షణాలనుబట్టి వారికి నిజజీవితంలో స్వమార్గ దర్శకత్వం అలవడుతుంది. విశ్వాసాభివృద్ధి కొరకు సామాన్య వ్యక్తులు వివిధ అవకాశాలను వినియోగించుటను మేము గుర్తించాం. "యేసు కడకు విశ్వాసమందు చేర్చుట" అన్నది కనిపిస్తుంది. అతని యందు, అతని పరిచర్యనందు, సాధారణంగా సువార్తా ప్రబోధమని అంటాం, అంకితభావాన్ని దృఢపరచుకొంటుంన్నారు. యుక్తవయస్కులకు సత్యోపదేశ ఉద్యమం కూడ ఉంది. అది వ్యక్తులను ఎదగనిచ్చి, వారి విశ్వాసాన్ని దృఢపరుస్తుంది. ఇంకను కొందరు దైవశాస్త్ర పర్యాలోచనల ద్వారా లోతుగా అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి వారును, ఇతర యుక్తవయస్కులు విచారణలలో సంఘాలకు, సమితులకు నాయకత్వపు స్థానాల్లో ఉంటూ, బాధ్యతలను వహిస్తున్నారు. యుక్తవయస్క క్రైస్తవుల జీవితం, ఎల్లప్పుడు బహిరంగంగా కానరాకున్నా, అప్పుడప్పుడు అది బహిర్గతమవుతుంది. అనుదినం కుటుంబంలో ఇరుగుపొరుగుతో, పాఠశాలలందు, ప్రభుత్వ సంబంధిత స్థలాలలో, పనిపాటలలో క్రైస్తవ విలువలతో జీవించడం కత్తిమీద సాము లాంటిదైనా, క్రైస్తవం పొడచూపుతుంది. ఇది ఆశాజనకమైన చిహ్నం. ఎందుకంటే, దైవరాజ్య నిర్మాణంలో భాగస్థులై, సామాన్య క్రైస్తవులుగా అసమాన ఉనికిని ఈ ప్రపంచానికి చాటిచెబుతున్నారు. "మీరు లోకమునకు వెలుగైయున్నారు ... ప్రజలు మీ సత్కార్యములను చూచి, పరలోకమందున్న మీ తండ్రిని సన్నుతించుటకు మీ వెలుగును వారి యెదుట ప్రకాశింపనిండు" (మత్తయి 5:14-16). దేవుని ప్రజలయిన యుక్తవయస్కుల వ్యక్తిత్వం - క్రైస్తవ జీవితానికి, పరిచర్యకు పునాదియైన బప్తిస్మం, భద్రమైన అభ్యంగనం నుండి జాలువారుతుంది.

## పవిత్ర జీవితానికి పిలుపు

క్రీస్తుయొక్క విశ్వాసులందరు, వారు ఏస్థాయికి చెందినా, ఏహోదాకు చెందినాసరే, ప్రతి ఒక్కరు సమగ్ర క్రైస్తవ జీవనానికిని, ప్రేమ-సేవలందు పరిపూర్ణతను చేరటానికిని పిలువబడినారన్నది జగమెరిగిన సత్యం. ఈ రకమైన పవిత్రత, సాధారణ మానవ

విధానమే అయినా, అది లౌకిక సమాజంలో కూడ ప్రోత్సాహాన్ని అందిస్తుంది (లోకానికి వెలుగు శ్రీసభ, 40). ద్వితీయ వాటికన్ మహాసభ పవిత్రతకు విశ్వమానమైన పిలుపును ప్రకటించింది. ఈ పవిత్రతకు దేవుని పిలుపులో సామాన్య ప్రజలు భాగస్థులగుటయేగాక, పవిత్రాత్మ వరమైన, సాటిలేని అవసరమగు ప్రతిస్పందనకు అది అసమానమైన పిలుపు. సామాన్య స్త్రీపురుషులయొక్క లక్షణం ఏమిటంటే – వారుంటుంన్న జీవన సరళిలోనే పవిత్ర జీవనానికి పిలుపును అందుకుంటారు (లోకానికి వెలుగు శ్రీసభ, 31). ప్రపంచంలో సంభవించే సంఘటనల ద్వారా, ఆధునిక జీవన బహుళత్వంలో, జటిలమైన నిర్ణయాలమధ్య, వివాదాస్పదమైన విలువల మధ్య నలిగిపోయే పరిస్థితుల్లోను, విలువైనది, సున్నితమైనదయిన లైంగిక సంబంధాల మధ్య, చైతన్యత, స్తబ్దతలు, ప్రత్యక్ష – ఏకాంతాలు, ప్రేమ – హానిలమధ్య, సున్నితమైన సమతుల్యతల పరిస్థితులలో ఆ పిలుపు అందుతుంది. ఈ పిలుపుకు సామాన్య ప్రజల స్పందన శ్రీసభ ఆధ్యాత్మిక సంస్కృతికి మరింతగా తోడ్పడుతుంది. ఇప్పటికే దేవునివాక్కు కొరకు సామాన్య క్రైస్తవులు ఆకలిగొని ఉండుటను అంతటా స్పష్టంగా కనిపిస్తుంది. లౌకిక స్త్రీ పురుషులు ఆధ్యాత్మిక నిర్మాణ దిశలో నడిపింపు కొరకు, లోతుగా ప్రార్థనలో పాదుకొనుటకు కావలసిన మార్గదర్శకాల కొరకు ఎదురు చూస్తున్నారు. ఈ రకమైన చైతన్యం అనేక పునరుద్ధరణ ఉధ్యమాలకు దారితీసింది. ఇటువంటి ఉధ్యమాలు విచారణకు సవాల్లుగా నిలుస్తాయి. ఎందుకంటే, విచారణలోనే సామాన్య ప్రజల ఆధ్యాత్మిక అవసరాలు తీరగలవు. ఆది సంఘం (శ్రీసభ) ఏవిధంగానైతే ఒక గృహంలో గుమిగూడేవారో, అలానే తమ నాయకులతో కలిసి, ఒండొరుల ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు గుమిగూడుటకు విచారణ కూడ ఒక గృహంలా ఉండాలి. “వీరు అపోస్తలుల బోధయందును, వారి సహవాసమందును, రొట్టెను త్రుంచుటయందును, ప్రార్థించుటయందును ఎడతెగక ఉండిరి (అ.కా. 2:42). దైవార్చనయందు ఈ ప్రభావం ఉండాలని మేము ప్రత్యేకంగా మీ సావధానాన్ని కోరుకొంటుంన్నాం. హాజరైన వారందరి ఆధ్యాత్మిక జీవనం మీదనే నాణ్యమైన ఆరాధన ఎక్కువగా ఆధారపడుతుంది. పవిత్ర జీవితానికై ఇచ్చిన దేవుని పిలుపునకు సామాన్య స్త్రీపురుషులు స్వయంగా అలవరచుకొన్న విధానం శ్రీసభ సామూహిక ఆరాధనలో కూడ చోటుచేసుకోవాలి. అదే సమయంలో, పవిత్రాత్మ అనుగ్రహించిన వరాలప్రకారం

దైవార్చన వేడుకలో సామాన్య వ్యక్తులు పాల్గొంటుండగా, అభిషిక్తుడయిన యాజకుడు, పాల్గొనేవారి మీద అధ్యక్షత వహిస్తున్నట్లు స్పష్టమౌతుంది, వివిధ రకాలైన సామర్థ్యాలను ఒకేచోటుకు చేర్చి, తండ్రిదేవునికి బహుమతిగా ఇచ్చినట్లు అవుతుంది. సంఘం, ఎదుగుతున్న ఆధ్యాత్మిక జీవనాన్ని, ఏవిధంగా అనివార్యంగా చూపుతుందో, అది కచ్చితంగా పవిత్రాత్మ వరాలను దేవుని ప్రజలమధ్య పంచుకుంటున్నారన్న భావాన్ని వ్యక్తపరస్తున్నట్లు. దీనిని మేము ప్రబలితం చేయ ఆశిస్తున్నాం.

## పరిచర్యకు పిలుపు

పొందిన విశేషానుగ్రహాల, వరాల నుండి, స్వల్ప ప్రయోక్తాలను కూడ కలుపుకొంటూ, శ్రీసభ నిర్మాణానికిని, మానవజాతికి మంచి జరగాలన్న సంకల్పంతో వినియోగించుటకు వారు, ప్రతీ విశ్వాసి, హక్కు బాధ్యతలను కలిగి ఉన్నారు (సామాన్య క్రైస్తవులు,3). బప్తిస్మం, బద్రమైన అభ్యంగం విశ్వాసులందరిని బలోపేతంచేసి, ఏదోఒక రూపంలో పరిచర్యను ఇతరులతో పంచుకోనిస్తాయి. పవిత్రాత్మ వరాలనుబట్టి ఈ పరిచర్యలో పాల్గొనే ప్రత్యేక విధానంలో ఉన్నప్పటికీ, ఆ పనిని పంచుకొన్నప్పుడు, వారు ఒకరితోనొకరు ఐక్యమై ఉంటారు. "ఒక్క శరీరమున అనేక అవయవములున్నవి. ఆ అవయవములన్నిటికి ప్రత్యేకింపబడిన విధులున్నవి. అటులనే మనము చాలా మందిమి అయినను, క్రీస్తుతో ఏకమగుట వలన మనము అందరమును ఒకే శరీరము, ఒక శరీరము యొక్క వేరువేరు అంగముల వలెనే మనము అందరమును పరస్పర సంబంధమును కలిగియున్నాము. దేవుడు మనకు ఒసగిన అనుగ్రహమును అనుసరించి, మనము విభిన్న కృపావరములను కలిగియున్నాము" (రోమీ 12:4-6).

ఈ పరిచర్యలోని ఐక్యత, సామాన్య స్త్రీపురుషులు తమ జీవితాల ద్వారా పవిత్రాత్మ పిలుపుకు స్పందించే విధానం సామాన్య క్రైస్తవులు - యాజకవర్గం సంబంధంలో ప్రస్ఫుటించాలి. యాజకవర్గం పవిత్రాత్మ అనుగ్రహించు భిన్నమైన వరాలను పరీక్షించి, వేరువేరుగా గుర్తించుట ద్వారా, ఆయా వ్యక్తులతో సహకరించి, వరాన్నినిర్ధారించుటలో సాయపడాలి. సామాన్య క్రైస్తవులు - యాజకవర్గం మధ్య ఏకీభావాన్ని అత్యంత ఫలవంతమైన పరిచర్యగాను, ప్రపంచంలో సార్థకమైన సాక్ష్యంగాను మేము శ్లాఘిస్తాం.

## ప్రపంచంలో క్రైస్తవ సేవా పరిచర్య

దైవపిలుపు మూలంగా, సామాన్య క్రైస్తవులు ఇహలోక వ్యవహారాల్లో ఉన్నప్పటికీ, వాటిని దేవుని ప్రణాళిక ప్రకారం తీర్చిదిద్దుతూ, దైవరాజ్యాన్ని కనుగొంటారు (లోకానికి వెలుగు శ్రీసభ, 31). లోకమందు క్రైస్తవ సేవలో సామాన్య క్రైస్తవులు మేలైన విధానంలో ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఒక్కొక్కప్పుడు దీనినే "సామాన్య క్రైస్తవుల పరిచర్య" అని అంటారు. ఆ విధంగా, ఈ పరిచర్య శ్రీసభ అభిషిక్తుల సేవలతో సమానంగా సరితూగుతుంది. సామాన్య క్రైస్తవుల మూలంగ, క్రైస్తవ సేవను లేక సువార్తా పరిచర్యను విస్తృతంగా అర్థం చేసుకున్నప్పుడు పౌరవ్యవస్థను, సమాజాన్ని రెండింటిని అందులో జతచేయడం జరుగుతుంది. ముఖ్యంగా, మనకు తప్పనిసరియైన శాంతిన్యాయాలను నెలకొల్పవలసినపుడు అలానే సాంఘిక, రాజకీయ, ఆర్థిక వివాదాలు, ముఖ్యంగా అవి పేదవారిని, పీడితులను, అల్పసంఖ్యాకులను ప్రభావితం చేసినపుడు, సరిచేయ సంకల్పించినపుడు పరిచర్యలో భాగంగా ఉంటాయి. యావత్తు శ్రీసభ ప్రస్తుత లోకంలో ఇంతకుముందు ఎన్నడూ లేని పరిస్థితులను ఎదుర్కొంటుంది. సామాన్య క్రైస్తవులు ఈ నూతన సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు ప్రమాదపు అంచుల్లో ఉంటారు. వాణిజ్యనీతి, రాజకీయనిర్ణయాలు, ఆర్థిక భద్రత, జీవన నాణ్యత, సంస్కృతిక అభివృద్ధి, కుటుంబ నియంత్రణ వంటి జటిల ప్రశ్నలకు క్రైస్తవ విలువల ఆచరణతో ఎదురొడ్డి, పరిష్కార మార్గాలందు నిమగ్నమౌతారు. నిజానికి, నూతన పరిస్థితులలో, ముఖ్యంగా సాంఘిక న్యాయరంగంలో సృజనాత్మక స్పందన ఎంతో అవసరం. దేవుని ప్రజలందరిలో ఆత్మ ప్రభావం ఉంటుందని మాకు తెలుసు. ఆ ఆత్మ వారిని, వారికున్న ప్రత్యేక వరాలను, బాధ్యతలనుబట్టి ప్రేరేపిస్తూ, కాలచిహ్నాలను గుర్తుపట్టుటకును, సువార్తా వెలుగులో ధైర్యంతో వ్యాఖ్యానించుటకు పురికొల్పుతుంది. సామాన్య స్త్రీపురుషులు ఇటువంటి సేవలను అందించుటలో వారికివారే సాటి. దైవీక సంస్థ, పీఠాధిపతులు, గురువులు, ఉపగురువులు వారి అభిషేకంద్వారా దేవుని ప్రజలను నడిపించుటకు సేవకులుగా అధికారాన్ని ఏవిధంగా పొందియున్నారో, అదే విధంగా, బప్తిస్మం, బద్రమైన అభ్యంగం ద్వారా సామాన్య స్త్రీపురుషులు శ్రీసభ పరిచర్యలో పాలుపంచుకొనుటకు హక్కులను, బాధ్యతలను పొంది ఉన్నారు. ఈ జీవిత విషయాలలో వారు అసమానంగా

తమ ఉనికిని చాటుకుంటూ, వారి ప్రత్యేకమైన ప్రతిభలు, చదువులు, అనుభవాల వలన ఓ ప్రత్యేక సమర్థతను కలిగి, ప్రపంచంలో రక్షణ-శ్రీసభగా విస్తరించి, ఉనికిలో ఉన్నారు. సామాన్యుల హక్కులను-బాధ్యతలను గుర్తించినపుడు, యాజకవర్గం - సామాన్య క్రైస్తవుల మధ్య విభజనను సృష్టించకూడదు. కాని, అది దైవప్రజల యొక్క పలుకుబడి పూర్తి స్థాయిలో ప్రకటింపబడాలి. దీనిని మేము ఆమోదించి, ధృవీకరిస్తున్నాం.

## శ్రీసభలో సువార్తా పరిచర్య

యాజకుడు, బోధకుడు, రాజునైన క్రీస్తు పాత్రలో పాలివారుగా, సామాన్య క్రైస్తవులు శ్రీసభ జీవితంలోను, కార్యకలాపాలలోను చురుకైన భాగమందు పాత్రవహించాలి (సామాన్య క్రైస్తవుల అపోస్తలిక పరిచర్య, 10). ద్వితీయ వాటికన్ మహాసభల నాటినుండి, సామాన్య స్త్రీపురుషులకు శ్రీసభ సేవచేయ క్రొత్త అవకాశాలు వృద్ధిచెందాయి. విచారణ, మేత్రాసన సలహాసంఘాలలోను, విద్యాసమితిలోను, ఆర్థిక, దైవార్చన, క్రైస్తవ శాఖల సమితిలోను పాల్గొను స్వచ్ఛంద పనివారును, వారితోబాటు దివ్యసత్ప్రసాద సంబంధ ప్రత్యేక పరిచారకులు, ఉపదేశకులు, కాపరి సంబంధ సహాయకులు వారి సేవలను కొనసాగిస్తూ, వాటిని ఇనుమడింపజేస్తూ, తమవంతు ఉపచారాలను అందిస్తున్నందుకు వారిని మేము కృతజ్ఞతతో గుర్తిస్తున్నాం. పెద్ద సంఖ్యల్లో, స్వచ్ఛందంగా ముందుకొచ్చి, సువార్తాసేవలో పాల్గొంటున్న సామాన్య ప్రజలకు మేము సదా కృతజ్ఞులం. సామాన్య స్త్రీపురుషులు సంఖ్యా పరంగా అభివృద్ధిచెందుతూ, శ్రీసభలో పనిచేయుటకు వృత్తినైపుణ్యులుగా తమనుతాము తయారుచేసుకొంటున్నారు. ఈ విషయంలో మఠవాసులైన సహోదరీసహోదరులు తమ చొరవ ద్వారా, సృజనాత్మక క్రియలుద్వారా మార్గం చూపారు. క్రైస్తవ పరిచారకులు, అనగా, సామాన్య వ్యక్తులు, శ్రీసభలో వృత్తినైపుణ్యులుగా తయారై, ఒక నూతన అభివృద్ధికి ప్రతినిధులయ్యారు. ఇటువంటి దానిని మేము శ్రీసభకు బహుమానంగా ఆహ్వానిస్తున్నాం. తమ జీవిత ఆదర్శంద్వారా తమనుతాము త్యాగం చేసుకొని, సేవలను అందించడం ద్వారా సక్రమ పాలన, గృహ, ఉద్యోగ, చదువు విషయాలలో పేదలను బలపరచుట ద్వారా శ్రీసభకు సేవలు అందిస్తున్నవారు కూడ ఉన్నారు. ఇటువంటి

సామాన్య పరిచారకులందరు స్పష్టంగా నిర్వచించని పాత్రలనుకూడ చేపట్టి తమను, తమ కుటుంబాలను బలమైన త్యాగాలకు గురిచేస్తూ, ఇరుకున పడేసుకుంటున్నారు. సామాన్య వ్యక్తులుగా క్రైస్తవ పరిచర్యలో పెద్దగా నిమగ్నమవుతున్నారు. దీనిని మేము గుర్తిస్తూ, పదవుల్లో ఉన్నవారి ప్రాప్యత, దరకాస్తులు పెట్టుకున్న అర్హతగలవారి గురించి, బాడుగకు తీసుకొనే క్రమంలోగల విధానాలను, న్యాయమైన కూలి ఏర్పాటు, రాయితీలు వంటి వాస్తవ సమస్య లన్నింటిని పరిష్కారం చేయ మేము బాధ్యతను తీసుకొంటాం. స్త్రీల గురించి ప్రత్యేక ప్రస్తావన చేయవలసి ఉంది – ఇదివరలో శ్రీసభ పరిచర్యలో స్త్రీలను సరియైన పాత్రను తీసుకోనివ్వ లేదు. ఇప్పుడు శ్రీసభ పరిచర్యలో సాధ్యమగునంత ఎక్కువ పాత్రను తీసుకోవలసిన అవస్యకత ఉందని మేము గమనిస్తున్నాం. ఈ విషయంలో ఆందోళనలు, అపార్థాలు ఉబికి వస్తాయని కూడ మేము గుర్తిస్తున్నాం. కాని, వీటిని మేము నిజాయితీతో కూడిన ప్రయత్నంతో ఎదురుపడతాం. మన కాలంలో ఎదురయ్యే సవాళ్లకు జవాబులు లేక స్పందనలు ఆత్మ వరాలుగా భావించి, వాటియొక్క పరిచర్యలో ఒకదానికొకటి మిళితమై, ఏకత్వం పొందుతున్నందుకు మేము సంతసిస్తున్నాం.

## సంఘానికంతటికి పిలుపు

క్రైస్తవ వివాహబంధం నుండి కుటుంబం ఏర్పడుతుంది. దీనినుండే మానవ సమాజం యొక్క నూతన పౌరులు పుట్టుకొస్తారు. బప్తిస్మంలో పొందిన పవిత్రాత్మ వరాలద్వారా దేవుని బిడ్డలుగా రూపొందుతారు. ఆవిధంగా, శతాబ్దాల తరబడి దేవుని ప్రజలు శాశ్వతంగా ఉండేటట్టు చేయబడుతున్నారు. చెప్పాలంటే, కుటుంబం అన్నది గృహస్య శ్రీసభ (కుటుంబ శ్రీసభ) (లోకానికి వెలుగు శ్రీసభ, 11). చాలామంది సామాన్య వ్యక్తులకు ప్రప్రథమంగా కుటుంబంలో గుర్తింపు ఉంటుంది. దైవప్రజలుగా శ్రీసభనుండి వారి ఆశంసలు (ఎదురాశలు), శ్రీసభకు వారి సహాయాలు కుటుంబ ప్రభావంబట్టి ఉంటుంది. కుటుంబ జీవిత విధానం, శ్రీసభకు ఓ నమూనాగా ఉంటుంది. చాలా కుటుంబాలలోని జీవితం, ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉంటుంది. కుటుంబంలో బలాలు, బలహీనతలు సమ్మేళనమై ఉత్తమంగా ఉంటాయి. తద్వారా ఎదుగుదలకు కావలసిన వాతావరణాన్ని నిలబెట్టుకుంటారు. అయినా, లోపాలు,

ఓటమిలు ఉంటాయని ధైర్యంగా మనం ఒప్పుకోవాలి. ఆవిధంగా, చాలా కుటుంబాలు ఆ ఆదర్శాన్నిఅందుకోలేదు. ఉదాహరణకు – విడాకులు, నిరాధరణలు వాస్తవాలేకదా! ఇడుములతో పోరాడుతున్న కుటుంబాలను విశ్వాస సంఘాలుగా తయారుచేయడంలో సజీవ తోడ్పాటును అందించే శక్తి విచారణకు ఉంది. కుటుంబాలకు విచారణ ఒక నమూనాగా, ఒక ఆధారంగా ఉంటూ, సేవచేయగలదు. ఎందుకంటే, సామాన్య స్త్రీపురుషులు సాన్నిహిత్యం, మద్దతు, అనుకూలత, కుటుంబ జీవితంలో లభించే ప్రాప్యత వంటి అనుభవాలనే క్రైస్తవ సంఘాలలోను ఉండాలని కోరుకొంటారు. ఇది విచారణయొక్క పరిమాణం, వ్యవస్థాగత నడిపింపు, ప్రాధాన్యతలు, గుర్తింపులను సమీక్షించు అవసరతను తెలుపుతుంది. ఇప్పటికే ఉద్దేశపూర్వక సంఘాలకు, క్రైస్తవ మౌలిక సంఘాలకు, పునరుజ్జీవన పరచిన విచారణా సంఘాలకు దారితీసింది. ఈ రకమైన సామాన్య క్రైస్తవుల ప్రత్యేక లక్షణాలు ప్రభావం చూపుటలో కొనసాగుతూ, క్రైస్తవుల సంఘజీవనాన్ని ఓ రూపానికి తీసుకొస్తున్నాయి. ఆవిధంగా జరిగితే, యాజకవర్గం, తమ పదవి అపేక్షించే ఓరకమైన సమగ్ర నాయకత్వాన్ని, సాధ్యమయ్యేటట్లు చేస్తుంది. అటువంటి సరళిని మేము శ్రీసభలో స్వాగతిస్తాం.






**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 040-27201427, 27200370

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing